చెరువులు ఎందుకంటే..!

వేర్వేరు విధానాలపై హైడ్రా మేధోమథనం

ఈనాడు, హైదరాబాద్: సహజసిద్ధంగా ఏర్పడ్డ చెరువులను రేపటి తరానికి, అవసరాలకు తగ్గట్లుగా తీర్చిదిద్దాలి. ఆక్రమణలను గుర్తించి భూమిని స్వాధీనం చేసుకుని సరస్సుల్లా మార్చాలి. ఈ లక్ష్యంతో కొత్త తరహాలో జలవనరులకు పునరుజ్జీవం కల్పించేందుకు హైడ్రా మేధోమథనం ప్రారంభించింది. చెరువులు ఎందుకు? అనే ప్రాథమిక ప్రశ్నతో చర్చను మొదలెట్టింది. నీటిపారుదలశాఖ, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో పాటు.. పరిశోధన, స్వచ్ఛంద సంస్థలు, నిపుణులతో కమిషనర్ ఏ.వి.రంగనాథ్ విస్తృత స్థాయిలో చర్చలు జరుపుతున్నారు.

ప్రశ్న నుంచి..: 50 ఏళ్ల క్రితం నగరంలోని అనేక చెరువులు వ్యవసాయానికి ఉపయోగపడేవి. నగరీకరణతో.. పొలాలన్నీ కాలనీలయ్యాయి. హయత్‌నగర్, గౌరెల్లి, ప్రతాపసింగారం, తూంకుంట, నార్సింగి వంటి కొన్ని ప్రాంతాల్లో పంట పొలాలు ప్రస్తుతం ఉన్నప్పటికీ.. అవి జోరు వానలపై ఆధారపడిన వ్యవసాయ భూములు. నగర జనాభా నానాటికి పెరగడంతో చెరువులు మురుగు కూపాలుగా తయారయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిండుగా మురుగునీటిని నిల్వ చేయడం అవసరమా అనే అంశంపై చర్చ సాగుతోంది.



మరి ఏం చేద్దాం..: "ఉదాహరణకు.. ఎఫ్‌టీఎల్ పరిధిలోని భూమిని స్వల్పంగా వాలు ఉండేట్లు చదును చేద్దాం. బండర్లు, గట్టలున్న చోట దీవులను నిర్మిద్దాం. చెరువులోకి వచ్చే మురుగు నీటిని వలయం లాంటి నాలాలోకి పంపించి ఎప్పటికప్పుడు శుద్ధి చేయాలి. లేదంటే.. బెంగళూరులో మాదిరి వేర్వేరు దశల్లో వడపోత వ్యవస్థ ఏర్పాటు చేసి స్వచ్ఛంగా మార్చవచ్చు. అలాగని అంత వరకు నిల్వ చేయాల్సిన అవసరం లేదు. ఇదిగా.. తటాకం ప్రాణం పోసుకుంటుంది." అని ఇటీవల జరిగిన ఓ సమావేశంలో నిపుణులు అభిప్రాయపడ్డారు.

నాలాల సంగతేంటి..: భారీ వర్షాల సమయంలో వరద ఉద్ధృతితో నాలాలు ఉప్పొంగుతాయి. కీలక మలుపుల వద్ద ఆక్రమణలను తొలగించి, అవసరమైన చోట లోతును పెంచడం వంటి చర్యలతో నాలాల్లో ప్రవాహాన్ని నియంత్రించవచ్చని హైడ్రా భావిస్తోంది.

ఉత్కంఠ.. ఉద్రిక్తత

హోరెత్తించే నినాదాలు.. వాగ్వాదాలు.. పోలీసుల మోహరింపు.. తోపులాటలు.. లాఠీఛార్జి.. ఇలా ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. శనివారం నగరంలో నెలకొన్న తీరు ఇది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్కంఠ.. ఉద్రిక్తత.



అశోక్‌నగర్ నుంచి సచివాలయానికి బయలుదేరిన గ్రూప్-1 అభ్యర్థులు



ముత్యాలమ్మ ఆలయానికి చేరిన భక్తులు



అభ్యర్థులతో భారాస నాయకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్



పోలీసు వాహనంపై పడుకున్న అభ్యర్థి



మహిళను అరెస్టు చేస్తున్న పోలీసులు

జీవో నంబరు 29 రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు అశోక్‌నగర్‌లో రోడ్డెక్కారు. వీరికి మద్దతుగా కేంద్ర సహాయ మంత్రి, భాజపా నాయకుడు బండి సంజయ్ రావడం.. సచివాలయానికి అభ్యర్థులతో కలిసి బయలుదేరడంతో ఉత్కంఠ నెలకొంది.

సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో ఇటీవల అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నేపథ్యంలో హిందూ, ధార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో భాజపా నాయకులు, హిందూ సంఘాల ప్రతినిధులు ఆలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. లాఠీఛార్జి చేయడంతో చెల్లాచెదురయ్యారు.



లాఠీఛార్జి చేస్తున్న పోలీసులు



బంద్‌తో మూతపడిన దుకాణాలు

డబ్బులు ఇవ్వడం లేదని నాయనమ్మ హత్య

తలను గోడకేసి కొట్టడంతో మృతి



బందెల బాలమ్మ

మేడ్చల్, న్యూస్‌టుడే: డబ్బులు ఇవ్వడం లేదని నాయనమ్మ తలను గోడకేసి కొట్టడంతో మృతిచెందిన ఘటన మేడ్చల్ ఠాణా పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రావల్‌కోల్ గ్రామంలో నివాసం ఉంటున్న బందెల మధు, లక్ష్మిలకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ప్రశాంత్ ఉన్నారు. మధు తల్లి బందెల బాలమ్మ(65) ఇంటి దగ్గరే ఉంటుంది. ఆమె పేరుపై ఉన్న భూమిని ఏడాది క్రితం విక్రయించింది. వచ్చిన డబ్బులతో ఓ మనవరాలి పెళ్లికి కొంత డబ్బు ఇచ్చింది. మరో ఇద్దరి మనవరాళ్ల కోసం బ్యాంకులో కొంత డబ్బు దాచింది. వాళ్లకు ఇవ్వాలని, తనకు ద్విచక్రవాహనం కొనుక్కునేందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశాంత్ రోజులుగా నాయనమ్మతో గొడవ పడుతున్నాడు. మనవడు బలవంతం చేస్తున్నా.. ఆమె ఇవ్వలేదు. రోజూ మాదిరిగానే తండ్రి మద్యం తాగి పడుకున్నాడు. నాయనమ్మ పక్కగదిలో ఉండగా మద్యం తాగి వచ్చిన ప్రశాంత్ ఆమెతో గొడవ పడి తలను గోడకేసి బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. నోరు, చెవుల్లో నుంచి రక్తం వస్తుండగా నాయనమ్మ లేవడం లేదని తల్లి లక్ష్మికి తెలిపాడు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని అదుపులో తీసుకొని కేసు నమోదుచేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

రంగారెడ్డి జిల్లా రెవెన్యూశాఖలో కలకలం

అమోయ్ కుమార్‌కు ఈడీ నోటీసులపై చర్చ

ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా పూర్వ కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)జారీ చేసిన తాఖీదులు జిల్లా రెవెన్యూశాఖలో కలకలం సృష్టించాయి. కేసులో అభియోగాలు ఎదుర్కోవడం కాకుండా... కేవలం సాక్షిగా పిలిచి ఉండవచ్చని ఓ అధికారి తెలిపారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ స్వీయ పరిశోధన..

తాఖీదుల వెనుక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం స్వీయ పరిశోధన ఉండొచ్చని కొందరు రెవెన్యూ, పోలీస్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తుండటంతో, ఈడీ విభాగం అవినీతి నిరోధకశాఖ అధికారుల తరహాలో ఇటీవల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులను నమోదు చేస్తోంది. ఏటా సర్వీసు రికార్డుల్లో వారు సమర్పిస్తున్న ఆదాయ, వ్యయాలను పరిశీలించి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల ఆస్తుల వివరాలను రహస్యంగా సేకరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో అమోయ్‌కుమార్ విధులు నిర్వహిస్తున్నప్పుడు, ఆయనపై పలు ఆరోపణలు రావడంతో ఈడీ వాటిని పరిశీలించి ఉండవచ్చని మరికొందరు అధికారులు భావిస్తున్నారు. దీనిపై అమోయ్‌కుమార్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కట్టడి లేక ముట్టడి

నిరసనలు నిలువరించడంలో పోలీసుల వైఫల్యం

ఈనాడు–సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: రాజధానిలో కొన్ని ప్రాంతాలు శనివారం కొన్ని గంటలపాటు ఆందోళనతో దద్దరిల్లాయి. గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలని, జీవో నంబరు 29 రద్దు చేయాలంటూ అభ్యర్థులు నిర్వహించిన సచివాలయ ముట్టడితో ట్యాంక్‌బండ్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసరాల్లో ఏం జరుగుతుందోననే ఉత్కంఠ అందరిలోనూ కనిపించింది. ఇదే సమయంలో సికింద్రాబాద్‌లోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసం ఘటన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. చివరికి పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది.



- నగరంలో ఎలాంటి ఆందోళనలకు పిలుపునిచ్చినా పోలీసులు పక్కా వ్యూహాన్ని అమలు చేస్తుంటారు. ముందస్తు అరెస్టు చేసి కట్టడి చేస్తుంటారు. దీంతో నాయకులే బయటకు రాకపోవడంతో శ్రేణులు రోడ్డెక్కలేని పరిస్థితి. సికింద్రాబాద్ బంద్‌కు ఒకరోజు ముందే పిలుపునిచ్చినా.. వేలాది మంది ఒకచోటుకు చేరుతారని తెలిసినా అడ్డుకోవడంలో పోలీసులు ఘోరంగా విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులపై రాళ్ల దాడిచేసినా కొంతసేపు ప్రేక్షకపాత్ర పోషించాల్సి వచ్చింది. చివరికి లాఠీఛార్జితో పరిస్థితి అదుపులోకి వచ్చింది.
- అశోక్‌నగర్‌లో గ్రూప్-1 అభ్యర్థులు రెండ్రోజులుగా ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. అయినా అప్రమత్తం కాకపోవడంతో విస్మయానికి గురి చేస్తోంది. వీరికి ప్రధాన పార్టీల నాయకులు మద్దతుగా వస్తే పరిస్థితి అదుపు తప్పే అవకాశం ఉందని పోలీసులు ముందుగా అంచనా వేయడంలో విఫలమయ్యారనే మాటలు వినిపిస్తున్నాయి. అశోక్‌నగర్‌లో ప్రారంభమైన ర్యాలీ ట్యాంక్‌బండ్ మీదుగా సచివాలయం వరకు రాకుండా ముందుగానే అడ్డుకుంటే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనతో అటు సికింద్రాబాద్ ఇటు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో కొన్ని గంటలపాటు ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఓఆర్ఆర్ ఫేజ్-I ట్రయల్ రన్ షురూ



ట్రయల్‌రన్ పనులు పరిశీలిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: అవుటర్ రింగ్‌రోడ్డు చుట్టూ విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటిని అందించే ఉద్దేశంతో చేపట్టిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు ట్రయల్ రన్ మొదలయ్యింది. ప్యాకేజీ-2లో పటాన్‌చెరు నియోజక వర్గంలోని ఉస్మాన్‌నగర్‌లోని నిర్మిస్తున్న రెండు జలాశయాల ట్రయల్ రన్‌ను శనివారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి ప్రారంభించారు. దాదాపుగా రూ.1200 కోట్ల ఖర్చుతో 2500 కి.మీ పైపులైన్లు, కొత్త జలాశయాలు నిర్మిస్తున్నారు. వీటితో దాదాపు లక్ష మందికి తాగునీటిని అందించే అవకాశం ఉంది. దఫదఫాలుగా ఓఆర్ఆర్ ఫేజ్-2ను అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. అమృత్ పథకంలో నిర్మించే 39 ఎస్టీపీల్లో తెల్లాపూర్‌లో చేపట్టనున్న ఎస్టీపీ స్థల ఎంపికను పరిశీలించారు. అనంతరం నల్లగండ్లలో నిర్మిస్తున్న 7ఎంఎల్‌డీ సామర్థ్యం ఉన్న ఎస్టీపీ పనులు చూశారు. నవంబర్ చివరికి నాటికి మిగతా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు.

ఎవరు.. ఎందుకు చంపేస్తున్నారు?

పక్కా పథకం ప్రకారమే..!

- మిస్టరీలుగా మిగిలిపోతున్న పలు హత్యలు
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న కేసుల దర్యాప్తు



జన సంచారం అస్సలుండదు. ప్రశ్నించేవారుండరు. నిఘా అంతంతే.. ఇదే అవకాశంగా నేరగాళ్లు దారుణాలకు తెగబడుతున్నారు. నగర శివార్లలోని ఫాంహౌస్‌లు, నిర్మానుష్య ప్రాంతాల్లో తరచూ జరుగుతున్న హత్యలు ఆందోళన పుట్టిస్తున్నాయి. కొన్ని కేసుల్లో ఎవరు.. ఎందుకు చంపారో కనుక్కోవడం పోలీసులకు కత్తిమీద సాములా మారుతోంది. ఆచూకీ చిక్కక కేసులు ఏళ్ల తరబడి మిస్టరీలుగానే మిగిలిపోతున్నాయి. కొన్నిసార్లు మృతులెవరో గుర్తించలేని పరిస్థితి. తాజాగా కొత్తగూడ దగ్గర వ్యవసాయ క్షేత్రంలో 50ఏళ్లపైబడిన ఇద్దరు దంపతుల్ని గుర్తు తెలియనివారు దారుణంగా హతమర్చారు. రెండ్రోజులైనా నిందితుల జాడ చిక్కలేదు. ఇదే కందుకూరు ఠాణా పరిధిలోని వ్యవసాయ క్షేత్రాల దగ్గర గతేడాది వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు హత్యకు గురైనా ఇప్పటికీ మిస్టరీలుగా మిగిలాయి. తాజాగా నగరంలోని బాగ్‌అంబర్‌పేట డీడీకాలనీ, సాయిబాబానగర్‌లో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులను సైతం చంపడం ఆందోళనకు గురి చేస్తోంది.

శివార్లలో జరిగే హత్యలు, ఇతర నేరాలు పథకం ప్రకారమే జరుగుతున్నట్లు పోలీసులు స్పష్టం చేస్తున్నారు. మెయినాబాద్, శంషాబాద్, శామీర్‌పేట, ఇబ్రహీంపట్నం, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లో వేల సంఖ్యలో ఫాంహౌస్‌లున్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధి సుదీర్ఘంగా ఉండడంతోపాటు.. నిర్మానుష్య, అటవీ ప్రాంతం ఉంటుంది. జనసంచారం.. పెట్రోలింగ్ తక్కువ. దీంతో దారుణాలకు తెగబడుతున్నారు. ఇటీవల ఓ ముఠా శంషాబాద్ సమీపంలో అక్రమంగా ఫాంహౌస్ నిర్మించి కుక్కలు పెంచుతోంది. భూదందాల్లో వారిని ఎదిరించిన వారిని కిడ్నాప్ చేసి ఫాంహౌస్‌లో బంధించి చిత్రహింసలు పెడుతున్నట్లు గుర్తించిన రాజేంద్రనగర్ పోలీసులు రెవెన్యూ శాఖతో కలిసి కూల్చేశారు.

ఈ కేసులన్నీ మిస్టరీలే


- ఆదిభట్ల ఠాణా పరిధి బ్రాహ్మణపల్లి ఓఆర్ఆర్ సమీపంలో జనవరి 16న గోనెసంచిలో మృతదేహం లభ్యమైంది. నిందితులు ఎక్కడో చంపేసి ఔటర్ రింగురోడ్డు పక్కన విసిరేశారు. మృతుడు, హంతకుడిని ఇంతవరకూ గుర్తించలేదు. నిర్మానుష్య ప్రాంతం కావడంతో ఆధారాలు చిక్కలేదు.
- 2023 మార్చిలో దాసర్లపల్లిలోని ఓ ఫాంహౌస్‌లో మహిళ(45) దారుణ హత్యకు గురైంది. నిందితుల జాడ దొరకలేదు. ఇది జరిగిన మూడు నెలలకే ఆగాపల్లిలో మామిడితోటకు కాపలాగా ఉండే దంపతుల దగ్గరికి బంధువు వచ్చి రాత్రి నిద్రించాడు. తెల్లవారేసరికి అతణ్ని దారుణంగా చంపేశారు.
- శంషాబాద్ మండలం తొండుపల్లి శివారులో 2019 మార్చిలో కాలిపోయిన గుర్తు తెలియని యువతి మృతదేహం వెలుగుచూసింది. ఓ కారు వచ్చి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో గుర్తించారు. రాత్రి కావడంలో స్పష్టత లేదు.
- నార్సింగి ఠాణా పరిధిలో 2019లో మహిళ మృతదేహం లభ్యమైంది. గుర్తుపట్టకుండా ముఖాన్ని పెట్రోలుతో తగులబెట్టారు. ఇతర ప్రాంతంలో చంపేసి ఔటర్ రింగురోడ్డు పక్కన విసిరేశారు. ఈ కేసు ఇప్పటికీ తేలలేదు.

ఈనాడు, హైదరాబాద్, కందుకూరు, న్యూస్‌టుడే

కానివారికి కట్టబెట్టి

లెక్కలన్నీ పక్కన పెట్టి..

- కూకట్‌పల్లి భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీలో అడ్డగోలుగా విక్రయాలు
- తక్కువ ధరలకే ప్లాట్లు, ఫ్లాట్లు.. రూ.కోట్లలో దుర్వినియోగం



ఈనాడు, హైదరాబాద్, కూకట్‌పల్లి, శామీర్‌పేట్, న్యూస్‌టుడే

కూకట్‌పల్లి భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్లాట్లు, ఫ్లాట్లు విక్రయించి వాటిని ఖాతా పుస్తకాల్లో నమోదు చేయకుండా రూ.కోట్లలో దుర్వినియోగం చేశారు. అక్రమాలపై కొందరు తొమ్మిదేళ్ల క్రితం ఫిర్యాదు చేయగా.. మేడ్చల్ జిల్లా సహకార శాఖ అధికారులు విచారణ చేపట్టారు. గతేడాది డిసెంబర్‌లో 14 ఆరోపణలకు సంబంధించి విచారించగా.. అక్రమాలు జరిగాయని సాక్ష్యాధారాలు లభించాయి. దీనిపై నెలరోజుల్లోపు సమాధానం ఇవ్వాలని అధికారులు గతనెల 20న సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులకు తాఖీదులు పంపించారు. ఈ విషయాన్ని సొసైటీ అధ్యక్షుడు సైదేశ్వర్‌రావు ధ్రువీకరించారు.

డిమాండ్‌తో పక్కదారి..

కూకట్‌పల్లిలో 60ఏళ్ల క్రితం భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ పేరుతో కొందరు వ్యక్తులు సొసైటీని స్థాపించారు. పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు పట్టాలు కొనుగోలు చేసి వాటిని సభ్యులుగా చేరినవారికి వాయిదాల పద్ధతిన విక్రయిస్తున్నారు. తరువాత హైటెక్ సిటీ, బాహ్యవలయ రహదారి అందుబాటులోకి రావడంతో ఈ స్థలాలకు డిమాండ్ పెరిగింది. కొందరు మేనేజింగ్ కమిటీ సభ్యులు ఆశతో 2008నుంచి సభ్యులు కానివారికి కూడా విక్రయించడం మొదలు పెట్టారు. వీటిలో కొన్నింటిని గిఫ్ట్‌డీడ్ కింద అమ్మేశారు. ఒక ప్లాటును బిల్డర్‌కు డెవలప్‌మెంట్‌కు ఇచ్చి.. నాలుగు ఫ్లాట్లు తీసుకున్నారు. ఈ ఫ్లాట్లలో ఒక ఫ్లాట్‌ను రూ.37.5 లక్షలకు విక్రయించి పుస్తకాల్లో నమోదు చేయలేదు. ప్లాట్ల పక్కనే ఉన్న ఒక ప్లాటును సొసైటీ సభ్యుడు కాని వ్యక్తికి రూ.34.32లక్షలకు విక్రయించి కూడా నమోదు చేయలేదు. అక్రమాలు బయటపడకుండా 2007-08నుంచి 2015 వరకు, 2016 నుంచి గత ఆర్థిక సంవత్సరం వరకూ ఖాతాలకు సంబంధించి ఆడిట్ నిర్వహించలేదు. మొత్తం రూ.5.70కోట్ల మేరకు అక్రమాలు చోటుచేసుకున్నట్లు అధికారులు గుర్తించారు.

ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘనలు

సొసైటీ ప్రతినిధులు ఉద్దేశపూర్వకంగానే నిబంధనలు ఉల్లంఘించినట్టు తేలింది. నగదు అక్రమాలు, ఖాతాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించారు. ఇష్టారాజ్యంగా ప్లాట్లు, పాట్లు విక్రయించేశారు. బైలాస్‌ను పట్టించుకోలేదు. అందుకే తాఖీదులు జారీచేశాం. **- టి.వెంకట్‌రెడ్డి, రిజిస్ట్రార్, సహకారశాఖ, మేడ్చల్**

తీరుమారని 'గౌతమి'

మూడు గంటల ఆలస్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ మీదుగా బయలుదేరే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం మూడు గంటలు ఆలస్యమైంది. లింగంపల్లి నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు 9.05 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి 9.15 గంటలకు తిరిగి బయలుదేరుతుంది. శనివారం రాత్రి 3.15 గంటల ఆలస్యంగా 12.30 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ప్రతిసారి ఇదే తంతు కొనసాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అది చిరుత కాదు.. అడవి పిల్లి

స్పష్టం చేసిన అటవీశాఖ అధికారులు

మియాపూర్: మియాపూర్‌లో శుక్రవారం మెట్రో స్టేషన్ సమీపంలో కనిపించింది చిరుత కాదని అడవి పిల్లి అని అటవీశాఖ అధికారులు స్పష్టంచేశారు. పాదముద్రల ఆధారంగా గుర్తించినట్లు శంషాబాద్ జోన్ ఎఫ్‌డీవో విజయానంద్‌రావు స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో సేకరించిన పాద ముద్రలు కేవలం 3.5-4 సెంటీమీటర్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. చిరుత పులికి సంబంధించి సుమారు 7-8 సెంటీమీటర్ల వరకు పాదముద్రలు ఉంటాయని వివరించారు.

గుమ్మం నుంచి గమ్యం దాకా..

తొలుత లాస్ట్‌మైల్ అనుసంధానంపై మెట్రో దృష్టి

ఈనాడు, హైదరాబాద్

మెట్రోరైలు ప్రయాణం సౌకర్యంగా ఉన్నా... స్టేషన్ దాకా, మెట్రో దిగిన తర్వాత గమ్యం చేరేవరకు ప్రయాణికులు ఆపసోపాలు పడుతున్నారు. దీనికి పరిష్కారంగా స్టేషన్ల వద్ద లాస్ట్ మైల్ సదుపాయానికి మెట్రో సంస్థ వేర్వేరు మొబిలిటీ సంస్థలతో ఒప్పందం చేసుకుంటోంది.

ఇక్కడ ఇలా: నగరంలో 57 మెట్రోరైలు స్టేషన్లు ఉండగా కొన్ని స్టేషన్ల నుంచే ప్రస్తుతం యాప్ ఆధారిత ఫీడర్ సేవలు ఉన్నాయి. యాప్‌లో బుక్ చేసుకోవడంతో షేరింగ్ బైక్, ఆటో, క్యాబ్, బస్సు సేవలను అందిస్తున్నాయి. ఈ సౌలభ్యం అన్ని స్టేషన్లలో లేదు. ఏప్రిల్ నుంచి నెలవారీ ప్రయాణికుల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తోంది. ప్రజారవాణాను మరింతగా పెంచేందుకు అనుసంధాన ప్రక్రియను దశలవారీగా చేపట్టారు. తొలుత లాస్ట్ మైల్ కనెక్టివిటీపై దృష్టి పెట్టారు. ఇప్పటికే పలు సంస్థలతో ఒప్పందం చేసుకున్నామని.. మరికొన్నింటితో చర్చలు జరుగుతున్నాయని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.

ఇప్పటివరకు.. 31 ప్రాంతాల నుంచి ఎలక్ట్రికల్ ఆటోలు, 7, 12 సీట్ల వాహనాలు, బైక్ సేవలను అందిస్తున్నాయి. ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఐదింటిని 30 నిమిషాల వ్యవధిలో ఫీడర్ సర్వీసులను కారిడార్-1, 3 పరిధిలో నడుపుతున్నారు.

2024లో మెట్రో ప్రయాణికులు

నెల	సంఖ్య
ఏప్రిల్	1,23,95,205
మే	1,31,05,805
జూన్	1,37,58,373
జులై	1,44,54,276
ఆగస్టు	1,45,89,269



దివ్యాంగులకు ప్రజల సహకారం అవసరం



దివ్యాంగులతో అమ్మానాన్న సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: దివ్యాంగులకు సామాన్యులు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారాన్ని అందించాల్సిన అవసరం ఉందని అమ్మానాన్న సంక్షేమ సంఘం అధ్యక్షురాలు తులాల శ్రీలత అన్నారు. కార్ఖానా ఓల్డ్ వాసవినగర్‌లో దివ్యాంగుల ఆశ్రయం పొందుతున్న పామెన్‌క్యాప్ సంస్థను శనివారం అమ్మానాన్న సంక్షేమ సంఘం ప్రతినిధులు, సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల స్థితిగతులను తెలుసుకున్న తులాల శ్రీలత పామెన్‌క్యాప్‌లో అన్నదానం చేసి, దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో బాలనరసింహ, శ్రీకాంత్, సుబ్రహ్మణ్యం, రమేశ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

21న ఎంబీ ఎస్సీల సభ విజయవంతానికి పిలుపు

అడ్డగుట్ట: దళితుల్లో అత్యంత వెనుకబడ్డ 57 ఎంబీ ఎస్సీ కులాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు, ధర్నా చౌక్ వద్ద జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీకె వెంకటేశం ఆధ్వర్యంలో జరుగనున్న నిరసన దీక్షకు హైదరాబాద్ జిల్లాలోని ఆయా కులాల ప్రజలు వేలాదిగా తరలిరావాలని ఎస్సీ 57 ఎంబీ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉడుదే సదానంద్ మాంగారోడి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం తుకారాం గేట్ మరాఠా బస్తీలో చలో హైదరాబాద్ నిరసన దీక్ష గోడపత్రికను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా కుల గణన జరిగిన తరువాత నూతన జనాభా లెక్కల ఆధారంగానే చేపట్టాలని ఎంబీ ఎస్సీ కులాలకు ఏడు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కమిటీ ప్రతినిధులు ఎస్. అరుణ్ లాల్, జిట్టిల్ గణేశ్, రత్తిలాల్, కష్టే విజయ్, మహేష్ మోతిలాల్, కిషన్, మనోజ్ పాల్గొన్నారు.

టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణయాదవ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎం. కృష్ణయాదవ్, ఎన్నికయ్యారు. శనివారం టీజీవోస్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ సమక్షంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సహదేవ్, సహాయ అధికారిగా టీ. లక్ష్మణ్‌గౌడ్ వ్యవహరించారు. సంఘం సహ అధ్యక్షుడిగా ఆశన్న, కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షులుగా డా. ఎస్. నరేందర్, రాజేందర్, ఎలిజబెత్‌రెడ్డి, సహ కార్యదర్శిగా పూనం, ప్రచార కార్యదర్శిగా మంచాల రవీందర్, కార్యాలయ కార్యదర్శిగా గోపాలకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా డా. రమేష్, క్రీడా కార్యదర్శిగా డా. సందీప్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మారేడుపల్లి: వెస్ట్ మారేడుపల్లి అల్లాడి పెంటయ్య నగర్‌లోని మైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వార్షిక వేడుకలు ఆలయ నిర్వాహకుడు సి.కృష్ణ యాదవ్ దంపతుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో వివిధ పూజలు, హోమాలు కొనసాగాయి. ఆలయ ఆవరణలో అన్నదానం చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట డివిజన్ భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతి ఇ.చంద్రశేఖర్, నర్సింగ్‌రావు, శేషగిరి తదితరులు స్వాగతించారు.

దోషులను శిక్షించాలంటూ ఆందోళన

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లోని ఓ ప్రార్థన మందిరంలో జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం సీతాఫల్‌మండి డివిజన్‌లో నిరసన ర్యాలీ చేపట్టారు. రోజులు గడుస్తున్నా దోషులను శిక్షించకపోవడాన్ని తప్పుబడుతూ నినాదాలు చేశారు. ర్యాలీలో కార్పొరేటర్ సామల హేమ, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉపమేయర్‌ను కలిసిన ఈఈ

లాలాపేట: ఇటీవల సికింద్రాబాద్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధుల్లో చేరిన వెంకట్‌సాయి శనివారం ఉపమేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డిని తార్నాకలోని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. డీఈ సువర్ణ, ఏఈ వేణు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం సంత.. ఆదరణ కొండంత



శంఖం పనితీరును పరీక్షిస్తున్న యువతి

సనత్‌నగర్, న్యూస్‌టుడే: అంతర్జాలంలో కొనుగోళ్లు పెరిగిపోతున్న రోజులివి. ఏం కావాలన్నా యాప్ ద్వారా ఆర్డర్ చేయగానే.. ముంగిటకే వచ్చి వాలుతున్నాయి. నిన్న మొన్నటి వరకు షాపింగ్ మాల్స్, సూపర్ బజార్ వంటి సంస్థలను ఆశ్రయించిన కొనుగోలుదారులు ప్రస్తుతం ఆన్‌లైన్, డిజిటల్ మార్కెట్ల వైపు మళ్లారు. ఈ పరిస్థితుల్లో నాటి తరం అంగళ్లను (సంతలు) పట్టించుకునే వారే కనిపించడం లేదు. సాంకేతిక ఇంత అభివృద్ధి చెందినప్పటికీ ఎర్రగడ్డ సంతకు ఆదరణ కొనసాగుతోంది. ఆదివారం వచ్చిందంటే కొనుగోలుదారులను ఆకర్షించేలా వ్యాపారుల అరుపులు, బేరసారాలు, ఆశ్చర్యం కలిగించే అరుదైన వస్తువులు.. చూసేవారికి ఏదైనా కొనాలనిపించేలా ఉంటాయి.



పురాతన నాణేల విక్రయం



నాటు కోళ్లు

వందేళ్ల ఎర్రగడ్డ మార్కెట్‌కు ఎన్నెన్నో ప్రత్యేకతలు

అంగట్లోనే అన్నీ ఉన్నాయ్..

ఎర్రగడ్డ సంతలో దాదాపు రెండు వేల మంది నాటి, నేటి తరాల వ్యాపారులు వ్యాపారం సాగిస్తున్నారు. ఇక్కడ లభించని వస్తువంటూ లేదు. పనికిరావని పారవేసే పాత వస్తువుల నుంచి కంప్యూటర్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, నిన్న మొన్నటి పవర్ బ్యాంకులు, పాదరక్షలు, గృహోపకరణాలు, ఇనుప వస్తువులు, నిర్మాణ సామగ్రి, యంత్రపరికరాలు, స్మార్ట్ ఫోన్లు, ఛార్జర్లు, రెడీమేడ్ దుస్తులు, పాత దుస్తులు, వంట సామగ్రి, పాత సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, కారు చవకగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన బూట్లు, పాదరక్షలు, ఆహార ధాన్యాలు, తినుబండారాలు, పాత కరెన్సీ నోట్లు, నిజాం, బ్రిటీష్ కాలం నాటి నాణాలు, నవాబుల కాలం నాటి వస్తువులు, అలంకరణ సామగ్రి, గృహోపకరణ వస్తువులు, విద్యుత్తు పరికరాలు, సౌందర్య సాధనాలు, అత్తర్లు, పాతతరం గ్రామఫోన్లు, సీడీలు కనిపిస్తాయి. వీటితో పాటు నాటు కోళ్లు, బాతులు, గిన్నె కోళ్లు, పావురాలు, పక్షులు, మేకలు, గొర్రెలు కూడా ఎర్రగడ్డ సంతలో అమ్ముడవుతుంటాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. ప్రతీ ఆదివారం తెల్లవారు జామున 5 గంటల నుంచే ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది.



రోడ్డుపైనే కంప్యూటర్ విడిభాగాల విక్రయం

సంత వయసు: దాదాపు వందేళ్లు
పొడవు: దాదాపుగా 3 కిలోమీటర్లు
విస్తరణ: ఎర్రగడ్డ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పెట్రోల్ బంకు వరకు, ఎర్రగడ్డ చౌరస్తా నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు
లభించే వస్తువులు: సుమారు లక్ష రకాలు
కొనుగోలుదారుల సంఖ్య: 50 వేలకు పైగా..
వర్తకుల సంఖ్య: సుమారు 2 వేలు

నిజాంల కాలం నుంచి కొనసాగుతూ..

వందేళ్లకు పైగా 1910 నిజాంల హయాం నుంచి కొనసాగుతున్న ఎర్రగడ్డ సంతలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. గుండు సూదుల నుంచి గునపాల వరకు, పనికిరాని వస్తువుల నుంచి కంప్యూటర్ విడిభాగాల వరకు, నాటు కోళ్ల నుంచి నిజాం కాలం నాటి అరుదైన అరుదైన నాణేల వరకు ఏది కావాలంటే అది ఎర్రగడ్డలోని ఆదివారం సంతలో లభ్యమవుతుంది. చాలా సంవత్సరాల కిందట ఆదివారం సంత నిర్వాహకుకు ఎర్రగడ్డలో విశాలమైన స్థలం ఉండేది. ఆ తరువాత పట్టణీకరణ నేపథ్యంలో అంగడి నిర్వాహణకు అవసరమైన స్థలం లేక రోడ్డుపైనే కొనసాగిస్తున్నారు. పేద, మధ్య తరగతి కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఎర్రగడ్డ సంత వందల సంఖ్యలో వ్యాపారులకు జీవనోపాధిని కల్పిస్తోంది. గతంలో ఈ సంత ఎర్రగడ్డ వద్ద జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లపై కొనసాగేది. ఇటీవల ఎర్రగడ్డ కూడలి నుంచి సనత్‌నగర్ మీదుగా ఫతేనగర్ రైల్వే స్టేషన్ వరకు వరకు విస్తరించింది.

భారతీయ జ్ఞానసంపదతో ఆసక్తి కలిగించేలా బోధన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: విద్యార్థులకు భేతాళ కథలు, పంచతంత్రం, వ్యాకరణం ద్వారా ఆసక్తికరంగా ఉండేలా ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని ఐఐటీ హైదరాబాద్ హెరిటేజ్ అండ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ కోరాడ సుబ్రహ్మణ్యం అన్నారు. సికింద్రాబాద్ ఎస్టీరోడ్డులోని సెయింట్ ఆన్స్ బీఈడీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భారతీయ జ్ఞాన సంపద భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో సదస్సును ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ మేరీ కుట్టీ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా బంద్.. ప్రయాణికుల ఇబ్బందులు



లగేజీతో నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడ ఘటనను నిరసిస్తూ శనివారం హిందూ సంఘాలు చేపట్టిన బంద్ ప్రశాంతంగా సాగింది. సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు, హోటళ్లను మూసివేసి మద్దతు తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, మోండా మార్కెట్, సుభాష్ రోడ్డు, ప్యారడైజ్, పీజీరోడ్డు, రాణిగంజ్, రాంగోపాల్‌పేట్ తదితర ప్రాంతాల్లోని వ్యాపార, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఆందోళనకారులు వివిధ పాంతాల్లో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. మహంకాళి ఆలయం వద్ద నుంచి ఆలయానికి చేరుకున్న ర్యాలీలో కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర, శ్రావణ్, ఓబీసీ ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్, హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. లాఠీఛార్జి అనంతరం పోలీసులు ఆందోళనకారులను చెల్లాచెదురు చేసినా.. మళ్లీ దేవాలయం వద్దకు కొంత మంది చేరుకుని కొనసాగించారు. దీంతో పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు నచ్చజెప్పినా.. రోడ్డు మీదే కూర్చుండిపోవడంతో తిరిగి లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. అక్కడున్న ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టి రాకపోకలను పునరుద్ధరించారు. ట్రాఫిక్ నిలిచిపోవటంతో బస్సులు, ఇతర వాహనాల్లో వచ్చిన ప్రయాణికులు తమ లగేజీలతో తీవ్ర ఇబ్బందులు పడుతూ నడిచివెళ్లారు. శనివారం ఉదయం దేవాలయానికి చేరుకున్న శివసత్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. లాఠీఛార్జిలో గాయపడి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్యే తలసాని ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

సికింద్రాబాద్, సనత్‌నగర్, న్యూస్‌టుడే:

? సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను సరిగా నిర్వహించడం లేదు. రోజూ చెత్తను తొలగించాలి. – గోపాల్, మైలార్‌గడ్డ

✓ ఆ ప్రాంతంలో నిత్యం శుభ్రంగా ఊడ్చి పోగైన చెత్తను తీసివేసేలా చర్యలు చేపడతాం. – రజనీకాంత్, వైద్యాధికారి, సికింద్రాబాద్

? సనత్‌నగర్ డివిజన్‌లోని కేఎల్ఎన్ ఉద్యానం ముందు ఆదిత్యానగర్ రోడ్డులో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తకుప్పలు పెరిగిపోయాయి. స్థానికులు చెత్తను తీసుకువచ్చి అక్కడ పోస్తున్నారు. – శంకర్‌గౌడ్, తులసీనగర్

✓ పరిశీలించి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్తను తొలగించేందుకు చర్యలు చేపడతాం. – అరవిందకుమార్, ఎస్ఎఫ్ఏ, సనత్‌నగర్

ఓయూ వీసీకి సత్కారం

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నూతనంగా వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొ.కుమార్‌ను శనివారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు కలిసి సన్మానించారు. అనంతరం వర్సిటీలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, జాతీయ కార్యదర్శి డాక్టర్ పల్లెర్ల సుధాకర్ మాదిగ, డాక్టర్ ఏర్రం నాగేంద్రం మాదిగ, రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి రఘువరన్ మాదిగ, వంగాల వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

‘వీసీల నియామకాల్లో మాలలకు తీవ్ర అన్యాయం’

లాలాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీలకు ప్రకటించిన వీసీల నియామకాల్లో మాలలకు తీవ్రమైన అన్యాయం జరిగిందని ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మంచాల లింగస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాలలను పూర్తిగా విస్మరించిందనీ.. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను ప్రకటిస్తే ఒక్క మాల ప్రొఫెసరును కూడా ఎంపిక చేయకపోవడం శోచనీయమన్నారు. అంసా రాష్ట్ర కార్యదర్శి నీరడి సూర్యం, ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, రాష్ట్ర నాయకులు దుగ్గి సురేష్, గాజుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General Public are hereby informed and notified that my client SMT VARADA PRASANNA LAKSHMI, W/o Varada Venu Gopal, Aged 52 Yrs, Occ: House Wife and VARADA VENU GOPAL, S/o Varada Venkata Satyanarayana, Age: 52 Yrs Occ: Pvt Employee, both are R/o H.No.8-3-168/B37, Laxmi Nagar, Yousufguda, Hyderabad, Telangana 500038 intending to purchase the property bearing H.No. 7-2-467, SRT-246, admeasuring 150 Sq yards or 125.42 Sq meters situated at Sanathnagar, Hyderabad, Telangana and bounded by North: H.No SRT 245,, South: H.No. SRT 247, East: H.No. SRT 237 and West: Road from Javvadi Veera Raghavamma, W/o Late J.Satyanarayana, Javvadi Venkata Sri Nagesh, S/o Late J.Satya- narayana, Javvadi Vanaja Lakshmi, D/o Late J.Satyanarayana all three are R/o H.No. SRT 246, Sanathnagar, Hyderabad, Javvadi Sailaja, D/o Late J.Satyanarayana, W/o Sunkara Subrahmanyam, R/o B-409, Bhavyas Tulasivanam, Navodaya Colony, Kukatpally, Medchal Malkajgiri Dist and Puthineedi Venkata Padmaja, D/o Late J.Satyanarayana, W/o P. Kasi Viswanadh, R/o Flat No. 655, Plot No. 303, Padma Nagar Phase-2, Moksha Avenue, Chintal, Jeedimetla, Medchal Malkajgiri Dist who are the legal heirs of Late Javvadi Satyanarayana.

In the event of anybody having any claim or interest in the said property or any objections for the said transaction, must approach the undersigned along with the all original documents substantiating the claim or objections within 15 days from this date and thereafter no claim or objections will be entertained and my client will proceed for completion of registration formalities of the transfer deed.

Sd/- **M.RANJITH KUMAR, K.ARAVIND REDDY, SALONE JAIN,** ADVOCATES
FLAT No 3, H.No. 2-1-338/A, H.K Apartment, Nallakunta, Hyderabad. **98494 25728**

మానవ అక్రమ రవాణాపై అవగాహనకు నిశబ్ద నడక



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బృందాకర్‌రావు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ఏ21 ‘గ్లోబల్ వాక్ ఫర్ ఫ్రీడమ్’ నిశబ్ద నడక పేరుతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నడకను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాకర్‌రావు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ సెయింట్ మేరీస్ కాలేజ్, వైఎంసీఏ సికింద్రాబాద్‌తో కలిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మానవ అక్రమ రవాణా వంటి క్రూరమైన నేరాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏసీపీ ఆంజనేయులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్, వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ లియోనార్డ్ మైరన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు



మంత్రి పొన్నంతో ఎమ్మెల్యే శ్రీగణేశ్, ఆలయ కమిటీ సభ్యులు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన సంఘటన గురించి దేవాలయ కమిటీ సభ్యులతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశారు. జరిగిన ఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు పాల్పడిన దుండగుడికి కఠినమైన శిక్ష పడేలా చేస్తామన్నారు. ఈ సంఘటనను రాజకీయం చేయకుండా అందరూ సహకరించాలని అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ తన సొంత నిధులు రూ.10 లక్షలు, ప్రభుత్వం నిధుల నుంచి రూ.10 లక్షలు దేవాలయ పునర్నిర్మాణానికి అందజేస్తామని దేవాలయ కమిటీ ప్రతినిధులకు తెలిపారు. దీనికి దేవాలయ కమిటీ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మానసిక ఆరోగ్యంతో సుఖమయ జీవనం



ప్రసంగిస్తున్న స్వీకార్ ఫౌండేషన్ చైర్మన్ హన్మంతరావు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సైకాలజిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని స్వీకార్ ఫౌండేషన్ ఛైర్మన్, పద్మశ్రీ అవార్డు గ్రహీత హన్మంతరావు అన్నారు. శనివారం ఉదయం తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సూర్యటవర్స్‌లో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యక్తి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే మానసికంగా ఆరోగ్యం చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు ఎన్నో ఒత్తిళ్లకు లోనవుతూ రకరకాల మానసిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వారిలో మనోస్థైర్యాన్ని నింపాల్సింది సైకాలజిస్టులేనని అన్నారు. యువతకు మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ అంశంపై అవగాహన కల్పించటానికి తెలంగాణ సైకాలజిస్టులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సైకాలజిస్టులు డాక్టర్ ప్రీతి స్వరూప్, డాక్టర్ హరిణి అట్టురు, డాక్టర్ అర్చనలు పాల్గొన్నారు.

పరిశ్రమలో పెట్టుబడులంటూ.. రూ.కోట్లు కాజేసిన దంపతుల రిమాండ్

నారాయణగూడ: పరిశ్రమలో పెట్టుబడులు పెడితే భాగస్వామ్యం ఇస్తామని నమ్మించి రూ.కోట్లు కాజేసిన దంపతులను హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారిపై బోయినపల్లి, తిరుమలగిరి, మహంకాళి ఠాణాలో కూడా చీటింగ్ కేసులున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిక్కడపల్లికి చెందిన హెచ్.దినేష్ (50), జ్యోతి (47) దంపతులకు సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కిరాణా దుకాణం ఉంది. కీసరలో అభినవ్ ఇండస్ట్రీ పేరుతో పేపర్ తయారీ పరిశ్రమ సైతం నిర్వహిస్తున్నారు. పరిశ్రమలో పెట్టుబడులు పెడితే మంచి కమీషన్‌తో పాటు భాగస్వామ్యం కూడా ఇస్తామని నమ్మించి రూ.కోట్లు దండుకున్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన వ్యాపారి పి.లక్ష్మణ్(55) వారి మాటలను నమ్మి తన బంధువులు, స్నేహితుల నుంచి సేకరించి మొత్తం రూ.1.10 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత పార్ట్‌నర్‌షిప్, లాభాలు ఇవ్వకుండా తప్పించుకోవడం మొదలుపెట్టారు. ఆరు నెలలు గడిచిన వారి నుంచి స్పందన రాకపోవడంతో తన పెట్టుబడిని వెనక్కి ఇవ్వాలని దంపతులను నిలదీశాడు. నెల రోజు క్రితం రూ.1.10 కోట్లకు చెక్ ఇచ్చారు. కానీ చెల్లలేదు. గత్యంతరంలేని పరిస్థితిలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై యుగంధర్ దంపతులను రిమాండ్‌కు తరలించారు.

బాలుర ఆశ్రమం నుంచి విద్యార్థి అదృశ్యం

సనత్‌నగర్, న్యూస్‌టుడే: బాలుర ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న బాలుడు కనిపించకుండా పోయాడు. వివరాలను సనత్ నగర్ ఎస్సై కృష్ణ గౌడ్ తెలిపారు. భరత్‌నగర్ కాలనీలోని ఎంఐజీ 41లో నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి కృపా బాలుర ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న ఎం.నర్సింహ (14) బేగంపేటలోని శ్రద్ధ పాఠశాలలో అయిదో తరగతి చదువుతున్నాడు. స్వల్ప మానసిక సమస్యతో బాధపడుతున్న నర్సింహ శుక్రవారం ఉదయం 8 గంటలకు శివాలయానికి వెళ్తున్నట్టు చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో అతడి కోసం గాలించిన ఆశ్రమ నిర్వాహకులు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్వాహకుడు ఎ.నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్తు ఉద్యోగుల ఘర్షణ.. ఒకరికి గాయాలు

కార్ఖానా, న్యూస్‌టుడే: ఇద్దరు విద్యుత్తు ఉద్యోగుల మధ్య ఘర్షణలో ఒకరు గాయాలపాలైన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిందని ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బొల్లారం విద్యుత్తు సెక్షన్ కార్యాలయంలో రాము లైన్‌మెన్‌గా, ప్రసాద్ లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం లాల్‌బజార్‌లో ఇద్దరి మధ్య తగాదా తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. దీంతో కోపోద్రిక్తుడైన ప్రసాద్ మొదట కుర్చీతో, ఆపై ఓ ఇనుప రాడ్‌తో రాముపై దాడికి పాల్పడ్డాడు. తలకు గాయమైన రామును తోటి ఉద్యోగులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి, అక్కడి నుంచి సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: వేగంగా దూసుకువచ్చిన బైకు ఢీకొనటంతో మరో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి కిందపడి తలకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సార్‌నగర్ పోలీసు పోలీసులు తెలిపారు. యూసుఫ్‌గూడ శ్రీనగర్‌కాలనీ సమీపంలోని శాలివాహన కాలనీకి చెందిన కోనేరు అరుణ్‌కుమార్ (43) ఈ నెల 16న వ్యక్తిగత పనిమీద తన బైకుపై బయటకు వెళ్లాడు. రాత్రి 10 గంటల ప్రాంతంలో ఎర్రగడ్డలోని పిల్లర్ నెం.972 వద్ద త్రినాథ్ పలమణి అనే అపోలో మెడిసిన్ డెలివరి బాయ్ బైక్‌పై వేగంగా యూటర్న్ తీసుకుంటూ అరుణ్‌కుమార్ వాహనాన్ని ఢీకొట్టాడు. కిందపడిన అరుణ్‌కుమార్ తలకు తీవ్ర గాయాలవడంతో స్థానికులు అతడి ఫోన్ నుంచి కుమారుడు మనోహర్ ప్రసాద్‌కు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడికి చేరుకుని తండ్రిని అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మనోహర్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు ఎస్సార్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురి అరెస్టు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: డ్రగ్స్‌కు అలవాటుపడి కొనుగోలు చేసేందుకు డబ్బు లేక చివరికి వాటి అమ్మకందార్లుగా మారిన ముగ్గురిని అమీర్‌పేట ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.2.15 లక్షలు విలువ చేసే ఎండీఎంఏ మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.7లో బైక్‌పై ముగ్గురు వ్యక్తులు డ్రగ్స్ తరలిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్టీఎఫ్ సీఐ మహేష్, ఎస్సై వరదా భూపాల్, ఇతర సిబ్బంది ఆకస్మికంగా దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద 22.33 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో సుధాకర్‌రెడ్డి, నితిన్, ప్రకాష్‌లు చిత్తూరు జిల్లా పీలేరులో ఉంటున్న సుదర్శన్‌రెడ్డి వద్ద డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరికి డ్రగ్స్ సరఫరా చేసిన సుదర్శన్‌రెడ్డిపైనా కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వృద్ధురాలి పట్టివేత

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ఇంట్లో గంజాయి విక్రయిస్తున్న ఓ వృద్ధురాలిని బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసినట్లు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఫతేనగర్‌లో ఓ ఇంట్లో గంజాయి విక్రయంపై సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. జతిన్‌బి (70) అనే మహిళను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు

కనబడుట లేదు



ఈ ఫోటోలో ఉన్న వ్యక్తి పేరు సునీల్ శర్మ (టన్ను) అనే వ్యక్తి రాజస్థాన్ గంగాపూర్ సిటీ నుండి సైనిక్‌పురి 'X' రోడ్డు, సికింద్రాబాద్‌లో పని కోసం వచ్చి గత 5 నెలల నుండి కనబడుటలేదు. దయచేసి ఇతను ఎవరికైనా కనబడినచో ఈ క్రింది ఫోన్ నంబరుకు తెలియజేయగలరు.

వ్యక్తి ఆచూకీ తెలిపినవారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

సునీల్ శర్మ (టన్ను) (వయస్సు: 35)

Ph: 9511509764, 9799461882
Police Station No: 9394776048

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (శనివారం నాటివి..కిలో రూ.లో) టమాటా 41, వంగ 35, బెండ 50, పచ్చిమిర్చి 45, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 28, ఆలు 37, ఉల్లి 44, సొర 17, పొట్ల 23, బీన్స్ 105, గోరుచిక్కుడు 35, చిక్కుడు 65, దోస 35, బీర 45, కాకర 35, చామగడ్డ 45, కీర 45, క్యాప్సికం 75, బీట్‌రూట్ 31, కందగడ్డ 60, చిలకడదుంప 35, మామిడి 65, మునగ 55, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: టమాటా కిలో రూ.41, వంగ 35, బెండ 50, పచ్చిమిర్చి 45, కాకర 35, బీర 45, క్యాబేజీ 26, బీన్స్ 125, క్యారెట్ 40, దొండ 28, చిక్కుడు 65, క్యాప్సికం 75, ఆలు 37, కీర 25, దోస 35, చామగడ్డ 40, అరటి 9, బీట్‌రూట్ 31, సొర 17, గోకర 45, చిలకడదుంప 38, మామిడి 67, మునగ 58.

పింఛనుదారుల సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: రైల్వే పింఛనుదారుల సంక్షేమ సంఘం మల్కాజిగిరి కమిటీ సమావేశం శనివారం సఫిల్‌గూడలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు గురుమూర్తి, నారాయణ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రన్నింగ్ స్టాఫ్‌కు పెన్షన్‌ను నిర్ణయించలేదని.. సెకండరీ ఫ్యామిలీ సభ్యులకు, అవివాహితులకు పింఛను మంజూరు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి మెడికల్ కార్డులు, ఉచిత రైల్వే పాసులు అందటం లేదన్నారు. అధికారులు సమస్యలను పరిశీలించి తగిన న్యాయం చేయాలన్నారు. విద్యాసాగర్, బీకే సింగ్, జనార్దన్ తదితరులు మాట్లాడారు. ఇటీవల మృతిచెందిన సంఘ సభ్యులు రంగారెడ్డి, కృష్ణారెడ్డిలకు సంతాపం తెలిపారు.

డైట్ కళాశాలను పునరుద్ధరించాలని మంత్రికి వినతి

నేరేడ్‌మెట్: నేరేడ్‌మెట్‌లోని హైదరాబాద్ జిల్లా డైట్ కళాశాలను పునరుద్ధరించాలని ప్రభుత్వ గెస్ట్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కస్తూరి రవీందర్, కార్యదర్శి హాజీరా బేగం కోరారు. ఈ మేరకు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి సమస్యను వివరించినట్లు తెలిపారు. డైట్ కళాశాలలో తరగతుల పునఃప్రారంభానికి చొరవ చూపాలని.. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. ఈ సంవత్సరానికి కోర్సులు ప్రారంభమైతే అభ్యర్థులకు మేలు జరుగుతుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం



కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ భగత్ సింగ్‌నగర్‌లో రూ.46 లక్షలతో కొత్తగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సంబంధిత గుత్తేదారుకు సూచించారు. డివిజన్ పరిధిలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. సంతోష్, శ్రీదేవి, వినోద్, సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అరవైలో ఇరవైలా.. ఉల్లాసంగా ఉత్సాహంగా

★ కాలనీ సంఘం ఆధ్వర్యంలో ఇండోర్ గేమ్స్ ★ ఆదర్శంగా వాణీనగర్ వాసులు

గౌతంనగర్, న్యూస్‌టుడే: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి కలిసి ఉద్యోగాలు చేసిన వారు దాదాపు 70 ఏళ్ల క్రితం ఒకే కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఆనందంగా గడుపుతున్నారు. ఒకరికొకరు తోడుగా ఉంటూ వృద్ధాప్యంలోనూ సంతోషకర జీవనం సాగిస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు నిర్వహించే ఆటల పోటీల్లో ఆడి పాడుతున్నారు.

రూ.21 లక్షలతో భవన నిర్మాణం

1950లో సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో రెండు లేఅవుట్లుగా రైల్వే, ఇతర ప్రైవేటు ఉద్యోగులు కలిసి దాదాపు 400 కుటుంబాలతో గౌతంనగర్ డివిజన్ పరిధిలో వాణీనగర్ కాలనీని ఏర్పాటు చేసుకున్నారు. కాలనీ నాలుగు ప్రధాన మార్గాలు, ఆరు అంతర్గత మార్గాలతో రూపుదిద్దుకుంది. 1977లో కాలనీ సంక్షేమ సంఘాన్ని రిజిస్టర్ చేసుకున్నారు. 257 గజాల స్థలంలో సుమారు రూ.21 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మించుకున్నారు. టేబుల్ టెన్నిస్, చదరంగం, క్యారమ్స్, షటిల్ క్రీడలకు సంబంధించిన ఆట పరికరాలను సమకూర్చుకున్నారు. రకాల దినపత్రికలను అందుబాటులో ఉంచారు. కాలనీలోని విశ్రాంత ఉద్యోగులు సామాజిక భవనానికొచ్చి అరవైలో ఇరవైలా ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతున్నారు. పండుగలు, ఉత్సవాల సమయంలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటలపోటీలు, ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ప్రస్తుత కాలనీ సంఘం అధ్యక్షుడిగా సిద్దయ్య, ఉపాధ్యక్షుడిగా బలరాం, ప్రధాన కార్యదర్శిగా నర్సింగరావు ఉన్నారు.



క్యారమ్స్ ఆడుతున్న వయోవృద్ధులు



వాణీనగర్ సామాజిక భవనం

చేపట్టిన ముఖ్య కార్యక్రమాలు..

★ కాలనీ సంఘం తరపున సుమారు రూ.1.50 లక్షల వ్యయంతో అన్ని వీధుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు.

★ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామాజిక భవనంలోని గ్రంథాలయం అందుబాటులో ఉంటుంది.


★ ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఉంటుంది.

★ సీసీ కెమెరాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు.



ఆనందంగా గడిపేలా: వీరభద్రరావు, కాలనీ సంఘం మాజీ అధ్యక్షుడు

నేను బీఎస్ఎన్ఎల్‌లో ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందాను. ఇళ్లల్లో ఒంటరిగా ఉండలేని ఎంతో మంది సామాజిక భవనానికి వచ్చి వివిధ కార్యక్రమాలు, క్రీడల్లో భాగస్వాములవుతారు. ఎంతో ఆనందంగా గడిపే అవకాశం కల్పించాం.



అందరికీ ఉపయోగపడాలన్నదే లక్ష్యం: సిద్ధయ్య, కాలనీ సంఘం అధ్యక్షుడు

సామాజిక భవనం అందరికీ ఉపయోగపడాలన్న లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నాం. ఒక్కొక్కటిగా సౌకర్యాలు సమకూర్చుకుంటున్నాం. వృద్ధులతో పాటు కాలనీ వాసులందరికీ ఈ కేంద్రం వల్ల ప్రయోజనం చేకూరేలా యత్నిస్తున్నాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి: 80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? తూర్పుఆనంద్‌బాగ్ ఎన్ఎండీసీ కాలనీ ప్రధాన రహదారి సమీపంలో చెత్తకుప్పలు ఉదయం తీసిన వెంటనే మళ్లీ కొందరు తీసుకొచ్చి చెత్తవేస్తున్నారు. చర్యలు తీసుకోండి. – మణిరత్నం, కాలనీవాసి

✓ మీ ప్రాంత సమస్యను పరిశీలించి చెత్తను తొలగిస్తాం. చెత్తవేసే వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షకుడు

? గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ మూడో వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రోడ్డు తవ్వకాలు జరిపి తిరిగి పునరుద్ధరించకపోవడంతో రాత్రి వేళల్లో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– వేణు, మల్లికార్జున్‌నగర్

✓ క్షేత్ర స్థాయిలో పరిశీలించి దీపాలకు మరమ్మతులు నిర్వహిస్తాం.
–వెంకటేష్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? యాప్రాల్- కౌకూర్ ప్రధాన మార్గంలో పలు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటితో ఇబ్బందులు పడుతున్నాం. – శరత్, యాప్రాల్

✓ పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
–వెంకటేష్, వీధిదీపాల నిర్వహణ అధికారి

? చెత్తసేకరించే రిక్షా కార్మికుడు వారానికి ఒకసారి మాత్రమే వస్తున్నాడు. దీనిరా నుంచి కాలనీలోని ఇళ్లలో చెత్త పేరుకుపోతుంది. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. – రామనాథాచారి, రాయల్ ఎన్‌క్లేవ్

✓ కాలనీలో ఇళ్ల నుంచి వ్యర్థాలు ఎందుకు సేకరించడం లేదో తెలుసుకుని అవసరమైతే ఇతర కార్మికులతో చెత్త సేకరించేలా చర్యలు తీసుకుంటా. – ప్రభాకర్, పారిశుద్ధ్య అధికారి

దంపింగ్ యార్డ్‌కు చెత్త తరలింపు

స్పందనకు వందనం

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి హరిజన బస్తీ – బాలాజీకాలనీకి వెళ్లే ప్రధాన మార్గంలో రోడ్డు పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. 'మేమున్నాం.. మీకు తోడుగా'కు స్థానికులు తెలియజేశారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన అధికారులు చెత్తాచెదారాన్ని డంపింగ్ యార్డ్‌కు తరలించారు.

పార్టీ సభ్యత్వాలను భారీగా పెంచండి: ఈటల



మహిళా కార్యకర్తకు పార్టీ సభ్యత్వ రసీదు అందజేస్తున్న ఎంపీ రాజేందర్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎన్ కాలనీలో పార్టీ జిల్లానేత బక్క నాగరాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో మరే పార్టీకి లేనివిధంగా సభ్యత్వ నమోదు చేయాలన్నారు. ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీత, శ్రవణ్‌కుమార్, పార్టీ నేతలు వెంకటేశ్, నర్సింహగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్ రైళ్లకు ప్రాధాన్యమివ్వాలని విజ్ఞప్తి



డీఆర్ఎం బర్తేష్‌కుమార్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రయాణికుల సంఘం సభ్యులు

గౌతంనగర్: ఎంఎంటీఎస్ రైళ్లను అధికారులు తరచూ రద్దు చేయడంతో పాటు సమయపాలన పాటించడం లేదని ప్రయాణికుల సంఘం ప్రతినిధులు నూర్, మురళీకృష్ణ తదితరులు సికింద్రాబాద్ డీఆర్ఎం బర్తేష్‌కుమార్ జైన్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. బొల్లారం సెక్షన్‌లో 9, 12 పెట్టెలతో నడుస్తున్న రైళ్లను 6 పెట్టెలకు కుదించి ఎక్కువ ట్రిప్పులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లయోలా కళాశాల, ఆనంద్‌బాగ్‌ల వద్ద రైల్వే స్టేషన్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

అల్వాల్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా 21న

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్వాల్ ఐటీఐలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత శిక్షణకు హాజరుకావాలని కోరారు. బీఈఎల్, టీఎస్ ఆర్టీసీ, మేధా సర్వో డ్రైవర్స్, లింక్‌వెల్, తెసెంక్రూప్ ఇండస్ట్రీస్ ఇండియా, ఏరోస్పేస్, మెకానికల్ ప్రొడక్షన్ ఆటోమొబైల్ సర్వీస్ తదితర 20 నుంచి 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ధ్రువ పత్రాలతోపాటు జిరాక్స్ సెట్, బయోడేటాతో నేరుగా అల్వాల్ ఐటీఐకి రావాలని సూచించారు. ఇతర వివరాలకు 9849188346 నంబర్‌ను సంప్రదించాలని వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

గౌతంనగర్: ఎప్పుడూ ఫోన్ చూస్తేనే ఉంటున్నావని కుటుంబ సభ్యులు మందలించడంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. మల్కాజిగిరి సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్జాలగూడలో నివాసం ఉండే సత్యనారాయణ కుమార్తె జ్యోతిక(18) ఇంటర్ చదువుతోంది. చరవాణిలో అదే పనిగా వీడియోలు చూస్తుండటం.. సమయం వృథా చేస్తుండటంతో ఆమె తల్లి, సోదరుడు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఈనెల 18న సాయంత్రం తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిరసన కార్యక్రమానికి తరలిన భాజపా నేతలు

మౌలాలి: సికింద్రాబాద్ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో జరిగిన ఘటనకు నిరసనగా సికింద్రాబాద్‌లో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ ఆధ్వర్యంలో పలువురు భాజపా నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

'గానుగ నూనెతో బహుళ ప్రయోజనాలు'



తయారీ విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

గౌతంనగర్: గానుగ నూనె వినియోగించడం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని ఆయుశ్రిత నేషనల్ సంస్థ ప్రతినిధి జగదీష్ అన్నారు. గానుగ నూనె ఉపయోగాలను వివరిస్తూ చింతల్‌బస్తీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దును ఉపయోగించి పల్లీల నుంచి నూనె తీసే పద్ధతిని ప్రత్యక్షంగా వివరించారు.

వేంకటేశుడికి ప్రత్యేక అలంకరణ



వేంకటేశ్వరస్వామి



మారుతీనగర్ ఆంజనేయుడు

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు దేవాలయాన్ని పెద్దసంఖ్యలో దర్శించుకున్నారని ఆలయ అర్చకులు వేంకట రమణాచార్యులు తెలిపారు. ★ మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని మారుతీనగర్‌లోని ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని ప్రసన్నాంజనేయస్వామిని వివిధ రకాల పత్రాలతో అలంకరించారు.

హనుమాన్ చాలీసా పారాయణం



అల్వాల్: అల్వాల్ ఆధ్యాత్మిక కమిటీ, భక్త సమాజం సంఘం ఆధ్వర్యంలో శనివారం వివిధ ఆలయాల్లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మచ్చబొల్లారంలోని సంజీవని హనుమాన్ ఆలయం, సిటిజన్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి, అల్వాల్‌హిల్స్, ఓల్డ్‌అల్వాల్ ఆలయాల్లో నిర్వహించిన పారాయణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నేత విష్ణుమూర్తి మాట్లాడారు.

దాడులపై సిట్ ఏర్పాటు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శనలో వీహెచ్‌పీ నేతలు

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు సంబంధించి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వాయుపురిలోని మల్కాజిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్యాంప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఇటీవల సికింద్రాబాద్ పరిధిలో చోటు చేసుకున్న ఘటనపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. అంతకుముందు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామ నర్సింహులు, కార్యదర్శి రజినీకాంత్, బజరంగ్ దళ్ కన్వీనర్ నంద కిషోర్, సరళ, పశ్యంతి తదితరులు పాల్గొన్నారు.

'పోలీసు కనుసన్నల్లో కబ్జాలు'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో ప్రజాస్వామ్యం ముసుగులో భూదందాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. తాజాగా మల్కాజిగిరిలోని తిరుమల్‌నగర్‌లో 300 ఎకరాలు తమదేనంటూ కొందరు పోలీసుల సాయంతో ఆక్రమించారని, ఎస్ఓటీ పోలీసులు దగ్గరుండి రేకుల షెడ్లు వేసుకునేందుకు సహకరించారన్నారు. శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరుడు ఖురేషి కనుసన్నల్లో ఇదంతా జరుగుతోందన్నారు. సమావేశంలో ఆయన అనుచరుడు గిరిబాబు ఉన్నారు.



స్థలంలో నిర్మాణం చేసినట్లు చిత్రాలు చూపుతూ మాట్లాడుతున్న బక్క జడ్సన్. చిత్రంలో గిరిబాబు

తాళం వేసిన ఇళ్లల్లో చోరీకి యత్నం



అల్వాల్‌లోని ఓ ఇంటివద్ద తచ్చాడుతున్న దొంగలు

అల్వాల్, న్యూస్‌టుడే: శుక్రవారం తెల్లవారుజామున అల్వాల్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీకి యత్నించారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం... పంచశీల కాలనీలోని మల్లం రవి కుటుంబ సభ్యులంతా శుక్రవారం తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో గోడదూకి ఇద్దరు యువకులు ఇంట్లోకి చొరబడ్డారు. ఏమీ దొరక్కపోవడంతో ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. అనంతరం పక్కనే ఉన్న ప్రెసిడెన్సీకాలనీలో నివాసం ఉండే లక్ష్మారెడ్డి ఇంటి తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. ఈ ఇంట్లోనూ వారికి ఏమీ లభించకపోవడంతో వెళ్లిపోయారు. ఇటీవలే పేట్‌బషీరాబాద్ పరిధిలోని మీనాక్షీకాలనీలో దొంగతనం జరిగింది. అక్కడ దోపిడీకి పాల్పడిన వారే తమ కాలనీలో చోరీలకు యత్నించారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానికంగా లభ్యమైన సీసీ ఫుటేజీల ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదుచేశారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టండి

మౌలాలి: ఓల్డ్ సఫీల్‌గూడ సౌత్ సుధానగర్ రాక్ చర్చి వీధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డును పూర్తి చేయాలని సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు శనివారం కాలనీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. బీసీ కులాల ఐక్యవేదిక నాయకుడు రొయ్యల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాణ్యత లేమి.. ఎవరికీ పట్టదేమి?

ప్రమాదకరంగా మారుతున్న మ్యాన్‌హోళ్లు

అల్వాల్, గౌతంనగర్, న్యూస్‌టుడే: రహదారుల మధ్యలో ఉన్న పలు మ్యాన్‌హోళ్లు శిథిలం కావడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిర్ణీత ప్రమాణాలు లేకుండా.. రహదారిపై ప్రయాణించే వాహనాల స్థాయిని పరిగణనలోకి తీసుకోకుండా ఏర్పాటు చేయడంతో కొద్దికాలానికి శిథిలమవుతున్నాయి. కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న వాటిపై భారీ వాహనాలు వెళ్లడంతో స్వల్ప కాలంలోనే పాడవుతున్నాయి. ప్రధాన రహదారుల్లోనూ సరైన స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో కొద్దికాలంలోనే పగుళ్లిస్తున్నాయి. కొన్ని చోట్ల ఊచలు బయటకొస్తుండగా.. కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా పాడై ప్రమాదకరంగా మారుతున్నాయి. ★ ఓల్డ్‌అల్వాల్ హర్ష ఆసుపత్రి మార్గంలోని రోడ్డు మధ్యలో మ్యాన్‌హోల్ దారుణంగా మారింది. పైకప్పు పూర్తిగా శిథిలం కావడంతో తొలగించారు. అప్పటి నుంచి తెరచి ఉంచడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.



ఓల్డ్ అల్వాల్ పరిధిలో ప్రమాదకరంగా..



మల్లికార్జున్ నగర్ ప్రధాన మార్గంలో..

ప్రమాదాలు జరగకుండా కొమ్మలు అడ్డుపెట్టి..

గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ ప్రధాన మార్గంలో మ్యాన్‌హోల్ మూత వద్ద శ్లాబ్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు వెళ్తే కుప్పకూలే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో స్థానికులు ప్రమాద సూచికగా చెట్టు కొమ్మను ఉంచారు. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వ్యర్థాలు.. నెలలుగా తరలించక ఇబ్బందులు



డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి రామకృష్ణాపురం వంతెన సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద సిమెంట్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నెలలుగా అక్కడే ఉన్నా వాటిని తొలగించడం లేదు. పలుమార్లు ఈ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని స్థానికులు వాపోయారు. వర్షాలు వచ్చినపుడు వ్యర్థాల నుంచి ఇసుక, మట్టి రోడ్డుపైకి కొట్టుకొచ్చి మేట వేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మానవ అక్రమ రవాణాను ఐక్యంగా అడ్డుకోవాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ఏ21 'గ్లోబల్ వాక్ ఫర్ ఫ్రీడమ్' నిశ్శబ్ద నడక పేరుతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నడకను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాకర్‌రావు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ సెయింట్ మేరీస్ కాలేజ్, వైఎంసీఏ సికింద్రాబాద్‌తో కలిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో 300 మందికిపైగా పౌరులు పాల్గొనగా.. దేశవ్యాప్తంగా 100 పైగా స్థానాల్లో 30 వేలకు పైగా ఈ నడకలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వంటి క్రూరమైన నేరాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏసీపీ ఆంజనేయులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్, వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ లియోనార్డ్ మైరన్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, న్యూస్‌టుడే: విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ధర్నానుద్దేశించి వక్తలు మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులకు జీతభత్యాలు పెంచినప్పుడల్లా తమ పింఛన్లు కూడా పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు.

రోజూ ఆదాయం పొందొచ్చని.. రూ.1.33 లక్షలకు టోకరా

నారాయణగూడ, న్యూస్‌టుడే: రోజూ ఆదాయాన్ని పొందొచ్చని నమ్మించి నగదు దండుకున్నారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి వాట్సాప్ సందేశం వచ్చింది. ఆకర్షితుడైన బాధితుడు అందులో నంబరులో సంప్రదించారు. నేరస్థుడు ఓ యాప్ లింక్‌ను పంపించి డౌన్‌లోడ్ చేయించాడు. అతని సూచనలను పాటిస్తూ పోయాడు. మొదట లాభాలు ఆర్జించాడు. ఇంకా డబ్బు పెట్టాలంటూ ఒత్తిడి రావడంతో విడతల వారీగా తన వద్ద ఉన్న రూ.1.33 లక్షలు ఆన్‌లైన్‌లో పంపించేశాడు. ఆ తర్వాత యాప్‌లోని వాలెట్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేయాలంటే అదనంగా రుసుము చెల్లించాల్సి ఉంటుందని నేరస్థుడు చెప్పడంతో బాధితుడు కంగుతిన్నాడు. ఇంతలో బాధితుడికి సంబంధించిన యాప్ ఖాతాను, వారి వాట్సాప్‌లో బ్లాక్ చేసేశారు. మోసపోయినట్లు గ్రహించి.. పోలీసులను ఆశ్రయించారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

సర్కారు బడుల్లో టీచర్లను నియమించాలి



విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న పావని

గాంధీనగర్, న్యూస్‌టుడే: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని కోరారు. శనివారం జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సమస్యలపై వాకబు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఆమె స్వయంగా పిల్లలకు వడ్డించటంతో పాటు వారి ఇబ్బందులను తెలుసుకొని మాట్లాడారు. విద్యార్థులకు సరిపడా సదుపాయాలను కల్పించాలని.. ముఖ్యంగా మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆమె వెంట భాజపా సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కాలిబాటలపై ఆక్రమణల తొలగింపు



కూల్చివేతలను పర్యవేక్షిస్తున్న అధికారులు

ముషీరాబాద్: కాలిబాటలను ఆక్రమించి పాదచారులకు ఇబ్బంది కలిగించేవారిని ఉపేక్షించబోమని జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ రామ్‌శెట్టి హెచ్చరించారు. ముషీరాబాద్ డివిజన్‌లోని వాల్మీకి ఆటస్థలం ప్రహరీ చెంత కాలిబాటలను ఆక్రమించి చిరువ్యాపారులు ఏర్పాటుచేసుకున్న దుకాణాలను సిబ్బందితో కలిసి శనివారం ఆయన తొలగింపజేశారు. సుమారు 10కిపైగా దుకాణాలను కూల్చివేతతో సంబంధిత వ్యాపారులు.. తాము జీవనోపాధిని కోల్పోయామంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఏసీపీ దేవేందర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే కాలిబాటలపై ఆక్రమణలను తొలగించామని వివరించారు.

'భాజపాలో ప్రజాస్వామ్య విలువలకు పట్టం'



కె.లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ఆనంద్‌గౌడ్, సురేష్, ఈశ్వర్

అంబర్‌పేట: దేశంలోనే అత్యధిక క్రియాశీలక సభ్యులున్న భాజపా ప్రజాస్వామ్య విలువలతో పనిచేస్తోందని పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తెలిపారు. భాజపా జాతీయ సంస్థాగత ఎన్నికల అధికారిగా నియమితులైన ఎంపీ కె.లక్ష్మణ్.. కేంద్ర కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా ఓబీసీ మోర్చా జాతీయ మీడియా సమన్వయకర్తతో కలిసి సన్మానించినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

తిలక్‌నగర్:(శనివారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట 40, ఆలుగడ్డ 40, వంకాయ 40, బెండ 60, దొండ 45, దోసకాయ 40, కాకర 70, బీర 60, సొర 25, క్యాబేజి 35, క్యాప్సికం 60, పచ్చిమిర్చి40, వెల్లుల్లి 350, అల్లం 80.

స్వయం ఉపాధి కల్పనలో స్ఫూర్తిగా..

మహిళలకు ఉచితంగా శిక్షణతోపాటు ఆర్థికంగా భరోసా కల్పిస్తున్న సంఘం



ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందుతున్న మహిళలు



దుస్తులు కుట్టడంలో తర్ఫీదు

నల్లకుంట, న్యూస్‌టుడే: సమాజంలో రోజురోజుకూ మారుతున్న పరిస్థితుల్లో కుటుంబ అవసరాల కోసం పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని భార్యాభర్తలిద్దరూ పనిచేసే రోజులివి. అయితే, వివిధ కారణాల వల్ల బయటికెళ్లి ఉద్యోగాలు చేయలేని మహిళలెందరో వారింటి వద్దే ఉపాధి పొందాలని ఆలోచిస్తూ.. ఈ క్రమంలో ఇళ్ల వద్ద నుంచే పనిచేస్తూ.. తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించాలనుకునే అతివలకు నల్లకుంట డివిజన్ పాతనల్లకుంటలోని స్ఫూర్తి భవన్ సంక్షేమ సంఘం అండగా నిలుస్తోంది. ఉపాధి అవకాశాలున్న వివిధ అంశాలను గుర్తించి.. ఉచితంగా శిక్షణ ఇస్తూ ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

శిక్షణలో పదేళ్లుగా... స్ఫూర్తి భవన్ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదన్‌యాదవ్ కాగా.. సమన్వయకర్తలుగా శిరీష, స్వప్నలు వ్యవహరిస్తున్నారు. సంఘం ఆధ్వర్యంలో పదేళ్లుగా వివిధ అంశాలలో ఉచితంగా శిక్షణనిస్తున్నారు. ఉద్యోగం చేయాలనుకునేవారు కాకుండా ఇంట్లో పనులు చేసుకుంటూనే ఉపాధి పొందాలనుకునే మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తూ.. వారిలోని భయాన్నిపోగొట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఇప్పటివరకు వెయ్యి మందికి పైగా విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారిలో 80 శాతానికి పైగా మహిళలు బయటికివెళ్లకుండా.. తీరిక సమయంలో ఇంటి నుంచే ఉపాధి పొందుతూ కుటుంబానికి ఆర్థికంగా ఆసరా అవుతున్నారు.

వివిధ అంశాల్లో... దుస్తులు కుట్టడం, కట్టింగ్, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులలో మూణ్నెల్ల పాటు శిక్షణ ఉంటుంది. దీన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి ఉపాధి కల్పిస్తున్నారు. వ్యాపారం చేసుకోవాలనే మహిళలకు బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు ఇప్పించడంలోనూ నిర్వాహకులు సహకరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. పొదుపు గ్రూపులనూ ఏర్పాటు చేయించి.. వారి ఆర్థిక బలోపేతానికి తోడ్పడుతున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారిలో ఆత్మవిశ్వాసాన్ని మరింతగా పెంపొందించేలా.. వివిధరంగాల ప్రముఖుల చేతుల మీదుగా ధ్రువీకరణపత్రాలూ అందజేస్తున్నారు. ప్రస్తుతం దుస్తులు కుట్టడం, ఎంబ్రాయిడరీ, కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సుల్లోనే శిక్షణ కొనసాగుతుందని.. త్వరలో మరిన్ని అంశాల్లోనూ మహిళలు, యువతులకు తర్ఫీదునిచ్చేలా దృష్టిసారించామని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదన్ యాదవ్ తెలిపారు.

ముషీరాబాద్, న్యూస్‌టుడే:

? రాంనగర్ జెమినీ కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలో దోమల బెడద అధికమైంది. సత్వరం నియంత్రణ చర్యలు చేపట్టండి.
-రమేష్‌గౌడ్, స్థానికుడు

✓ సిబ్బందిని పంపించి దోమలమందును పిచికారీ చేయిస్తాం.
– యాదగిరి, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం సూపర్‌వైజర్

మురుగు సమస్యకు మోక్షం

ఈనాడు కథనానికి స్పందన

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ ప్రధాన రోడ్డులో నిత్యం పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యకు మోక్షం లభించింది. కొంతకాలంగా తరచూ పొంగిపొర్లుతున్న డ్రైనేజీ పైపులైన్ల కారణంగా.. వాహనదారులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులపై 'వాన్‌స్టే.. మును గుతున్న రహదారి' శీర్షికతో ఇటీవల 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి వీలుగా శనివారం చిలకలగూడ జలమండలి డీజీఎం మోహన్‌రాజు పర్యవేక్షణలో.. స్థానికంగా నూతన పైపులైన్ నిర్మాణ పనులను చేపట్టారు.

హైకోర్టు న్యాయవాది ఎట్టయ్యకు శాంతి పురస్కారం



కాచిగూడ, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయవాది జి.ఎట్టయ్యను మహాత్మాగాంధీ గ్లోబల్ పీస్ అవార్డు-2024కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజేనారాయణ ముదిరాజ్ తెలిపారు. శనివారం కుత్బిగూడలో ఆయన మాట్లాడుతూ.. పేదల కోసం ఉచిత న్యాయ సేవా శిబిరాల నిర్వహణతో పాటు పర్యావరణ పరిరక్షణ, శాంతి, మతసామరస్యం, జాతీయ సమైక్యతకు దశాబ్దన్నర కాలంగా పనిచేయడం, ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకింగ్ సంస్థలకు ప్యానెల్ అడ్వకేట్‌గానూ వ్యవహరిస్తున్న ఆయన్ను పురస్కారానికి ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ నెల 22న బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తామని తెలిపారు.

ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి: ఎమ్మెల్యే



ముఠా గోపాల్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న డా.విజయభాస్కర్

గాంధీనగర్, న్యూస్‌టుడే: నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. రవి హీలియోస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని పంచముఖ ఆంజనేయ, లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్థోపెడిక్ సర్జన్ డా.విజయభాస్కర్, డా.శ్రీదేవిలు.. వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు ముచ్చుకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

గాంధీనగర్ డివిజన్‌లోని తన క్యాంపు కార్యాలయంలో.. నియోజకవర్గానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరులో జాప్యానికి తావులేకుండా దృష్టిసారించాలని అధికారులకు సూచించారు. నేతలు మాధవ్, ముఠా నరేష్, శంకర్‌ముదిరాజ్, ఎం.ప్రభాకర్, పాశం రవి, శ్రీధరాచారి, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఈ కాలనీ అసోసియేషన్ సేవలు అభినందనీయం



ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో బి.పద్మ, రామకృష్ణరాజు, వెంకట్‌రావు, సత్యం, కిరణ్, కామేశ్వరి తదితరులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని సెంట్రల్ ఎక్సైజ్(సీఈ) కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఏళ్లుగా చేపడుతున్న సామాజిక, సేవా కార్యక్రమాలు అభినందనీయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కొనియాడారు. శనివారం రాత్రి స్థానిక పార్కులో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉద్యానంలోని సామాజిక భవనం పైఅంతస్తులో ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్‌కోర్టు, ఏసీలను కార్పొరేటర్ పద్మ, మాజీ కార్పొరేటర్లు వెంకట్‌రెడ్డి, పద్మావతిలతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కిరణ్, కామేశ్వరి దంపతుల జన్మదినాన్ని పురస్కరించుకుని.. అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణరాజు, ప్రధాన కార్యదర్శి పడాల వెంకట్‌రావు, కార్యవర్గ సభ్యులు కె.ఎస్.కె సత్యంలతో కలిసి వారిని ఎమ్మెల్యే సన్మానించారు. నేతలు సతీష్‌రావు, చందు, రమేశ్‌నాయక్, సత్యనారాయణ, ఎంవీఆర్.సుధాకర్ రావు, ఉష, పార్వతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

భారాస నేతలపై దాడులు హేయం: ముఠా గోపాల్

ముషీరాబాద్: గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న భారాస ముషీరాబాద్ నాయకులు, కార్యకర్తలపై భాజపా శ్రేణులు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లో జరిగిన ధర్నా సందర్భంగా నిరుద్యోగ అభ్యర్థులకు మద్దతు పలికిన భారాస నాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు. దాడిలో గాయపడిన భోలక్‌పూర్ డివిజన్ భారాస నేత ప్రవీణ్‌ను దోమలగూడ ఠాణాలో కలిసి పరామర్శించి మాట్లాడారు. నేతలు వై.శ్రీనివాసరావు, శివముదిరాజ్, శ్రీధర్‌రెడ్డి, జావిద్‌ఖాన్, ఖదీర్, శంకర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

జీవో నం. 29 రద్దు చేయాలి: భాజపా

బర్కత్‌పుర: గ్రూప్-1 అభ్యర్థులకు ఇబ్బందికరంగా మారిన జీవో నం.29ను తక్షణం రద్దు చేయాలని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జి.అనూహ్యారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరితో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జీవో నం.29 రద్దుకు సంబంధించి సోమవారం సుప్రీంకోర్టులో వాదనలు ఉండగానే.. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా గ్రూప్-1 పరీక్షను నిర్వహించాలనుకోవడం తగదన్నారు. గతంలో ఉన్న జీవో నం.55ను యథాతథంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

డ్రైనేజీ పైపులైన్ల సమస్యలు పరిష్కరిస్తాం

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్అంబర్‌పేట డివిజన్ పరిధిలో డ్రైనేజీ పైపులైన్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు కార్పొరేటర్ బి.పద్మ చెప్పారు. శనివారం మల్లికార్జుననగర్‌లో జలమండలి ఏఈ మాజిద్‌తో కలిసి.. ఆయా సమస్యలు నెలకొన్న ప్రాంతాలను పర్యటించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ముఖ్యంగా మ్యాన్‌హోళ్లపై గుంతలు పూడ్చాలని, పైపులైన్లలో పూడికను ఎప్పటికప్పుడు తొలగిస్తూ మురుగు నిల్వకుండా చూడాలని కోరారు. తాగునీటి పైపులైన్లల్లో మురుగు చేరకుండా జాగ్రత్తలూ తీసుకోవాలని సూచించారు. భారాస నేత బి.వెంకట్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రవినాయక్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

'అభయహస్తం' పథకానికి నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న యాదయ్య

బాగ్‌లింగంపల్లి: దళితుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకానికి నిధుల కేటాయింపుతోపాటు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సత్వరం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం(టీఎంఎంఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డ యాదయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం సుందరయ్య కళానిలయంలో.. టీఎంఎంఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అభయహస్తం పథకం అమలుపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. దళితుల అభ్యున్నతికి ఎస్సీ సబ్‌ప్లాన్‌లో రూ.33 వేల కోట్లపైచిలుకు బడ్జెట్ కేటాయించినా.. ఇంతవరకు ఒక్క పైసా ఖర్చు చేయకపోవడం తగదని పేర్కొన్నారు. సమావేశంలో ప్రొ.నతానియేలు, బంధు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరాస్వామి, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రమేశ్, నర్సింగరావు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాల ప్రదానం 22న

గాంధీనగర్: సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఆర్ట్స్, ఆర్.ఆర్.ఫౌండేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో 'సీల్‌వెల్ సుస్వరాలు-64' శీర్షికతో సినీసంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకులు బండారు సుబ్బారావు, బొక్కా భీమ్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వారు వివేక్‌నగర్‌లో మాట్లాడుతూ.. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, స్వాతంత్ర్య సమరయోధులు ఏటుకూరి కృష్ణమూర్తిలకు సీల్‌వెల్-శ్రుతిలయ మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారాలను ప్రదానం చేస్తామన్నారు. సంబంధిత కార్యక్రమం ఈ నెల 22న సాయంత్రం 4.30 గంటలకు త్యాగరాయగానసభలో ప్రారంభమవుతుందన్నారు.


'పంటల బీమా'పై సెమినార్ 25న



గోడపత్రిక ఆవిష్కరిస్తూ..

గాంధీనగర్: తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో చైతన్య సేద్యం రైతుల మాసపత్రిక వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. శనివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో.. నేతలు మూడ్ శోభన్, రాహుల్, శివకుమార్‌లతో కలిసి గోడపత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 25న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'ప్రతికూల వాతావరణం- పంటల బీమా అవసరాలు' అనే అంశంపై రాష్ట్రస్థాయి సెమినార్‌ను నిర్వహిస్తామన్నాని తెలిపారు.

నిరసనలు.. ర్యాలీలతో వాహనదారులకు ఇక్కట్లు



ఉక్కు వంతెనపై బారులు తీరిన కార్లు



వాహనాల మధ్య నుంచి రోడ్డు దాటుతున్న మహిళ

గాంధీనగర్, న్యూస్‌టుడే: పోటీపరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో నిత్యం కళకళలాడే అశోక్‌నగర్ చౌరస్తా శనివారం నిరసనలతో హోరెత్తింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ.. సంబంధిత అభ్యర్థులు నాలుగు రోజులుగా ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం కూడా నిరసనలకు దిగడంతో ఉద్రిక్తంగా మారింది. వందలాదిగా తరలివచ్చిన అభ్యర్థులతో అశోక్‌నగర్ చౌరస్తా జనసంద్రంగా మారింది. ఎటుచూసినా అభ్యర్థులు ప్లకార్డులను ప్రదర్శిస్తూ తమకు న్యాయం చేయాలంటూ పెద్దపెట్టున చేసిన నినాదాలతో పరిసరాలు హోరెత్తాయి. వారికి మద్దతుగా కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అక్కడికి రావడం.. అనంతరం 'చలో సెక్రటేరియట్'కు ఆయన పిలుపునిచ్చారు. తొలుత అశోక్‌నగర్ చౌరస్తాలో ఆయన అభ్యర్థులతో కలిసి బైఠాయించడంతో.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డు నుంచి ఇందిరాపార్కు మార్గంలో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపేశారు. అశోక్‌నగర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ మీదుగా వాహనాలను దారిమళ్లించారు. చలో సెక్రటేరియట్ లోభాగంగా చేపట్టి ర్యాలీ రామకృష్ణ మఠం వద్ద ఆగడంతో.. అక్కడి ఉక్కు వంతెనపై భారీగా వాహనాలు నిలిచాయి. మరోవైపు లోయర్ ట్యాంక్‌బండ్ నుంచి అశోక్‌నగర్ వైపునకు వచ్చే వాహనదారులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కుంగిన మార్గం.. అవస్థల ప్రయాణం



ఇందిరాపార్కు నుంచి ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే వాహనదారులంతా రామకృష్ణ మఠం వద్ద ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు. మఠం సమీపంలోని రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్‌కు తరచూ మరమ్మతులు నిర్వహించాల్సి వస్తుండటమే ఇందుకు కారణం. ప్రస్తుతమిక్కడ రోడ్డు కుంగడంతోపాటు ప్రమాదాల జరగకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఏర్పాటుచేసిన బారికేడ్‌తో నిత్యం రద్దీ వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తుండటంతో రాకపోకల వేళ వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

రాంనగర్, న్యూస్‌టుడే: విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శనివారం అఖిల భారత బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ.. బ్యాంక్ ఉద్యోగులకు జీతభత్యాలు పెంచినప్పుడల్లా తమ పింఛన్లు కూడా పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య బీమా ప్రీమియంను బ్యాంకులే కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల సమాఖ్యతో ఒప్పందం కుదుర్చుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, దేనా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఫెడరల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ప్రతినిధులు డా.అనంతకృష్ణరావు, మధుసూదన్ రావు, రోహిణిరావు, సుధాకర్, మురళి, సూర్యనారాయణ, మూర్తి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

అంబర్‌పేట: జూదం ఆడుతున్న ఆరుగురిని అంబర్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. తులసీనగర్‌లంక ప్రాంతంలో పలువురు జూదం ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి చేరుకుని. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.14,300 నగదుతోపాటు 6 చరవాణులనూ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

21 నుంచి కొత్తగూడెంలో ఐద్వా మహాసభలు



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

బాగ్‌లింగంపల్లి: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభలను ఈ నెల 21 నుంచి 23 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో 1936లో ఐద్వా సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటి నుంచి నేటి వరకు మహిళల హక్కులసాధనకు నిర్విరామంగా కృషి చేస్తున్నామని తెలిపారు. మహిళలకు స్వేచ్ఛ కల్పించడంతోపాటు సమానత్వం.. తదితర అంశాలపైనా గళమెత్తుతున్నామన్నారు. కొత్తగూడెంలో జరిగే మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారాట్, ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం ధావలే, జాతీయ కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుందర్‌రామన్ హాజరవుతున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభల గోడపత్రిక ఆవిష్కరించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు కేఎన్ ఆశాలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కవిత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

నల్లకుంట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన నల్లకుంట ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గోల్నాకలో నివసించే సుంకరి శిల్ప(35) హైటెక్‌సిటీ సమీపంలోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 16న విధులు ముగించుకొని క్యాబ్‌లో ఇంటికి బయలుదేరారు. ఇందిరాపార్కు నుంచి స్టీల్ బ్రిడ్జి మీదుగా వేగంగా వస్తున్న కారు.. నాగమయ్యకుంట దాటాక వంతెన దిగగానే విద్యానగర్‌లో రోడ్డు పక్కన స్తంభానికి ఢీ కొట్టింది. ఈ ఘటనలో డ్రైవరు హస్మద్‌తోపాటు శిల్ప కూడా తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం వారిద్దరినీ చిక్కడపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడే చికిత్స పొందుతున్న ఆమె శనివారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు.

రైలు ఢీకొని.. చికిత్స పొందుతూ..

కాచిగూడ, న్యూస్‌టుడే: రైలు ఢీకొనడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారిలు తెలిపిన వివరాల ప్రకారం... పాతబస్తీ పరిధిలోని వట్టేపల్లికి చెందిన సయ్యద్ ముక్తార్(51) ఈ నెల 17న ఉప్పుగూడ-ఫలక్‌నుమా స్టేషన్ల మధ్య రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు శనివారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప్పల్

• ఉప్పల్ • మేడ్చల్

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. శనివారం శిల్పారామంలో శివాంశ డ్యాన్స్ అకాడమి గురువు శివకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులు దీక్షరెడ్డి, సంవిక, కౌశిక, మోక్ష, సిరి వెన్నెల, సుజయ్ తదితరులు వినియక కౌతం, బహ్మాంజలి, జతిస్వరం తదితర నృత్యాలను ప్రదర్శించారు.

నేత్రపర్వంగా పెద్ద శేషవాహనోత్సవం



నాచారం, న్యూస్‌టుడే: నాచారం వేంకటేశ్వరస్వామి ఆలయ షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం శ్రీవారి పెద్ద శేషవాహనోత్సవం కనులపండువగా సాగింది. కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు మందుముల పరమేశ్వరరెడ్డి, కార్పొరేటర్ శాంతిసాయిజెన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ ప్రధాన అర్చకులు అర్చన, సహస్రనామార్చన, యాగశాల, తిరువీధి ఉత్సవం పూజలు జరిపారు. నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి డా. తుమ్మల దుర్గాప్రసాద్, అధ్యక్షుడు రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మురుగుకు శాశ్వత పరిష్కారం

ఈనాడు కథనానికి స్పందన

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: మురుగుతో స్థానికంగా నాలుగు కాలనీల ప్రజలు పడుతున్న ఇబ్బందుల తీరును వివరిస్తూ 18న "మురుగు.. రోడ్లపై పరుగు" శీర్షికతో ఈనాడులో చిత్ర వార్త ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు ప్రధాన కాలువకు అనుసంధానంగా మరో బాక్స్ మ్యాన్‌హోల్‌ను నిర్మించి మురుగు సాఫీగా వెళ్లేలా మరమ్మతులు ప్రారంభించారు.

ఆక్రమణల తొలగింపు

హబ్సిగూడ: హబ్సిగూడ వీధి నంబర్ 8లో పాదబాట ఆక్రమణలను శనివారం తొలగించారు. పాదబాటను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఓయూ సీఐ రాంబాబు హెచ్చరించారు. వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. ఎస్సై నిరంజన్ పాల్గొన్నారు.

అల్వాల్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా 21న

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్వాల్ ఐటీఐలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి. శంకరయ్య తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత శిక్షణకు హాజరుకావాలని కోరారు. బీఈఎల్, టీఎస్ ఆర్టీసీ, మేధా సర్వో డ్రైవర్స్, లింక్‌వెల్, తెసెంక్రూప్ ఇండస్ట్రీస్ ఇండియా, ఏరోస్పేస్, మెకానికల్ ప్రొడక్షన్ ఆటోమొబైల్ సర్వీస్ తదితర 20 నుంచి 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు జిరాక్స్ సెట్, బయోడేటాతో నేరుగా అల్వాల్ ఐటీఐకి రావాలని సూచించారు. ఇతర వివరాలకు 9849188346 నంబర్‌ను సంప్రదించాలని వెల్లడించారు.

ఆసుపత్రి ఎదుట బాధితుల ధర్నా

మేడ్చల్, న్యూస్‌టుడే: వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆపరేషన్ వికటించిందని బాధితులు శనివారం ఆసుపత్రి ఎదుట ధర్నా చేపట్టారు. వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన అరుణ రక్తహీనతతో బాధపడుతూ కండ్లకోయ సీఎమ్మార్ ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వహించిన వైద్యులు గర్భసంచి తొలగించారు. ఆపరేషన్ వికటించి మూత్రనాళానికి రంధ్రం పడి మూత్రం లీకవుతుందని మరలా ఆసుపత్రిలో చేర్పించారు. రెండోసారి కూడా వికటించింది. అనుభవం లేని వైద్యులచే ఆపరేషన్ చేయడంతోనే ఆపరేషన్లు వికటించి ఆరోగ్యం పూర్తిగా క్షీణించిందని, తమకు న్యాయం చేయాలని ఆసుపత్రి ముందు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శరీరంలో అవయవాలు సహకరించక పోవడంతోనే ఒక్కో అవయానికి ఓసారి చేయాల్సి ఉంటుంది అంతే తప్ప ఆపరేషన్ వికటించిందనడంలో నిజం లేదని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్‌లోని శ్రీనగర్ చౌరస్తాలో పొంగుతున్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. శనివారం పనులు ప్రారంభమయ్యాయి. మున్సిపల్, జలమండలి అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యంతోనే ఈ సమస్య ఏర్పడింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఈ రెండు విభాగాల అధికారులతో మాట్లాడి సమన్వయం చేయడంతో పనులు మొదలు పెట్టినట్లు చెప్పారు. ఈఈ హరిలాల్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

మేడ్చల్, న్యూస్‌టుడే: ఉ.10 నుంచి మ.2 వరకు గౌడవెల్లి, బాసరేగడి, జ్ఞానాపూర్, జ్ఞానాపూర్‌గడ్డ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు వెల్లడించారు.

ఆలయం పక్కన పెరుగుతున్న మందుబాబుల చేష్టలు

చీర్యాల(కీసర), న్యూస్‌టుడే: చీర్యాలలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయం ఆకతాయిలు, మందు బాబులకు అడ్డాగా మారింది. కొంత మంది మందు తాగి సీసాలు అక్కడే పారవేశారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తగు నిఘా పెట్టి ఆలయం పరిసరాల్లో ఆకతాయిలు మందు సేవించకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇరుకిరుకు అద్దె గదుల్లో అంగన్‌వాడీ కేంద్రాలు...

తప్పని ఇబ్బందులు

న్యూస్‌టుడే: కీసర, శామీర్‌పేట్, జవహర్‌నగర్, మేడ్చల్‌రూరల్, బోడుప్పల్, నాగారం

పరిశీలన

ఇరుకు గదులు... కాస్త వర్షపు జల్లులు పడితే చాలు కురుస్తున్న రేకులు... పెచ్చులూడుతున్న పైకప్పులు, వంట సామాను... పిల్లలు అందరు ఒకే చోట. ఇదీ... నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఏడు మున్సిపాలిటీలు, మూడు పురపాలికల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితి. చాలా చోట్ల కేంద్రాలను అరకొర వసతులతో ఉన్న అద్దె భవనాల్లో నడుపుతున్నారు. సొంత భవనాలున్న చోట పరిస్థితులు కాస్త మెరుగ్గా ఉన్నా...అద్దె భవనాలున్న చోట పిల్లలు, గర్భిణీస్త్రీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న పరిస్థితులపై 'పరిశీలన' కథనం.

● శామీర్‌పేట మండలంలో 25 అంగన్‌వాడి కేంద్రాలున్నాయి. వీటిలో 17 సొంత భవనాల్లో నడుస్తున్నాయి. మూడు అద్దె భవనాలు, 5 ఉచిత భవనాల్లో ఉన్నవి. 9 అంగన్‌వాడి కేంద్రాలకు ఆయాలు లేరు. హకీంపేట, తూంకుంట, బిట్స్ కాలనీలోని మూడు కేంద్రాలకు అంగన్ వాడి టీచర్లు లేరు. శామీర్‌పేట మండల కేంద్రంలోని నాల్గవ కేంద్రం మండల పరిషత్ విలీన విద్యా కేంద్రం శిథిల భవనంలో కొనసాగుతున్నందున పెచ్చులు ఊడి పడుతున్నాయి. ఆ భవనంలోనే చిన్నారులకు బోధన జరుగుతుంది. శిథిల భవనంకు మరమ్మతులు చేయటమా, నూతన భవనం నిర్మించడమా చేయాలని కోరుతున్నారు.



శామీర్‌పేటలో శిథిలమైన భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

● జవహర్‌నగర్ పురపాలికలో 22 కేంద్రాలున్నాయి. వీటిలో 18 సొంత, నాలుగు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. బాలాజీనగర్, చంద్రపురికాలని, ఫైరింగ్ రేంజ్, శ్రీరామ్‌నగర్‌కాలనీ, శివాజీనగర్‌లో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య నడుస్తున్నాయి. జయశంకర్‌కాలనీ, వికలాంగులకాలనీ, మోహన్‌రావునగర్, పాపయ్యనగర్, పాతబస్తీలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అవసరం ఉందని ఇటీవల అధికారులు గుర్తించారు.

● మేడ్చల్ మండలంలో 60 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 44 సొంత భవనాల్లో, 12 అద్దె భవనాల్లో ఉన్నాయి. డబిల్‌పూర్‌లో పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉంది. కొనాయిపల్లిలో మరుగుదొడ్లు లేవు. మేడ్చల్ పట్టణంలోని 3వ కేంద్రంలో పాముల భయం ఉండటంతో సొంత భవనం నుంచి అద్దె భవనంలోకి తరలించారు. ఎల్లంపేట్‌లో వర్షపు నీరు కేంద్రంలోకి వస్తుంది.



మేడ్చల్ మండలం డబిల్‌పూర్‌లో పెచ్చులూడుతున్న గదిలో వంట



కీసరలో ఇరుకు గదిలోనే వంట, సామాను, పిల్లలు

● కీసర మల్లికార్జున్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో గత కొన్నేళ్లుగా ఇరుకుగా ఉన్న అద్దె భవనంలో కొనసాగుతుంది. పిల్లలు ఒకవైపు కూర్చుంటే మరోవైపు వంట చేసి పెడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేక కొంత మంది తల్లిదండ్రులు కేంద్రానికి పంపించేందుకు ముందుకు రావడం లేదు. సొంత భవన నిర్మాణానికి స్థలం కేటాయించినా, ఇళ్లకు దూరంగా ఉండటంతో భవన నిర్మాణం చేపట్టలేదు. కీసర సెక్టార్‌లో 21 అంగన్‌వాడీ కేంద్రాలుండగా అందులో 3 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దీంతో పాటు కీసరలోని రెడ్డికాలనీ, కాపుగూడెంలో సైతం సొంత భవనాలు లేవు. నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల పరిధిలో 16 కేంద్రాలున్నాయి. వీటిలో ఒకటి అద్దె భవనంలో ఉంది.



ఫిర్జాదిగూడ మల్లికార్జునగర్‌లో పైఅంతస్తులో అంగన్‌వాడీ కేంద్రం

● బోడుప్పల్, ఫిర్జాదిగూడలో 16 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ఆరింటికి సొంత భవనాలుండగా, 10 చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఫిర్జాదిగూడ మల్లిఖార్జున్‌నగర్‌లో అద్దె భవనంలోని పై అంతస్తులో కేంద్రం ఉంది. గర్భిణీ స్త్రీలు, బాలింతలు పైకి ఎక్కాలన్నా ఇబ్బంది పడుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

ఘట్‌కేసర్, మేడ్చల్, కీసర, బోడుప్పల్, న్యూస్‌టుడే:

? యంనంపేట రైల్వే వంతెన కింద రాత్రి వేళ కొందరు పోకిరీలు చేరి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. –రమ్య, యంనంపేట

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.. –బి.రాజువర్మ, సీఐ, పోచారం

? చెక్‌పోస్ట్ నుంచి కిస్టాపూర్ వెళ్లేదారిలో రోడ్డుపక్కన కోళ్ల వ్యర్థాలు పారబోస్తున్నారు. – నవీన్‌కుమార్, చెక్‌పోస్ట్.

✓ వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. – నాగిరెడ్డి, కమిషనర్ మేడ్చల్ మున్సిపాలిటీ.

? కీసరలో కుక్కల బెడద తీవ్రమవుతుంది. రాత్రి వేళ ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి. – కృష్ణ, కీసర

✓ పరిశీలించి ప్రత్యేకంగా సిబ్బందితో వాటిని పట్టించి అటవీ ప్రాంతంలో వదిలేసేలా చర్యలు తీసుకుంటాం. – నాగమణి, కమిషనర్ దమ్మాయిగూడ

? బోడుప్పల్ సుద్దకుంట కల్వర్టు వద్ద చెత్త పారవేస్తున్నారు. – గోపాల్, గాయిత్రినగర్, బోడుప్పల్.

✓ చెత్త వేయకుండా తగిన చర్యలు తీసుకుంటాం. – రాజలింగం, కమిషనర్, బీఎంసీ.

సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

మేడ్చల్ రూరల్ న్యూస్‌టుడే: మేడ్చల్‌లో 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండడంతో సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని అత్వెల్లి లోటస్ ఎన్‌క్లేవ్ ప్రజలు శనివారం కలెక్టర్‌తో పాటు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. రహదారి పనుల కారణంగా స్థానిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు వాహనాలకు వ్యతిరేక దిశలో వస్తుండడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. పట్టణంలోని బాలాజీనగర్, రాఘవేంద్రనగర్ కాలనీలో రహదారులను ఆక్రమించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి కుంటలో పడి మహిళ మృతి


మేడ్చల్, న్యూస్‌టుడే: నీటి కుంటలో పడి మహిళ మృతి చెందిన ఘటన మేడ్చల్ ఠాణా పరిధిలో శనివారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కండ్లకోయ సీఎమ్మార్ కళాశాల సమీపంలోని మురికికుంటలో యాదమ్మ(45) ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. మృతురాలు రోడ్లపై ప్లాస్టిక్ బాటిల్‌లు సేకరిస్తూ జీవనం సాగిస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

కూలక ముందే కూల్చేయండి



రాజీవ్ రహదారి తూంకుంట పురపాలిక పరిధిలోని దేవయాంజాల- విమానాశ్రయం రోడ్డు, హకీంపేట క్రీడా పాఠశాల మధ్య రోడ్డుపై ఓచెట్టు పూర్తిగా ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం వేలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. మున్సిపాలిటీ అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే కూల్చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శామీర్‌పేట

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తూ త్వరలో పదవీవిరమణ చేయబోయే పలువురు ఉపాధ్యాయులకు ఘన సన్మానం జరిగింది. మండల విద్యాధికారి రామారావు ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, మైఖేల్‌రెడ్డి, ఆంజనేయులు, నీరజ, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్: పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంటు భారాస బాధ్యుడు రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చిలుకానగర్‌లోని మల్లికార్జుననగర్‌కు చెందిన పార్టీ నాయకుడు రామచందర్‌నాయక్ సతీమణి తులసి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వారు ఆమెను పరామర్శించారు. కార్పొరేటర్ బన్నాల గీతాముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: పేదల కోసం ప్రవేశపెట్టిన సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం ఏఎస్‌రావు నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 55 మంది లబ్ధిదారులకు రూ. 21.75 లక్షల చెక్కులను ఆయన అందజేశారు.

రెండు పడక గదుల ఇళ్లు కేటాయించాలని వినతి



కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, సొంత ఇల్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నట్లు బస్తీ దవాఖాన సపోర్టు టీం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్‌ను వారు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తమకు రెండు పడక గదుల ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘం అధ్యక్షుడు సుమన్, ఆకుల శ్రీనివాస్, అంజద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు చేరడమే ఇందిరమ్మ కమిటీ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర్ రెడ్డి

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: పేదల ఇంటింటికి పథకాలు చేరడమే ఇందిరమ్మ కమిటీ లక్ష్యమని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యులు మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం చర్లపల్లి డివిజన్‌లో ఇందిరమ్మ కమిటీల సమావేశం చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడే నాయకులకి గుర్తింపు లభిస్తుందని చెప్పారు.

ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఘట్‌కేసర్: ర్యాగింగ్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పోచారం ఐటీకారిడార్ ఎస్సై బి. నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శనివారం వెంకటాపూర్‌లోని నీలిమ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే ఎన్నో అనర్థాలు, దుష్పరిణామాలు చోటుచేసుకుంటాయని వివరించారు. కళాశాల డీన్ డా. లక్ష్మీప్రసన్న, అనురాగ్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డా. ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా సీతారాములుగౌడ్

శామీర్‌పేట: తెలంగాణ మలిదశ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా శామీర్‌పేట మాజీ ఎంపీపీ పల్లె సీతారాములుగౌడ్‌ను నియామిస్తు ఫోరం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ప్రకటించారు. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నాటి తెరాస ఏకైక ఎంపీపీగా శామీర్‌పేట మండలంలో పట్టు సాధించి తెలంగాణ వాణి వినిపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించి కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉన్నారు.

రహదారి ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ధీరేంద్రసామినేని

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాలను నివారించేందుకు జిల్లా రోడ్డు రవాణ శాఖ అధికారులు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా రవాణ శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికారుల వాహనాల డ్రైవర్లను ఈ సమావేశానికి ఆహ్వానించి ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల సంఘటనల వీడియోలను ప్రదర్శించారు. రోడ్డు భద్రతా నిపుణుడు ధీరేంద్రసామినేని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఎం. రఘునందన్‌గౌడ్, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ కడారు వెంకటరెడ్డి తదితరులు అవగాహన కల్పించారు. కలెక్టరేట్ ఏవో ఎల్. రామ్మోహన్, జిల్లా క్రీడాధికారి గోపాల్‌రావు, సంతోష్‌కుమార్, వివిధ శాఖల ఇబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏఎస్ రావునగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈసీఐఎల్ చౌరస్తాలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఫీజులను విడుదల చేయకపోవడంతో వివిధ ప్రవేశ పరీక్షలు పూర్తి అయినా ఉన్నత చదువులకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

ఎప్పుడు మూస్తారో... తెరుస్తారో తెలియదాయే!

● కీసరలో సక్రమంగా పనిచేయని మీసేవ కేంద్రం

కీసర, న్యూస్‌టుడే: కీసరలోని మీసేవ కేంద్రం ఎప్పుడు తెరుస్తారో... ఎప్పుడు మూసి ఉంటుందో తెలియక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ధరణి, ఇతరత్ర పనులకు కీసర పరిసరాల్లోని అంకిరెడ్డిపల్లి, బోగారం, కీసరదాయర, రాంపల్లిదాయర, వన్నిగూడ, కాపుగూడెం, కీసరగుట్టలోని ప్రజలందరు ఇక్కడికే వస్తారు. గత కొన్ని రోజులుగా షటర్ మూసేసి టూలెట్ బోర్డు తగిలించి ఉంది. దూరమైనా కొందరు తప్పని పరిస్థితుల్లో చీర్యాల లేదంటే నాగారంలోని మీ సేవ కేంద్రాలకు వెలుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మీ సేవ కేంద్రం సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ మధురానగర్ పార్క్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కార్పొరేటర్ చేతన తెలిపారు. శనివారం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించి జిమ్ ఏర్పాటు త్వరగా చేయాలని కోరారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి బెదిరింపులు..కేసు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: మాట్లాడకపోతే చచ్చిపోతా అంటూ బెదిరిస్తున్నాడని ఓ ఇంజినీరింగ్ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్‌లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సమీపంలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో ఉంటుంది. ఈసెట్ కోచింగ్ సమయంలో వినయ్ అనే విద్యార్థితో పరిచయం ఏర్పడింది. ఇటీవల వారి మధ్య గొడవ రావడంతో యువకుడికి దూరంగా ఉంటోంది. శుక్రవారం విద్యార్థిని ఉంటున్న వసతి గృహం వద్దకు వచ్చి తనతో మాట్లాడాలని లేకపోతే చచ్చిపోతానని బెదిరించి, ఆమె తల్లికి ఫోన్ చేసి బెదిరించాడు. భయపడిన విద్యార్థిని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు ఎస్ఐ జి. నరసింహ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైకి వచ్చేది ఎలా..?

ఇబ్బంది పడుతున్న వృద్ధులు, పిల్లలు

న్యూస్‌టుడే, హబ్సిగూడ

పరిస్థితి ఇది... వివేక్‌నగర్ వీధి నంబరు 10లో రెండు నెలల క్రితం బాక్సు డ్రైన్ నిర్మాణం పనులను చేపట్టారు. రామంతాపూర్ డివిజన్ శ్రీనగర్ కాలనీ నుంచి హబ్సిగూడ డివిజన్ రాంరెడ్డినగర్‌కు వెళ్లే సర్వీసు రోడ్డులో సీసీ రోడ్డును తవ్వీ పనులను ప్రారంభించారు. తరువాత కాలనీలోని ఇళ్ల ముందు బాక్సుడ్రైన్ నిర్మాణానికి కాలువను తవ్వారు. తవ్విన కాలువపైన స్థానికులు బయటకు రావడానికి కర్రలను ఏర్పాటుచేశారు. అంతబాగానే

నిధులు: రూ.1.50 కోట్లు
పనులు: రామంతాపూర్ డివిజన్ వివేక్‌నగర్ బాక్సు డ్రైన్ నిర్మాణం



ఇంట్లోంచి బయటకు రావడానికి ఏర్పాటుచేసిన కర్రలు

నెమ్మదిగా సాగుతున్నాయి..

కార్పొరేటర్ శ్రీవాణి.. రెండునెలలుగా పనులు నెమ్మదిగా కొనసాగుతున్నయి. పనులను వేగంగా పూర్తి చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకువస్తా.

పనులు వేగంగా.. ఏఈశ్వేతశ్రీ. బాక్సు డ్రైన్ కోసం తవ్విన కాలువ పైనుంచి నడిచేందుకు చెక్కలు ఏర్పాటు చేస్తాం. పనులు తొందరగా అయ్యేలా చూస్తాం.

కాలువ పైనుంచి కర్రల మీదునుంచి వృద్ధులు, మహిళలు, రోగులు బయటకు రాలేకపోతున్నారు. నెల నుంచి ఓ వృద్ధురాలు బయటకు రాలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పనులను నెమ్మదిగా చేస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

పీర్జాదిగూడ(బోడుప్పల్): ప్రార్థన మందిరాలపై దాడి చేస్తూన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం వరంగల్ జాతీయ రహదారి ఉప్పల్ డిపో వద్ద వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సికింద్రాబాద్‌లో ప్రార్థన మందిరంపై దాడి చేసిన దోషుల వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని చెప్పారు.

ఘట్‌కేసర్: ప్రార్థన మందిరాలపై జరుగుతున్న భౌతిక దాడులను నిరోధించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాష్ట్ర భాజపా కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఘట్‌కేసర్ మండలం కొర్రెములలో ఆపార్టీ నిర్వహించిన శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని మహిళ ఫిర్యాదు

పోచారం(ఘట్‌కేసర్), న్యూస్‌టుడే: ఓ వ్యక్తి వేధిస్తుండడంతో మహిళ పోలీసులను ఆశ్రయించింది. పోచారం ఐటీకారిడార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌదరిగూడకు చెందిన మహిళ బ్యూటీషియన్. 17 ఏళ్ల క్రితం ఓ వ్యక్తితో, మూడేళ్ల ఏళ్ల క్రితం మరొకరితో వివాహాలు జరిగి విడాకులు తీసుకుంది. ప్రస్తుతం ఆమెకు 16 ఏళ్ల కొడుకు ఉన్నాడు. గతేడాది నుంచి జయకృష్ణయాదవ్‌తో అనే వ్యక్తితో సహజీవనం చేస్తుంది. ఈ మధ్య మహిళ ఫోన్‌లో మాట్లాడితే అనుమానించి వేధిస్తున్నాడు. ఇనుప రాడ్డుతో ఆమెను కొట్టి గాయపరిచాడు. తనకు రక్షణ కల్పించాలని శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్సై కృష్ణయ్య దర్యాప్తు చేపట్టారు.

నైపుణ్యం.. ఉద్యోగం



గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో సర్టిఫికెట్ కోర్సు

ఈనాడు, హైదరాబాద్: పర్యావరణహిత కార్యక్రమాల్లో నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా చేపట్టిన గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(జీఎస్‌డీపీ)లో గచ్చిబౌలిలోని ఈపీటీఆర్ఐ సర్టిఫికెట్ కోర్సులను ప్రవేశపెట్టింది. ఈ మేరకు తాజాగా 'వేస్ట్ ఆప్టిమైజేషన్ ప్రొఫెషనల్' కోర్సుకు సంబంధించి 90రోజుల ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హులైన వారికి ఉచిత బస, క్షేత్రస్థాయి పర్యటనల అనంతరం సర్టిఫికెట్ ఇస్తామని, దీంతో రీసైక్లింగ్ కేంద్రాల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయని ఈపీటీఆర్ఐ(ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

పర్యావరణహితం..

స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రీన్ స్కిల్ ఇండియా డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ప్రారంభించింది. పర్యావరణహిత కార్యక్రమాల్లో శ్రామికశక్తిని పెంపొందించడమే లక్ష్యం. ఇందులో భాగంగానే తాజాగా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. థియరీ, ప్రాక్టికల్ తరగతులతో ప్రాథమిక భావనలపై పరిజ్ఞానం అందించడంతో పాటు క్షేత్ర స్థాయి పర్యటనలు, శిక్షణలో భాగస్వామ్యం కల్పించనున్నారు. ఇందులో పొందిన నైపుణ్యాలతో పరిశ్రమలు, రీసైక్లింగ్ కేంద్రాలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఉద్యోగాలు పొందొచ్చు. నవంబరు రెండో వారంలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయి.. అక్టోబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్, డిగ్రీ, బీటెక్‌తో పాటు సంబంధిత విభాగంలో అనుభవమున్నవారు అర్హులు. వచ్చిన దరఖాస్తుల తరువాత ఇంటర్వ్యూ తదితర వడపోతల ఆధారంగా ఎంపిక చేస్తారు. నవంబరు 4న ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్నవారు https://forms.gle/C2KPyb42N1XGUrb69 గూగుల్ ఫారమ్‌లో వివరాలు నమోదు చేయాలి.



బేగంబజార్‌లో ఆశ్రయం పొందుతున్న కిడ్నీ రోగులు

దయాలసిస్!

- పేద రోగులకు అండగా శ్రీరామ్‌నాథ్ ఆశ్రమం
- రోజూ రూ.50ల అద్దె

– న్యూస్‌టుడే, ఉస్మానియా ఆసుపత్రి

"ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన షఫీక్(32) ఆటోడ్రైవర్. కొంత కాలంగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. పరీక్షించిన వైద్యులు మూత్రపిండం మార్పిడి చేయాలని నిర్ణయించి 'జీవన్‌దాన్' ట్రస్టులో పేరు నమోదు చేయించారు. జీవన్మృతి చెందిన వ్యక్తి శరీరంలో నుంచి సేకరించిన మూత్రపిండాన్ని ఉస్మానియా వైద్యులు ఏడు నెలల క్రితం మార్పిడి చేశారు. పేద కుటుంబం కావడంతో దూరాభారంతో వరంగల్ వెళ్లడం లేదు."

"నల్గొండ జిల్లా కేతిపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(59) రెండేళ్లుగా ఉస్మానియాలో డయాలసిస్ చేయించుకుంటున్నారు."

– ఇవీ రెండు ఉదాహరణలు మాత్రమే. ఇలాంటి వారు ఎంతో మంది ఆశ్రమంలో సేవలు పొందుతున్నారు.

చికిత్సకు దూర ప్రాంతాల నుంచి ఉస్మానియా ఆసుపత్రికొచ్చే మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు శ్రీరామ్‌నాథ్ ఆశ్రమం నిలువ నీడనిస్తూ ఉదారతను చాటుతోంది. 60 ఏళ్ల కిందట బేగంబజార్‌కు చెందిన కొందరు విరాళాలు పోగు చేసుకుని ఉస్మానియాకు వచ్చే పేద రోగులకు తమ వంతు సాయం చేయాలని నిర్ణయించారు.

తక్కువ ఖర్చు.. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు ఎనిమిది మంది కిడ్నీ రోగులు ప్రస్తుతం ఆసుపత్రికి సమీపంలోనే ఉన్న రామ్‌నాథ్ ఆశ్రమంలో రోజూ రూ.50 చొప్పున అద్దె చెల్లించి ఆశ్రయం పొందుతున్నారు. కొందరు రెండు నుంచి నాలుగేళ్ల వరకు అందులో ఉంటున్నారు.

ఆశ్రమంలో గదుల సంఖ్య 50

గదుల్లో రోగులు, వారి కుటుంబ సభ్యులకు అన్ని వసతులు ఉన్నాయి. వంట చేసుకునే సౌలభ్యం ఉంది.

అసహాయులు కాదు..

పనిమంతులు

- బుద్ధి మాంద్యులను తీర్చిదిద్దుతున్న లేఖాదీప్
- సహకారం అందిస్తున్న ఏజీ కార్యాలయం



ప్లేట్ల తయారీలో నిమగ్నమవుతూ..

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: వారంతా సాధారణ వ్యక్తుల్లానే కనిపించినా, తమంతట తాము ఏ పని చేసుకోలేని బుద్ధిమాంద్యులు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ జీవితంలో నిలదొక్కుకొని ముందుకు సాగుతున్నారు. కొద్దోగొప్పో సంపాదించి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. వారి మానసిక వికాసానికి బాసటగా నిలుస్తోంది. 'లేఖాదీప్' శిక్షణా కేంద్రం.

1994లో ఏర్పాటు.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అకౌంటెంట్ జనరల్ కార్యాలయం సహకారంతో 1994లో వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధి ఏజీకాలనీలో లేఖాదీప్ శిక్షణా కేంద్రం ఏర్పాటైంది. బుద్ధిమాంద్యుల్లో మానసిక పరిపక్వత పెంపొందించడం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. ప్రస్తుతం ఇక్కడ 50 మంది తర్ఫీదు పొందుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 250 మందిని తమ పని తాము చేసుకునేలా తీర్చిదిద్దామని అధ్యక్షుడు ఆర్.సాంబశివరావు తెలిపారు.

శిక్షణ అంశాలు ఇలా.. నోటు పుస్తకాలు, పుస్తక బైండింగ్, ప్యాకింగ్, జిరాక్స్, కంప్యూటర్, ఆఫ్‌సెట్ ప్రింటింగ్, యోగా, సంగీతం, క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. వారు తయారు చేసిన వస్తువులను ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలనీ సంక్షేమ సంఘాలకు విక్రయిస్తున్నారు.

ఇలా చేరొచ్చు.. 18 ఏళ్లు నిండిన బుద్ధిమాంద్యులు అర్హులు. అభ్యర్థిని బోయిన్‌పల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ సంస్థకు తీసుకెళ్లి సామర్థ్యం తెలుసుకుంటారు. రోజు ఉ.10 నుంచి మ.3.30 వరకు శిక్షణ ఉంటుంది. లేఖాదీప్ ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 040-23710024, 9491124878 తెలుసుకోవచ్చు



జిమ్‌లో సాధన చేస్తూ..

మతోన్మాద శక్తుల కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం: కేంద్ర మంత్రి

కూకట్‌పల్లి: మతోన్మాద శక్తులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిరసన తెలుపుతున్న వారిపై లాఠీఛార్జి హేయమన్నారు. సికింద్రాబాద్ మోండా డివిజన్‌లోని ప్రార్థనా మందిరం వద్ద జరిగిన పోలీసు లాఠీఛార్జిలో గాయపడిన ఓల్డ్‌బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన భాజపా నాయకుడు సాయిని శనివారం ఆయన పరామర్శించారు.

కంటోన్మెంట్: రెజిమెంటల్‌బజార్‌లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హిందూ సంఘాల ప్రతినిధులపై పోలీసులు శనివారం చేసిన లాఠీఛార్జిలో పికెట్‌కు చెందిన వెంకటేశ్‌ను కేంద్ర మంత్రి బండి సంజయ్, కంటోన్మెంట్ భాజపా నాయకులతో కలిసి వెంకటేశ్‌ను పరామర్శించారు. అనంతరం అతడిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.



వెంకటేశ్‌ను పరామర్శిస్తున్న సంజయ్

శాంతిభద్రతలను కాపాడేందుకే లాఠీఛార్జి: డీసీపీ

రెజిమెంటల్‌బజార్: సికింద్రాబాద్ కుమ్మరిగూడలో అదుపుతప్పిన ఆందోళనకారులను కట్టడి చేసేందుకే లాఠీఛార్జి చేయాల్సి వచ్చిందని డీసీపీ సాధన రష్మిపెరుమాళ్ తెలిపారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ..నిరసనకారులు ప్రదర్శనకు అనుమతి తీసుకోలేదన్నారు. స్థానిక ఓ మందిరం ధ్వంసం చేసేందుకు వెళ్తున్న గుంపును నిలువరించేందుకు యత్నించినా ఆగకపోవడంతో లాఠీఛార్జి తప్పలేదన్నారు.



నిర్మాణ రంగంలో హైదరాబాద్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. కొంపల్లిలోని కన్వెన్షన్‌లో శనివారం రూఫ్ అండ్ ఫ్లోర్ ప్రాపర్టీ ప్రదర్శనను ప్రారంభించారు.
–న్యూస్‌టుడే, పేట్‌బషీర్‌బాద్

టాస్ పబ్‌పై దాడి..

17 మందిపై కేసు

- 142 మందిని అదుపులోకి తీసుకొన్న పోలీసులు
- పట్టుబడిన వారిలో మహిళలే అధికం



యువతులను వాహనం ఎక్కిస్తున్న పోలీసులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: బంజారాహిల్స్‌లోని టాస్ పబ్‌పై శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు నిర్వహించిన దాడుల్లో 142 మందిని పోలీసులు అదుపులోకి తీసుకోగా వారిలో 17 మందిపై కేసులు నమోదు చేశారు. ఏసీపీ వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర కథనం ప్రకారం.. రోడ్ నం.3లోని టాస్(టేల్స్ ఓవర్ స్పిరిట్స్) పబ్‌పై పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. పబ్‌లో విపరీతమైన శబ్దాలతో యువతులు, మహిళలు అశ్లీల నృత్యాలు చేస్తుండటాన్ని గుర్తించారు. కొందరు యువతులు మద్యం సేవిస్తూ అక్కడున్న పురుషులతో దగ్గరగా ఉండటాన్ని గుర్తించారు. వంద మంది మగవారితోపాటు 42 మంది మహిళలను అదుపులోకి తీసుకొన్నారు. వీరందరిని బంజారాహిల్స్ ఠాణాకు తరలించి.. 125 మందికి నోటీసులు అందించారు. పబ్ మేనేజర్ అలీమ్, బార్ టెండర్ రామకృష్ణ, డీజే ఆసిఫ్, బౌన్సర్లు ఆరిఫ్, అబ్దుల్ సమి, సయ్యద్ షహీద్, యూసుఫ్ ఖాషీ ఖాన్‌లతోపాటు గతంలో ఊర్వశి బార్‌లో, ఆఫ్టర్ 9 పబ్‌లో పట్టుబడ్డ పది మంది మహిళలపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామన్నారు. పబ్ యజమానులైన ఉప్పల్‌కు చెందిన బింగి బలరాం గౌడ్, జగద్గిరిగుట్టకు చెందిన బింగి శ్రీనివాస్‌గౌడ్‌లు పరారీలో ఉన్నారని, వారి కోసం రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు. అమ్మాయిలు, మహిళలకు పబ్ యజమానులు ఉచిత ప్రవేశం కల్పించడమే కాకుండా బిల్ ఎక్కువయ్యేలా వచ్చిన కస్టమర్లతో మాటలు కలుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆయా మహిళలు, యువతులకు వచ్చిన బిల్లులో కమీషన్ సైతం ఇస్తున్నట్లు తేల్చారు. కస్టమర్లతో దగ్గరైన మహిళలు పక్కన కూర్చొంటే, మీద చేయి వేస్తే, కలిసి డ్యాన్స్ చేస్తే.. ఇలా అన్నింటికి ధర నిర్ణయించినట్లు తమ విచారణలో గుర్తించారు. పబ్‌ను సీజ్ చేసేందుకు ఎక్సైజ్ శాఖకు లేఖ రాసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పబ్‌కు వచ్చే వారితో కలిసి నృత్యం చేసి ఆర్థిక అవసరాలు తీర్చుకోవడానికి ఇలా వచ్చి వెళ్తున్నట్లు నాలుగు నెలల కుమార్తె ఉన్న ఒక మహిళ పోలీసుల ముందు వాపోయింది.





వర్ణ చిత్రాలు.. వంతెనలకు అందాలు

నగర ముఖ ద్వారంగా ఉన్న ఎల్బీనగర్ కూడలికి ఫ్లైఓవర్లు ఆకర్షణీయంగా మారాయి. చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టిన పైవంతెనలకు ప్రభుత్వం మరింత సొబగులు అద్దుతోంది. అందమైన చిత్రాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు తమ ప్రతిభతో జీవ వైవిధ్య చిత్రాలను కళ్లకు కడుతున్నారు. – న్యూస్‌టుడే, నాగోలు

ఇంటి నిర్వహణ బాగుంటే 80 ఏళ్లు మన్నిక

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యాభై ఏళ్లు ఉండాల్సిన భవనం నిర్వహణ బాగుంటే 80 ఏళ్లు మన్నిక ఉంటుందని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి కుల్‌దీప్ సింగ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్లకు సంబంధించి కేంద్రం వాటా ఉండటంతో వాటిని ఎవరికి ఇచ్చారు? లబ్ధిదారులే ఉన్నారా? అద్దెకిచ్చారా? విక్రయించారా? అనే కోణంలో కేంద్ర హౌసింగ్ అధికారులు ఖైరతాబాద్‌లోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయాన్ని గత రెండు రోజులుగా పరిశీలించారు. శనివారం సంయుక్త కార్యదర్శి అక్కడికి చేరుకొని నాలుగు బ్లాకులనూ పరిశీలించి నివాసితులతో మాట్లాడారు. ఇంటిని కాపాడుకునేందుకు నిర్వహణకు అందరూ కొంత సొమ్ము చెల్లించాలని సూచించారు.

రూ.4వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల రూ.4వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరలు పెరుగుతుంటే ఉపకార వేతనాలు, మెస్ ఛార్జీలు పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, పాఠశాల, కళాశాల వసతి గృహాల్లో మెస్‌ఛార్జీల పెంపు, 16లక్షల మంది కళాశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు పెంచాలన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని వసతి గృహాలను ముఖ్యమంత్రి సందర్శించి అక్కడ భోజనం చేయాలని సూచించారు. ఆరేళ్ల క్రితం మెస్ ఛార్జీలే కొనసాగుతున్నాయని, ఛార్జీలు పెరగకపోవడంతో వార్డెన్లు రోజు వారి మెనూ పాటించడం లేదన్నారు.



Wanted Exp Driver for KIA Seltos Near by Bowrampet, Bachupally. Salary Rs. 18000 P.M. Contact: 9848131167.

Wanted DCM Drivers Eicher 6 tyre, Star Roadlines. Ph: 8019392351, 7893902039

Wanted Car Driver (Experienced) For Hyderabad, Nagole Area, Salary: 19,000/-. Contact: 9866141896

Wanted Experienced Car Driver near Seethafalmandi, Secunderabad. Interested Call: 9704698482.

SR నగర్‌లో ఉంటున్న Retd Govt ఆఫీసర్ గారి కారుకు 20 సం||ల అనుభవం గల డ్రైవర్ కావలెను. దగ్గరలో ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 9640473078.

బంజారాహిల్స్‌లో పనిచేయుటకు ఇంటిపని, వంటపని తెలిసిన డ్రైవర్ భార్యాభర్తలు కావలెను. డ్రైవింగ్‌లో 5-10 సం॥ అనుభవం (30-35 సం॥), సింగిల్ డ్రైవర్ కావలెను. 9100029360.

కార్ డ్రైవర్ కావలెను. పంజాగుట్ట పరిసర వారికి ప్రాధాన్యత. 7 సం|| అనుభవం తప్పనిసరి. ✆ 7331111657.

Komapally & Auto Nagar 207/407 వాహన డ్రైవర్లు కావలెను. Day shift only. మంచి జీతం+ బత్తా+ OT. Carry Fresh. 9884121820.

డ్రైవర్ కావలెను. Ashok Leyland 10 Tyres టిప్పర్ కొరకు హెవీ లైసెన్స్, బ్యాడ్జి కలిగి ఉండవలెను. సంప్రదించండి ✆ 9912151629, 8919275712.

ACCOUNTING

Accountant (Exp/Fre) Required @ S&S Group @ Kompally, Uppal, Banjarahills, Gachibowli. walk-in-Interview: 21st Oct, Time: 9AM, Location: Kompally. Email: employment.sandsgroup@gmail.com, Ph: 77999 19090

Female Tally Accountant Is Required For Acc. & Admin Work For Reputed Gem & Jew. Firm With 3 Years Experience. GST Knowledge Is Advantage. English, Hindi & Telugu Must. Walk-In On Any Working Day Between 4 To 5 Pm At GJA- The Gem & Jewellery Academy, Oasis Plaza, 3rd Floor, Tilak Road, Abids, Hyd. M: 9848017364

BANKING/ INSURANCE

Wanted Office/ Feild Assistant (Male) and Computor Operator (M or F) Nearby LB Nagar. Contact: 7801042767

స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఏజెంట్స్ కావలెను. No exam for LIC ఏజెంట్స్, ఇన్సెంటివ్స్, విదేశీయానం, life long income. 9247799830 Sr. మేనేజర్

BPO/ CALL CENTER

Wanted Female Tele Sales Executive for Office at Nizampet. 9 AM to 5.30 PM. Mon to Sat. WhatsApp Resume to: 9849082520 (HR will call you)

మధురానగర్ శారద శారీస్ నందు కస్టమర్లకు ఫోన్‌లు చేయడం కొరకు అనుభవం కల్గిన Tele Callers కావలెను. ✆ 9912641658, 7981582891.

ENGINEERING

We are currently seeking a skilled and motivated Mechanical Engineer to join our Team. Company: Stratos Project Pvt. Ltd. Position: Manager, Experience: At least 1-2 Years, Location: Narayanpet (on site) Employment Type: Full Time. Ph: 9394563366.

MEDICAL

Wanted Female Gynaec DMOs, Front Office Executives, Marketing Executives, Office Boys. Southern Gem Hospital, Basheerbagh, Hyd. Call Sainath: 9951964120.

Pharmacist required immediately to Krishna children's hospital Lakdikapool. Ph: 9246330660, 9182121820

Wanted Doctors, Lab Tech. Receptionist Exp. Insurance Coordinator, ICU Nurses, Pharmacist for Hospital @ Kompally ✆ 8688014659.

RR Pharmacy & Diagnostic Req. 2-3yrs Exp. in Medical shop, Lab Technician & Sister. Gayatri Nagar, Karmanghat. Ph: 7893941010.

Need physiotherapist to do physio for paralysis patient at ramanthapur. Ph: 9008022536

Wanted Consultants/ Working Doctor Partners of All Specialities for A Doctor Owned Running Hospital at Shamshabad. Ph: 9441030379.

ప్రముఖ జనరిక్ మెడికల్ హాల్ లో పార్ట్/ ఫుల్ టైమ్ పని చేయుటకు మంచి అనుభవంగల సేల్స్ మెన్స్ కావలెను, మంచి వేతనం, సంప్ర: 9248565099, 9030099533

మలక్‌పేట, మూసారంబాగ్, హెగ్డే మెటర్నిటి నర్సింగ్ హోమ్‌లో పని చేయుటకు, లేడీస్ సూపర్‌వైజర్స్, ఆయాస్, స్టాఫ్‌నర్స్ విత్ ఎక్స్‌పీరియన్స్. Ph: 9949668770, 040-24549575.

PART TIME

Wanted 'marketing+ social media expert' for website, e-book store, WFH. Serious people share interest vmsplanning05@gmail.com or contact www.excelreads.com

SECURITY GUARDS

Wanted Exp Security Guards M/F for Engineering College near Secunderabad. Resume Send to: principalvieb@gmail.com.

సికింద్రాబాద్‌లో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ (పు) Q: డిగ్రీ & శానిటేషన్ సూపర్‌వైజర్స్ & వర్కర్స్ కావలెను. Ph: 9346800433, 8555031103

వాచ్‌మెన్ వాంటెడ్ ఫర్ రెసిడెన్స్ @ రోడ్ నెంబరు 12 బంజారాహిల్స్ విత్ గుడ్ రిఫరెన్సెస్. శాలరీ 15000 కాంటాక్ట్: 9949477677

BEAUTICIAN

Wanted lady Beauticians for Ladies Beauty Parlor @ Kothapet 7075477095, @ Nizampet 8885420803, Good salary

TOURS AND TRAVELS

కార్తీకమాసం జ్యోతిర్లింగాలు భీమశంకర్, త్రయంబకేశ్వర్, ఘృష్ణేశ్వర్, ఔండ నాగనాథ్, పరళీ వైద్యనాథ్, షిరిడి, కొల్హాపూర్, పండరీపూర్, తుల్జాపూర్ + 20 క్షేత్రములు 8 రోజులు మహారాష్ట్ర ఏసీ బస్సు Nov. 4 & 26. లక్ష్మీ టూర్స్. ✆ 98662 46466.

సాయి టూర్స్ Nov-2 అష్ట గణపతులు, భీమశంకర్, పరళి వైద్యనాథ్, త్రయంబకేశ్వర్, షిరిడి, Nov-10, కాశీ 9 నిద్రలు. అయోధ్య Nov-26. కర్ణాటక టూర్. Dec-9 గుజరాత్ టూర్. 9848664831.

నవంబర్ 10వ తారీకు స్లీపర్ బస్సు కాశీ, అయోధ్య, ఢిల్లీ, ఆగ్రా, మధుర, నేపాల్, ముక్తినాథ్ 35,000 ప్రజెంట్ ఆఫర్ 20,000 మాత్రమే. ✆ 98487 82131 ఫోన్ పే నెం. హనుమంతరావు గుప్తా.

9 రోజుల కుంభమేళ యాత్ర ప్రయాగలో స్నానం, & గయా, కాశీ, నైమిశారణ్యం, అయోధ్య 24-1-2025న రైలులో ప్రారంభం అన్ని సదుపాయలతో రూ. 18945/- R.V. రమణ, శ్రీయతిరాజ్ ట్రావెల్స్ సర్వీస్ వైజాగ్. (M) 7036937714.

కార్తీక మాసంలో కాశీ యాత్ర 9 నిద్రలు * అయోధ్య, త్రివేణి సంగమం, 2 శక్తీ పీఠాలు, కాలభైరవ మొ|| Nov, Dec, శ్రీ అన్నపూర్ణేశ్వరి ట్రావెల్స్ ✆ 9347067958

కాశీ రామేశ్వరం Nov 2, 17 రో|| 27 యా. 26,500/- కాశీ యాత్ర Nov 12, 6 రో. 10 యా. 9,500/- టిఫిన్+ భో||తో. మా టూర్, Hyd. 9493652100, 6304230161.

BOOK YOUR CLASSIFIED
Ad ₹1450/- (5 Lines B/w)
3 Ads Package ₹ 3695/-
7 Ads Package ₹ 8580/-
★ GST 5% Extra
Ph: 040- 23440304, 23318181, Extn: 6422
Through Online
www.eenaduclassifieds.com

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

ప్రజా భద్రతకు విఘాతం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న సౌత్‌-ఈస్ట్ జోన్ డీసీపీ సుభాష్

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రజా భద్రతకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని సౌత్‌-ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ హెచ్చరించారు. గేమింగ్, వ్యభిచారం, డ్రగ్స్ తదితర చట్టవ్యతిరేక పనులకు ప్రాంగణాన్ని వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే, సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని పలు లాడ్జిలు, హోటళ్ల నిర్వాహకులను సూచించారు. సైదాబాద్ ఠాణాలో శనివారం సౌత్‌-ఈస్ట్ పరిధిలోని పలు లాడ్జిలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాడ్జిల పనితీరుకు సంబంధించిన పలు నిర్దిష్ట సూచనలు చేశారు. అదనపు డీసీపీ తాడూరి స్వామి, సైదాబాద్, మలక్‌పేట, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట ఏసీపీలు వెంకన్ననాయక్, శ్యామ్‌సుందర్, మహమ్మద్ గౌస్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

అమెరికా నేషనల్ క్రికెట్ లీగ్‌లో ప్రతిభ

సైదాబాద్, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఎన్నారై కార్తీక్ గట్టేపల్లి అమెరికా నేషనల్ క్రికెట్ లీగ్ టోర్నీలో సత్తా చాటాడు. వరంగల్‌కు చెందిన డాక్టర్ జయసాగర్ గట్టేపల్లి (ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఫిజిక్స్ ఆచార్యుడు), శకుంతల దంపతులు చైతన్యపురిలో నివసిస్తున్నారు. వీరి కుమారుడు లక్ష్మానంద్ సాగర్ అమెరికాలో స్థిరపడ్డారు. లక్ష్మానంద్ సాగర్ పెద్ద కుమారుడు కార్తీక్ ఇటీవల నిర్వహించిన అమెరికా నేషనల్ క్రికెట్ లీగ్ టోర్నీలో 12 వికెట్లు సాధించి, ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని సచిన్ టెండూల్కర్ చేతుల మీదుగా అందుకున్నట్లు కుటుంబ సభ్యుడు, సైదాబాద్ మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల విశ్రాంత ఆచార్యుడు వెంకటాచారి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.


కార్తీక్ గట్టేపల్లి

పనులు పూర్తయినా.. తొలగని అడ్డంకులు



రేడియల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన ప్రాంతాల్లోనూ రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మత్స్యగూడ తాజా హోటల్ వద్ద సీసీ రోడ్డు నిర్మాణం, క్యూరింగ్ పనులు మూడు రోజుల కిందటే పూర్తయ్యాయి. క్యూరింగ్ కోసం మట్టితో రోడ్డు కట్టిన కట్టలను తొలగించి, ఆ మట్టిని అక్కడే వదిలేయడంతో రాకపోకలకు అడ్డుగా మారింది. మట్టిని తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, బండ్లగూడ

లబ్ధిదారులు 8.76 లక్షలు

పేదలకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం



చంపాపేట, హయత్‌నగర్, న్యూస్‌టుడే: అది దేశాన్ని కోవిడ్ మహమ్మారి వణికిస్తున్న కాలం. లాక్‌డౌన్, దాని అనంతర పరిణామాలతో లక్షలాది మంది ఉపాధి కోల్పోయారు. చేసేందుకు పనులు లేక, పూట గడవక ఇబ్బంది పడుతున్న పేదలకు కేంద్ర ప్రభుత్వం.. చౌకధరల దుకాణాల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ ప్రారంభించింది. అనంతర పరిణామాలతో ప్రతి మూడు నెలలకోసారి అన్న యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగిస్తూ వస్తోంది. తాజాగా కేంద్రం మరో నాలుగేళ్ల ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొంది. 2028 డిసెంబరు వరకూ ఆహార భద్రత కార్డుదారులకు ఉచిత బియ్యం పంపిణీకి కేంద్రం అంగీకరించడంతో లక్షలాది మంది పేదలకు ప్రయోజనం కలగనుంది. పౌరసరఫరాల విభాగం సరూర్‌నగర్ సర్కిల్‌లో ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు, మహేశ్వరంలోని రెండు డివిజన్లు ఉండగా, మలక్‌పేట సర్కిల్‌లో మలక్‌పేట, యాకత్‌పురా నియోజకవర్గాలు, ఎల్బీనగర్‌లోని కొన్ని బస్తీలు ఉన్నాయి. ఈ రెండు సర్కిళ్ల పరిధిలో సుమారు 8.76 లక్షల మందికి మేలు జరుగుతుంది. లబ్ధిదారు ఒకరికి నెలకు ఆరు కిలోల చొప్పున సరూర్‌నగర్ సర్కిల్‌లో ప్రతి నెలా 3,600, మలక్‌పేట సర్కిల్‌లో 1,439 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయనున్నారు.

సర్కిల్	సరూర్‌నగర్	మలక్‌పేట
దుకాణాలు	218	97
రేషన్‌కార్డులు	1,82,605	68,913
లబ్ధిదారులు	6,13,304	2,62,900
ప్రతినెల అందించే బియ్యం	3,600	1,439

(మెట్రిక్ టన్నుల్లో)

ఆహార భద్రతే ధ్యేయంగా..

నిరుపేదలకు ఆహార భద్రత కల్పించేందుకు ఏర్పాటైన ప్రజా పంపిణీ వ్యవస్థ రానురాను నిర్వీర్యం అవుతోంది. బియ్యం తప్పా, మరే వస్తువులు విక్రయించడం లేదు. గతంలో మాదిరి నూనెలు, చక్కెర, గోధుమలు ఇతర ఆహారపదార్థాలు అందజేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కనీసం పండుగల సందర్భాల్లోనైనా పెసర్లు, ఇతర వస్తువులు ఇవ్వాలంటున్నారు. దీంతో నిత్యావసర ఆయా వస్తువులను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేస్తూ.. ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గోదాముల సరఫరా మెరుగ్గా ఉందని ఆయా విభాగం అధికారులు వెల్లడిస్తున్నా.. డీలర్లు ఇవ్వడం లేదనే విషయం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అర్థమవుతోంది. ఒక్కో నెలలో ఒక్కో మాదిరిగా గోదాముల సరఫరా అవుతుందంటూ, విక్రయించలేమని డీలర్లు చేతులెత్తేస్తున్నారు. అధికారులు స్పందించి గతంలో మాదిరిగా అన్ని సరకులు అందేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

అమ్మినా.. కొన్నా నేరమే..
పుల్లయ్య, పౌర సరఫరాల అధికారి, సరూర్‌నగర్ సర్కిల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఆర్థికభారాన్ని మోస్తూ పేద, మధ్య తరగతి ప్రజల కోసం ఉచిత బియ్యాన్ని అందిస్తోంది. లబ్ధిదారులు ఆ బియ్యాన్ని అమ్ముకోకుండా.. సొంతానికి వాడుకోవాలి. రేషన్ బియ్యం అమ్మినా, కొన్నా నేరమే. అదే విధంగా కార్డుదారులంతా స్థానిక రేషన్ దుకాణాల్లో తప్పనిసరిగా కేవైసీ పూర్తిచేసుకోవాలి.

మేమున్నాం.. మీకు తోడుగా..
ఉ.10 నుంచి మ.1 గంట మధ్య
ఎల్బీనగర్: 76759 19030
మలక్‌పేట: 80085 73284
హయత్‌నగర్: 98336 64897
కర్మన్‌ఘాట్: 94400 32872
బండ్లగూడ: 96034 78579
మూసారాంబాగ్: 79933 00559

న్యూస్‌టుడే, సైదాబాద్, బండ్లగూడ, కర్మన్‌ఘాట్, వనస్థలిపురం

? అక్బర్‌బాగ్ కూడలిలో వాటర్ ఫౌంటెయిన్ వద్ద తరచూ సమీప ప్రాంతాల్లోని నివాసాల నుంచి వచ్చిన వృథా జలం పారుతోంది. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. – గిరిధర్, అక్బర్‌బాగ్
✓ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, సమస్య పరిష్కార చర్యలు చేపడతాం. – ఫయాజ్ అల్తాఫ్, మేనేజర్, జలమండలి

? ఆనంద్ నగర్ రోడ్డు నంబర్-4 నుంచి ఫత్తుల్లాగూడ వరకు వీధి దీపాలు పగటిపూట సైతం వెలుగుతున్నాయి. సిబ్బందికి సమాచారమిస్తే.. రేపు, మాపు అంటున్నారే తప్పితే, మరమ్మతులు చేయడం లేదు. – సత్యం, ఆనంద్ నగర్
✓ టైమర్‌లో సమస్య ఉన్నట్లుంది. వెంటనే సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. – కోటయ్య, సూపర్‌వైజర్, వీధి దీపాల విభాగం, జీహెచ్ఎంసీ

? చంపాపేట ప్రధాన రోడ్డు మేఘా వేడుకల మందిరం సమీపంలో రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. రాకపోకలు సాగించలేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – శ్రీనివాస్, కర్మన్‌ఘాట్
✓ ప్రధాన రోడ్డును ఆనుకొని ఉన్న కాలనీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారికి మరమ్మతు చేపట్టి, వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తాం. – సురేశ్, ఏఈ

? సచివాలయ నగర్ పరిధిలో రహదారుల వెంబడి చెత్తాచెదారం, వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన, అపరిశుభ్రతతో అవస్థలు పడుతున్నాం. – రాంబాబు, సచివాలయనగర్
✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేస్తాం. – అజీమ్, పారిశుద్ధ్య విభాగం అధికారి

పద్మశాలీల దసరా మేళా నేడు

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: ఆటోనగర్ హరిణి వనస్థలి అనన్య ఎకో పార్క్ ఆవరణలో ఆదివారం పద్మశాలీ సంఘం దసరా మేళా నిర్వహించనున్నట్లు ఎల్బీనగర్ సర్కిల్ పద్మశాలీ సంఘం ప్రతినిధులు పున్న గణేశ్ నేత, రవితేజ నేత తెలిపారు. స్థానికంగా శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉదయం గం.10.30 నుంచి సాయంత్రం గం.6 గంటల వరకు మేళా కొనసాగుతుందన్నారు. మేళాకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలపారు. ప్రతినిధులు గడ్డం లక్ష్మీనారాయణ, సీతాంజనేయులు, బురుగు తులసీదాస్, మేముల రాము నేత, రాపోలు సుధాకర్ పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వనస్థలిపురం, న్యూస్‌టుడే: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి సూచించారు. విజయపురి కాలనీ ఫేజ్-1లో సాయిబాబా ఆలయం వద్ద కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులతో పాటు బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో చేపట్టిన ఓపెన్ జిమ్ పనులను శనివారం పరిశీలించారు. ఏఈ నరేందర్ తేజ, బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1 అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి వాటర్ ఫిల్టర్ అందజేత

నాగోలు, న్యూస్‌టుడే: కొత్తపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం కొమ్రరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు విశ్రాంత అధికారి కె.రామారావు శనివారం ఓ వాటర్ ఫిల్టర్ బహూకరించారు. సుమారు 150 మంది విద్యార్థులకు శుద్ధజలం అందించేందుకు దోహదపడుతుందని కొమ్రరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు కొమ్రరాజు జ్ఞానకుమార్ పేర్కొన్నారు.

నిఘానేత్రాలకు నిధులు కేటాయించండి

వనస్థలిపురం, న్యూస్‌టుడే: కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్యసాగర్ కాలనీ సంక్షేమ సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. వినతి చేసిన వారిలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓవీఆర్ కుమార్, విక్రం, ఉదయకృష్ణ, శశిధర్ ఉన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహనకు నిశబ్ద నడక



నడకను ప్రారంభిస్తున్న బృందాకర్‌రావు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ఏ21 'గ్లోబల్ వాక్ ఫర్ ఫ్రీడమ్' నిశబ్ద నడక పేరుతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. హైదరాబాద్‌లో ఈ నడకను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాకర్‌రావు ప్రారంభించారు. యూసఫ్‌గూడ సెయింట్ మేరీస్ కాలేజ్, వైఎంసీఏ సికింద్రాబాద్‌తో కలిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో 300 మంది పాల్గొనగా.. దేశవ్యాప్తంగా 100 పైగా స్థానాల్లో 30 వేలకు పైగా ఈ నడకలో పాల్గొన్నారని తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. మానవ అక్రమరవాణా వంటి క్రూరమైన నేరాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏసీపీ ఆంజనేయులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్, వైఎంసీఏ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ లియోనార్డ్ మైరన్ పాల్గొన్నారు.

సృజనకు పదును




'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎస్ఎస్ బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 9వ తరగతి విద్యార్థి ఆర్.అర్చన ప్రథమ, 8వ తరగతి విద్యార్థి సీహెచ్ అనన్యమోక్ష ద్వితీయ, పదో తరగతి విద్యార్థి వై.వర్ష తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు డైరెక్టర్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ రాధ, ఇన్‌ఛార్జి మంజుల తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ తరహా పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని పాఠశాల డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. - న్యూస్‌టుడే, దిల్‌సుఖ్‌నగర్

తాగునీటి వాల్వ్ లీకేజీకి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: హస్తినాపురం డివిజన్ భూపేశ్‌గుప్తానగర్ చౌరస్తాలో తాగునీటి వాల్వ్ లీకేజీకి అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. లీకేజీ కారణంగా తాగునీరు రోడ్డుపై నిలుస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను వివరిస్తూ 'లీకేజీతో వృథా.. పట్టని వ్యథ' శీర్షికన ఈ నెల 19న 'ఈనాడు'లో చిత్ర కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన జలమండలి మేనేజర్ సురేశ్ శనివారం సిబ్బందితో మరమ్మతులు చేయించారు. రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తవుతాయని జలమండలి ఇన్‌స్పెక్టర్లు నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

నేడు ఉచిత కంటి పరీక్షలు

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: దిల్‌సుఖ్‌నగర్ పరిధిలోని సాయి సంస్థాన్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు సాయిసంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీజీవో జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజేందర్



సైదాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అలువాల రాజేందర్ ఎన్నికయ్యారు. నాంపల్లిలోని టీజీవో భవన్‌లో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నిక జరిగింది. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని తెలంగాణ రాష్ట్రాధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందుకున్నారు. ప్రస్తుతం రాజేందర్ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖలో సహాయ సంచాలకుడిగా పని చేస్తున్నారు.

నడకకు వెళ్లొస్తానని అదృశ్యం

సైదాబాద్: నడకకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సెక్టార్ ఎస్సై సీహెచ్ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారాంబాగ్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన వివాహిత (31) ఈ నెల 10న సాయంత్రం వాకింగ్‌కు వెళ్లి.. తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు కుటుంబ సభ్యులు పలుప్రాంతాల్లో వెతికారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తరలించే యోచన


ఆలయాలపై దాడులను నిరసిస్తూ శనివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ నుంచి గడ్డిఅన్నారం చౌరస్తా వరకు ప్రదర్శన కొనసాగింది.

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

చేవెళ్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా రాజేంద్రనగర్‌కు మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. చేవెళ్లలో శనివారం నిర్వహించిన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. బీజాపూర్ రహదారి విస్తరణ పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మన్నెగూడ నుంచి వికారాబాద్, తాండూరు మీదుగా జహీరాబాద్ వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.4,200 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు.


మాట్లాడుతున్న సభాపతి ప్రసాద్‌కుమార్

భవనాలకు తాళాలు వేయడంతో ప్రభుత్వం స్పందించింది

గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గురుకుల హాస్టల్ భవనాలకు యజమానులు తాళాలు వేయడంతోనే ప్రభుత్వం స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం పేర్కొంది. కొన్ని నెలల అద్దె చెల్లించడంతో పాటు మిగతా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తొలగించామని సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్ రెడ్డి, గౌరవ సలహాదారు డా.కొండా దేవయ్య పటేల్ శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహంతో తాళాలు తీయకపోతే కేసులు పెట్టాలన్నారని, కొన్నిచోట్ల కేసులు నమోదు చేయడంపై శనివారం మంత్రిని కలిసి ఎత్తేయాలని కోరగా, సానుకూలత వ్యక్తం చేశారన్నారు. కొంతమేర అద్దెలు చెల్లించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, మిగతా సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. సంఘం కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి శంభారెడ్డి, సంఘం నాయకులు పల్లాల శ్రీహరి, పల్లా జోగిరెడ్డి, శరత్ కుమార్, లక్ష్మీనరసింహారావు, గోపాల్‌రెడ్డి, ఏవీఎంరెడ్డి, వీర ప్రకాశ్, సత్యం గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి, చిత్రంలో పల్లా జోగిరెడ్డి, శంభారెడ్డి, శరత్‌కుమార్, కొండా దేవయ్య, కుమారస్వామి, లక్ష్మీనరసింహారావు తదితరులు

అద్దె భవనం.. అవస్థలమయం

అంగన్‌వాడీ కేంద్రంలో అసౌకర్యాలు

బండ్లగూడ, న్యూస్‌టుడే: నాగోల్ డివిజన్ బండ్లగూడలో అంగన్‌వాడీ కేంద్రం అద్దె ప్రాతిపాదికన రేకుల గదిలో ఏళ్ల తరబడి నిర్వహిస్తున్నారు. బాలబాలికలకు పాఠాలు, ఆహారం పంపిణీ, గర్భిణులు, బాలింతలకు ఆహారం అందజేత వంటి పనులన్నీ ఒకే గదిలో నిర్వహించాల్సి వస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రంలోని ఇబ్బందులను చూసిన తల్లిదండ్రులు.. తమ పిల్లలను పంపేందుకు ఇష్టపడటం లేదు. అదే కేంద్రంలో చిన్నారులు, బాలింతలకు టీకాలు ఇవ్వాలి. అయితే స్థలం లేక ఆరుబయట టీకాలు వేస్తున్నారు.


ఆరుబయట టీకాలు వేస్తున్న సిబ్బంది


బండ్లగూడలో..

2007లో మంజూరు..

బండ్లగూడకు 2007లో అంగన్‌వాడీ కేంద్రం మంజూరైంది. అప్పటి నుంచి 2019 వరకు బండ్లగూడ గ్రామంలో ఒక అద్దె ఇంట్లో నిర్వహించారు. అనంతరం బండ్లగూడ పీర్ల కొట్టం పక్కన ఉన్న రేకుల గదిలోకి మార్చారు. స్థానికంగా పేదలు అధికంగా నివసించే బస్తీలు అనేకం ఉన్నాయి. వలస కూలీలు, నిర్మాణ రంగ కార్మికుల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. అయితే స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అసౌకర్యాలతో చాలామంది పిల్లలను పంపడం లేదు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కూలీలు వేల సంఖ్యలో స్థానికంగా ఉంటున్నారు. వారి పిల్లలు మాత్రం. . నిర్మాణంలోని భవనాల వద్దే ఆడుకుంటున్నారు. పోషకాహారం, సరైన సమయాల్లో టీకాలు అందక చిన్నారుల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏనాడు.. అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం నిర్మించాలని ఆలోచించలేదు. ప్రస్తుతం కేంద్రంలో 17 చిన్నారులే ఉన్నారు. ఒకే గదిలో పిల్లలంతా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పక్కా భవనం నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పరిశీలించి తగిన చర్యలు..
చింతల అరుణాయాదవ్, కార్పొరేటర్, నాగోల్

రేకుల గదిలో.. అదీ అద్దె ప్రాతిపదికన బండ్లగూడ అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. తక్షణమే ఆ కేంద్రాన్ని పరిశీలించి.. వీలైనంత త్వరగా సమస్య పరిష్కార చర్యలు చేపడతా. ఉన్నతాధికారులతో మాట్లాడి.. స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించేలా చూస్తా. అప్పటివరకు ప్రత్యామ్నాయంగా విశాలంగా, అన్ని వసతులు ఉన్నా భవనంలోకి కేంద్రాన్ని తరలిస్తాం.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

ప్రాణం ఎంతో విలువైనది



పరికరాలు పరిశీలిస్తున్న మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్

మెహిదీపట్నం: మనిషి ప్రాణం ఎంతో విలువైనదని ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సాఫీగా ప్రయాణించాలన్నారు. మెహిదీపట్నం ఆర్మీ బైసన్ డివిజన్‌లోని వీర్ కున్వర్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో శనివారం సాయంత్రం రోడ్డు భద్రతా సదస్సు జరిగింది. సదస్సును మేజర్ జనరల్ ప్రారంభించి మాట్లాడారు. జనవరి నుంచి ఇప్పటివరకు ముగ్గురు సైనికులు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి మరణం కుటుంబంతో పాటు దేశానికి కూడా నష్టం కల్గిస్తుందన్నారు. బ్రిగేడియర్ సంజయ్ కులకర్ణి ఇతర సైనికాధికారులు పాల్గొన్నారు. ఏసీపీ శంకర్‌రాజు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో సునీల్ బన్సల్, ఎన్.రాంచందర్‌రావు

గన్‌ఫౌండ్రి: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 18 లక్షల మంది స్వీకరించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సభ్యత్వ నమోదు దోహద పడుతుందని, దాన్ని దృష్టిలో పెట్టుకుని కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు భాగస్వాములై విస్తృతంగా పర్యటించాలన్నారు. క్రియాశీల సభ్యత్వంపై దృష్టి సారించాలని కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 24 వరకు నమోదు కొనసాగనుందన్నారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్, ప్రధాన కార్యదర్శులు ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శ్రుతి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

మెహిదీపట్నం: రైతుబజార్‌లో (శనివారం నాటివి, కిలో రూ.లో) టమాటా 41, వంకాయ 35, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 45, క్యాబేజీ 26, బీన్స్ 115, క్యారెట్ 40, దొండ 25, చిక్కుడుకాయ 65, గోకరకాయ 35, బీట్‌రూట్ 31, క్యాప్సికం 75, ఆలుగడ్డ 37, కీర 25, దోసకాయ 35, సొరకాయ 17, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 45, చామగడ్డ 45.

అఫ్జల్‌గంజ్‌లో ట్రా'ఫికర్'

బేగంబజార్, న్యూస్‌టుడే: అఫ్జల్‌గంజ్ పరిసర ప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ఆర్టీసీ బస్సులను అఫ్జల్‌గంజ్ నుంచి ముస్లింజంగ్ వంతెన, సిటీ కళాశాల తదితర ప్రాంతాల మీదుగా చార్మినార్, చాంద్రాయణగుట్టలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే మహబూబ్‌నగర్, కర్నూలు, కడప తదితర బస్సులను మళ్లించారు. అఫ్జల్‌గంజ్, నయాపూల్, సిటీ కళాశాల, పేట్లబుర్జు, పురానాపూల్ తదితర ప్రాంతాల్లో వాహనాల రద్దీ నెలకొంది. ముఖ్యమంత్రి, గవర్నర్ కార్యక్రమాలు ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

జియాగూడ బైపాస్ రోడ్డులో నరకయాతన



జియాగూడ మేకలమండీ వద్ద తవ్వకాలు



ఒకే దారిలో వాహనాల రాకపోకలు

జియాగూడ, న్యూస్‌టుడే: జియాగూడ బైపాస్ రోడ్డులో భారీ పైపులైను నిర్మాణ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముగ్గురు కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఈ పైపులైను పనులు ఎప్పటికి పూర్తవుతాయన్నది అంతుబట్టడం లేదు.

రెండేళ్ల క్రితం.. రూ.200 కోట్లతో.. మురుగు జనావాసాల నుంచి నేరుగా మూసీ నదిలో కలవకుండా జలమండలి ప్రాజెక్టు వింగ్ ఆధ్వర్యంలో నగరంలో చేపట్టిన సుమారు రూ.200 కోట్ల భారీ ప్రాజెక్టులో భాగంగా కార్వాన్ రింగ్ రోడ్డు, మొఘల్‌కానాలా నుంచి జియాగూడ వంద అడుగుల బైపాస్ రోడ్డు మీదుగా పురానాపూల్ చౌరస్తా వరకు ఈ పైపులైను పనులను రెండేళ్ల కిందట ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు కొనసాగుతున్నాయి. కొత్త పైపులైను నిర్మిస్తూనే దానికి పరిసరాల్లోని వీధులు, కాలనీలు, సబ్ రోడ్ల నుంచి ఉన్న సీవరేజీ పైపులైన్లను ఈ ప్రాజెక్టుకు అనుసంధానం చేయాల్సి ఉంది. తద్వారా మూసీనది పరిసరాల్లోని జనావాసాల నుంచి వెలువడే మురుగు నేరుగా నదిలో కలవకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానం చేయాల్సి ఉంది.

నెలల తరబడి వన్‌వే..

పైపులైన్ నిర్మాణం కారణంగా బైపాస్ రోడ్డులో నెలల తరబడి వన్‌వే ఏర్పాటు చేశారు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మార్చిలో జియాగూడ దుర్గానగర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో నిర్మాణంలో ఉన్న పైపులైనుకు అనుసంధానంగా నిర్మించిన మ్యాన్‌హోళ్లలోకి మురుగు చేరకుండా పనులు చేస్తున్న సందర్భంలో విషవాయువులు, గ్యాస్‌తో ఊపిరాడక అందులో పని చేస్తున్న కార్మికులు హన్మంతు(40), శ్రీనివాస్ (40), వెంకట్‌రాములు(50) దుర్మరణం చెందారు. నిర్మాణ సంస్థ, గుత్తేదారు కార్మికులకు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టక పోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మరికొన్ని నెలల పాటు ఈ పైపులైను పనులు కొనసాగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, గోషామహల్, గోల్కొండ, కంచన్‌బాగ్



? చారిత్రక కుతుబ్‌షాహీ టూంబ్స్ నుంచి గోల్కొండ కోటకు వెళ్లే దారిలో కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు. బంజారీదర్వాజా బస్తీలోనూ అదే సమస్య ఉంది. – బాబురావు, బంజారీదర్వాజా

✓ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – ముషారఫ్, ఏఈ

? నాంపల్లి ఎగ్జిబిషన్ అజంతా గేటు నుంచి మాలకొండ ప్రధాన రహదారి వరకు ఇరువైపులా చెత్త పేరుకు పోయింది. – మహేష్‌కుమార్, మాలకుంట

✓ మాలకుంట రోడ్డులో చెత్తను రోజూ తొలగించాలని సిబ్బందికి ఆదేశించాం. – డాక్టర్ వెంకటరమణ, ఏఎంహెచ్‌వో

? కంచన్‌బాగ్ ఒవైసీ ఆసుపత్రి ఎదుట వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులకు భద్రత కల్పించాలి. – ముకేష్ గౌడ్, కంచన్‌బాగ్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – నరసింహనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, సంతోష్‌నగర్

బస్తీలో సమస్యలు పరిష్కరిస్తాం

ఐఎస్ సదన్: కాలనీలతో పాటు బస్తీలను అభివృద్ధి పరుస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేత అన్నారు. శనివారం లక్ష్మీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను బస్తీవాసులతో కలిసి ప్రారంభించారు.

కోదండరెడ్డికి సన్మానం



అబిడ్స్, న్యూస్‌టుడే: తెలంగాణ రైతు కమిషన్ ఛైర్మన్‌గా ఇటీవల నియమితులైన ఎం.కోదండరెడ్డిని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో శనివారం టీపీసీసీ కార్యదర్శి మామిడి కృష్ణకుమార్, నేతలు సీహెచ్ బాలరాజు, పృథ్వీరాజ్, వై.శ్రీనివాస్, బాలపోచయ్య, కోట్ల శ్రీనివాస్ తదితరులు సన్మానించి.. శుభాకాంక్షలు తెలిపారు.

భిన్నత్వమే సృష్టి రహస్యం : గవర్నర్



జిష్ణుదేవ్‌వర్మకు చిత్రం గురించి వివరిస్తున్న షాలినీగుప్తా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : భారతీయులు ఆదర్శమైన వసుధైక కుటుంబాన్ని సాధించడంలో ఐక్యత ఎంతో ముఖ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో న్యూరోడైవర్స్ (బుద్ధిమాంద్యం) కళాకారుల కళాకృతుల ప్రదర్శనను శనివారం గవర్నర్ ప్రారంభించారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియం సహకారంతో "భిన్న స్వరాలు అవధుల్లేని కళ" పేరుతో జరుగుతున్న ఈ ప్రత్యేక ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బుద్ధిమాంద్యం ఉన్న కళాకారులకు చెందిన సుమారు 100 చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. గవర్నర్ మాట్లాడుతూ.. భిన్నత్వం సృష్టి రహస్యమనీ, ఏకరూపత ఏ రంగంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. మేధోపరంగా సవాళ్లు ఎదుర్కొనే కళాకారుల ప్రతిభ తనను కదిలించిందని, కళ అనుభూతికి చెందిన విషయమని ఇది వివరించేది కాదన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 27 వరకు జరుగుతుందని, పెయింటింగ్‌లు, డ్రాయింగ్‌లు, ఛాయా చిత్రాలు డిజిటల్ ఆర్ట్‌లు ప్రదర్శనకు ఉంచినట్లు కార్యనిర్వాహకులు అతియా అమ్జాద్ పేర్కొన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ ఆశిష్‌గోయల్, ది ఆర్ట్ శాంక్చురీ ఫౌండర్ ట్రస్టీ షాలినీ గుప్తా, ప్రముఖ గాయని దుర్గా జస్రాజ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత మహమ్మద్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు

సీపీఆర్‌పై శిక్షణ



గోషామహల్: బారాదరిలోని మాసోనిక్ భవనంలో ఫ్రీమేసన్స్ ప్రాథమిక యూనిట్ ఆధ్వర్యంలో శనివారం సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సహకారంతో 40 మంది డ్రైవర్లు, వాచ్‌మెన్లు, వీధి వ్యాపారులు, సాధారణ ప్రజలకు శిక్షణ ఇచ్చారు. ఫ్రీమేసన్స్ సభ్యుడు జానకీరామ్‌శర్మ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ రంగారెడ్డి బుర్రి, అసిస్టెంట్ రీజనల్ గ్రాండ్ మాస్టర్ పి.వీరభద్రుడు పాల్గొన్నారు. వచ్చే 12 నెలల్లో నగరంలో వెయ్యి మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని లాడ్జ్‌కీస్ లక్ష్యంగా పెట్టుకుందని వారు వెల్లడించారు. శిక్షణ పొందాలనుకునేవారు చరవాణి 98480 42020లో సంప్రదించాలన్నారు.

పరిశ్రమలో పెట్టుబడులంటూ.. రూ.కోట్లు కాజేసిన దంపతుల రిమాండ్



దినేష్, జ్యోతి దంపతులు

నారాయణగూడ: పరిశ్రమలో పెట్టుబడులు పెడితే భాగస్వామ్యం ఇస్తామని నమ్మించి రూ.కోట్లు కాజేసిన దంపతులను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. వారిపై బోయినపల్లి, తిరుమలగిరి, మహంకాళి ఠాణాల్లో కూడా చీటింగ్ కేసులున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిక్కడపల్లికి చెందిన హెచ్.దినేష్(50), జ్యోతి(47) దంపతులకు సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కిరాణా దుకాణం ఉంది. కీసరలో అభినవ్ ఇండస్ట్రీ పేరుతో పేపర్ తయారీ పరిశ్రమ సైతం నిర్వహిస్తున్నారు. పరిశ్రమలో పెట్టుబడులు పెడితే మంచి కమీషన్‌తో పాటు భాగస్వామ్యం కూడా ఇస్తామని నమ్మించి రూ.కోట్లు దండుకున్నారు. సికింద్రాబాద్ తిరుమలగిరికి చెందిన వ్యాపారి పి.లక్ష్మణ్(55) వారి మాటలను నమ్మి తన బంధువులు, స్నేహితుల నుంచి సేకరించి మొత్తం రూ.1.10 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత పార్ట్‌నర్‌షిప్, లాభాలు ఇవ్వకుండా తప్పించుకోవడం మొదలుపెట్టారు. ఆరు నెలలు గడిచిన వారి నుంచి స్పందన రాకపోవడంతో తన పెట్టుబడిని వెనక్కి ఇవ్వాలని దంపతులను నిలదీశాడు. నెల రోజు క్రితం రూ.1.10 కోట్లకు చెక్ ఇచ్చారు. కానీ చెల్లలేదు. గత్యంతరంలేని పరిస్థితిలో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని రిమాండ్‌కు తరలించారు.

టపాసుల వ్యాపారులు నిబంధనలు పాటించాలి

చాంద్రాయణగుట్ట: బాణసంచా వ్యాపారులు నిబంధనలు విధిగా పాటించాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. వ్యాపారులు, స్టాళ్ల నిర్వాహకులతో శుక్రవారం రాత్రి ఉప్పుగూడలో సమావేశం ఏర్పాటు చేశారు. లైసెన్స్ లేకుండా టపాసుల స్టాళ్లు నిర్వహించినా. . బాణసంచా విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు డీసీపీ జహంగీర్, ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

గిరిజన సమ్మేళనం కరపత్రం విడుదల



చాంద్రాయణగుట్ట: ఖమ్మం పట్టణంలో వచ్చే నెల 5న జరిగే గిరిజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్ పేర్కొన్నారు. కరపత్రాలను శనివారం జంగమ్మెట్‌లో ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు రాంకుమార్ నాయక్ ఉన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



అధికారులతో సమీక్షిస్తున్న జడ్సీ టి.వెంకన్న

కేశవగిరి: పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చార్మినార్ జడ్సీ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. చాంద్రాయణగుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని కార్యాలయంలో శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన అన్ని అంశాలు, సమస్యలపై సంబంధిత ఏసీపీలు పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇంటి నిర్మాణాల అనుమతుల కోసం టీజీబీపాస్‌లో అందే దరఖాస్తులను పరిశీలించి అనుమతులు ఇవ్వాలన్నారు. గుర్తించిన ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేయడానికి సంబంధిత సర్కిల్ అధికారులు నోటీసులు జారీ చేస్తూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్టీఎఫ్ బృందాల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శైలజ, సురేందర్, అరుణకుమారి, రవికుమార్, జోనల్ టౌన్‌ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మజీద్, ఏసీపీలు పాల్గొన్నారు.

'మతతత్వ దేశంగా మార్చేందుకు భాజపా కుట్ర'



మాట్లాడుతున్న మాజీ ఎంపీ తంపన్ థామస్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: దేశాన్ని మతతత్వ, నిరంకుశ, ప్రజాస్వామిక, పెట్టుబడిదారి దేశంగా మార్చేందుకు కేంద్రంలోని భాజపా సర్కారు ప్రయత్నిస్తోందని సోషలిస్టు పార్టీ(ఇండియా) జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ తంపన్ థామస్ ఆరోపించారు. గన్‌ఫౌండ్రిలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని విమర్శించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నూరుల్ అమీన్, రాష్ట్ర అధ్యక్షురాలు రచ్చ సుభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర సదస్సును ఆదివారం గన్‌ఫౌండ్రిలోని మీడియా ప్లస్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు సుభద్రారెడ్డి తెలిపారు.

టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణయాదవ్

ఖైరతాబాద్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎంబీ కృష్ణయాదవ్, ఎన్నికయ్యారు. శనివారం టీజీవోస్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ సమక్షంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. సంఘం సహ అధ్యక్షుడిగా ఆశన్న, కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షులుగా డా.ఎన్.నరేందర్, రాజేందర్, ఎంజులారెడ్డి, సహ కార్యదర్శిగా పూనం, ప్రచార కార్యదర్శిగా మంచాల రవీందర్ ఎన్నికయ్యారు.

ఆలయాలపై దాడులు అరికట్టండి



కోఠి ఆంధ్రబ్యాంకు చౌరస్తా వద్ద ప్రదర్శన

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: ఆలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దేవతామూర్తుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఇటీవల కాలంలో వరుసగా గుడులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. కోఠిలోని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయం నుంచి కార్యకర్తలు కాషాయం, నలుపు జెండాలతో ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతినిధులు అజయ్, ముకేష్, అభిషేక్, అంకిత్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

చాంద్రాయణగుట్ట: హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు లాల్‌దర్వాజా మహంకాళీ దేవాలయం, లాల్‌దర్వాజా మోడ్ ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. దేవాలయాలకు రక్షణ కల్పించాలని, వాటిపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత ప్రచారక్ ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి మాట్లాడుతూ.. గత జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 42 దేవాలయాలపై దాడులు జరిగాయని, అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వీహెచ్‌పీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి విశాల్ సునార్కర్ ఉపాధ్యక్షుడు భానూమూర్తి, బజరంగ్‌దళ్ పాతబస్తీ సంయోజక్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లాల్‌దర్వాజా మహంకాళి ఆలయం వద్ద..

సామాజిక భవనంలో బాణసంచా నిల్వ

అబిడ్స్, న్యూస్‌డే: ఇళ్ల మధ్య ఉన్న సామాజిక భవనంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.4 లక్షల విలువైన బాణసంచాను మధ్య మండలం టాస్కుఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై నాగేష్ బృందం గన్‌ఫౌండ్రిలోని సామాజిక భవనంపై దాడి చేశారు. దీపావళి సందర్భంగా 26 రకాల టపాసులు నిల్వ ఉంచారు. అబిడ్స్‌కు చెందిన శివకుమార్, బొగ్గులకుంటకు చెందిన మోహిత్‌కుమార్‌లను అరెస్టు చేశారు.

తిరిగి విధుల్లోకి తీసుకోండి

సుల్తాన్‌బజార్: 104 ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ ఐక్య వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. సంఘం గౌరవ అధ్యక్షుడు భూపాల్, రాష్ట్ర కార్యదర్శి విజయవర్ధన్ రాజుల నేతృత్వంలో ప్రతినిధులు శనివారం కోఠిలో సీఎఫ్‌డబ్ల్యూ ఆర్.వి.కర్ణన్‌ను కలిసి విన్నవించింది. సంఘం నాయకులు సుభాష్ చందర్, శేఖర్, నాగన్న ఉన్నారు.

2.89 కిలోల గంజాయి పట్టివేత

ధూల్‌పేట, న్యూస్‌టుడే: ధూల్‌పేట్‌లో 2.89 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ నంద్యాల అంజిరెడ్డి తెలిపారు. బలరాంగల్లీలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారం అందగానే ఎస్‌టీఎఫ్ బృందం దాడులు నిర్వహించి.. 1.450 కిలోల గంజాయి పట్టుకుంది. కేసులో ప్రీతంసింగ్, రచనా బాయి, సంజనా బాయిలను అరెస్టు చేయగా విజయ బాయి పరారీలో ఉంది. ధూల్‌పేట్‌లో ఇంట్లో అమ్ముతుండగా 1.449 కిలోల గంజాయి లభించింది. విక్రేతలు కమలాబాయి, దివ్యాసింగ్‌ను అరెస్టు చేయగా దుర్గాదేవి, నేహబాయి, సంగీత సాహులు పరారీలో ఉన్నారు. దాడుల్లో సీఐలు మధుబాబు, భాస్కర్‌గౌడ్, ఎస్సైలు మధు, విష్ణుగౌడ్, ఉమామహేశ్వర్, హెడ్‌కానిస్టేబుళ్లు భాస్కర్‌రెడ్డి, సుధీర్, అజీమ్, కానిస్టేబుళ్లు రాకేష్, మహేష్, ప్రభు, రాహుల్, ఖాదర్‌లు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న సహాయక(సపోర్టింగ్) సిబ్బందికి రావాల్సిన 5 నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ బస్తీ దవాఖానా ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన బస్తీ దవాఖానాల్లో పని చేస్తున్న సిబ్బంది.. కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలోని జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) సంచాలకుల కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంగళపాటి సుమన్, అమ్జద్ అలీఖాన్, తెజస కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా బస్తీ దవాఖానాల్లో ఒప్పంద, పొరుగు సేవల్లో 500 మంది సపోర్టింగ్ సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. అనంతరం జేడీ శ్రీనివాస్‌ను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.



నినాదాలు చేస్తున్న బస్తీ దవాఖానా సిబ్బంది

పోలీస్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలం కబ్జా!

చార్మినార్ ఠాణాలో సుమోటోగా కేసు నమోదు



ఆక్రమించిన స్థలమిదే

చార్మినార్: చార్మినార్ సమీపంలో ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని రెండు దశాబ్దాల క్రితం ఠాణా నిర్మాణానికి కేటాయించారు. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించటం చర్చనీయాంశంగా మారింది. చార్మినార్ కట్టడం చూసేందుకు వేలాది మంది సందర్శకులు వస్తుంటారు. అంతటి పర్యాటక ప్రాంతంలో చార్మినార్ పెడెస్ట్రియన్ ప్లాన్(సీపీపీ)లో భాగంగా అక్కడి పోలీస్‌స్టేషన్ తొలగించాలనే ప్రతిపాదన వచ్చింది. 2002లో పర్యాటకశాఖకు చెందిన సుమారు 880 చదరపు గజాల స్థలాన్ని ఠాణా నిర్మాణానికి అప్పగించింది. దీనిపై కన్నేసిన స్థానిక గాజుల వ్యాపారి 2004లో ఆక్రమించుకునేందుకు ప్రయత్నించటంతో పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై వ్యాపారి అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించటంతో రెవెన్యూ రికార్డుల ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సింది కోర్టు ఆదేశించింది. దాంతో అధికారులు ఆ స్థలాన్ని పోలీసుశాఖకు అప్పగించారు. అనంతరం పాదచారుల మార్గం ప్రాజెక్ట్ కాగితాలకే పరిమితం కావటంతో ఠాణా నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. ఇదే అదనుగా కబ్జాదారుడు అనువుగా వినియోగించుకున్నాడు. చార్మినార్ చుట్టుపక్కల ఎత్తయిన భవనాలు నిర్మిస్తున్నారనే ఫిర్యాదుతో ఈ నెల 15న పురావస్తుశాఖ అధికారులు ఆ ప్రాంతాలను పరిశీలించారు. ఆ సమయంలో ఠాణాకు కేటాయించిన స్థలంలో నిర్మాణాలు చేపట్టిన విషయం వెలుగు చూసింది. పోలీసుల దృష్టికి తీసుకెళ్లటంతో గాజుల వ్యాపారి మక్బుల్ అహ్మద్ మరో నలుగురిపై చార్మినార్ ఠాణాలో సుమోటోగా కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

రోజూ ఆదాయం పొందొచ్చని.. రూ.1.33 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: రోజూ ఆదాయాన్ని పొందొచ్చని నమ్మించి నగదు దండుకున్నారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి వాట్సాప్ సందేశం వచ్చింది. ఆకర్షితుడైన బాధితుడు అందులో నంబరులో సంప్రదించారు. నేరస్థుడు ఓ యాప్ లింక్‌ను పంపించి డౌన్‌లోడ్ చేయించాడు. అతని సూచనలను పాటిస్తూ పోయాడు. మొదట లాభాలు ఆర్జించాడు. ఇంకా డబ్బు పెట్టాలంటూ ఒత్తిడి రావడంతో విడతల వారీగా తన వద్ద ఉన్న రూ.1.33 లక్షలు ఆన్‌లైన్‌లో పంపించేశాడు. ఆ తర్వాత యాప్‌లోని వాలెట్ నుంచి డబ్బులు విత్‌డ్రా చేయాలంటే అదనంగా రుసుము చెల్లించాల్సి ఉంటుందని నేరస్థుడు చెప్పడంతో బాధితుడు కంగుతిన్నాడు. ఇంతలో బాధితుడికి సంబంధించిన యాప్ ఖాతాను, వారి వాట్సాప్‌లో బ్లాక్ చేసేశారు. మోసపోయినట్లు గ్రహించి.. పోలీసులను ఆశ్రయించారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు


కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

రాజేంద్రనగర్: గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆబ్కారీ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నేతృత్వంలో ఎంపిక చేసిన గీత కార్మికులకు శనివారం కాటమయ్య రక్షణ కవచం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన గీతకార్మికులకు ప్రభుత్వం తగిన శిక్షణ ఇచ్చి ఈ కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. వాటిని ఉపయోగించుకొని గౌడన్నలు రక్షణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ సంఘం నాయకులు ప్రేమ్‌దాస్‌గౌడ్, హరిచరణ్‌గౌడ్, దాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీసీ జానయ్యకు ఉద్యోగుల సత్కారం


ఉపకులపతికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా శనివారం బాధ్యతలు చేపట్టిన ప్రొ.అల్దాస్ జానయ్యను వర్సిటీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఉద్యోగ సంఘం నాయకులు పరిపాలన భవనంలో వీసీ జానయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపకులపతి మాట్లాడుతూ.. అంతా కలిసి కట్టుగా పనిచేసి విశ్వవిద్యాలయాన్ని దేశంలో అగ్రగామిగా నిలపాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం మనపై ఉందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి, ఉద్యోగ సంఘం నాయకులు శ్రీనివాస్‌యాదవ్, జయరాం, దశరథ్, బిక్షపతి, జహంగీర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి

శంషాబాద్: అభివృద్ధి పనులకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న బిల్లులను చెల్లించాలని గుత్తేదారులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం వారు ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శంషాబాద్ మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల్లో ఏడాదిన్నర క్రితమే పూర్తి చేసిన అభివృద్ధి పనుల బిల్లులు నేటికీ పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పనుల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తుండడంతో ఆర్థికంగా చితికిపోతున్నామన్నారు. సమస్యను డిప్యూటీ సీఎం భట్టి దృష్టికి తీసుకెళ్లి బిల్లులు చెల్లించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే గుత్తేదారులకు హామీ ఇచ్చారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



చేవెళ్ల: మండలంలోని పామెన గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న వీరభద్రస్వామి ఆలయానికి శ్రీవెంకటసాయి డెవలపర్స్ యాజమాన్యం రూ.3,01,116 విరాళం ప్రకటించింది. ఈ మేరకు శనివారం ఆలయ కమిటీ సభ్యులకు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్థులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గోపాల్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగిలిన సీట్లకు తక్షణ ప్రవేశాలు

షాద్‌నగర్ న్యూటౌన్: షాద్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగిలిన సీట్లకు తక్షణ ప్రవేశాల(స్పాట్ అడ్మిషన్ల)ను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మణ్ తెలిపారు. ఎంసీ మెకానిక్ ద్వారా ఈ సీట్ల అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 30న ఉదయం 11 లకు కళాశాలకు చేరుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి

జిల్లేడు చౌదరిగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ షాద్‌నగర్ ఇన్‌ఛార్జి ఆకాశ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కాస్లాబాద్ తండాలోని పాఠశాలకు వంటగది, ప్రహరీ మంజూరు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉపాధ్యాయ వృత్తి చేపట్టి పాఠశాలలో చేరిన స్వప్న, సువర్ణలను సన్మానించారు. కార్యక్రమంలో రమేష్, గణేష్, సుమన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణాలయం

షాద్‌నగర్‌లో విశ్రాంత ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో రూ.10కే భోజనం

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: గ్రామాల నుంచి అవసరాల నిమిత్తం పట్టణాలకు ప్రజలు వస్తుంటారు.. కొందరు రోజువారీ కూలి కోసం ఎదురు చూస్తుంటారు.. అలాంటి వారి కడుపు నింపాలనే సంకల్పంతో షాద్‌నగర్‌లో ఏర్పడిందే అన్నపూర్ణాలయం. గ్రామీణులు, కూలీలు, నిరుపేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సదుద్దేశంతో మొదలైన ఈ ప్రయత్నాన్ని వివరంగా పరిశీలిస్తే..

ఇలా ప్రారంభం.. షాద్‌నగర్ కల్పవృక్ష ఫౌండేషన్ నిర్వాహకుడు, వ్యాపారి నాగిళ్ల కుమారస్వామి బృందం మూడేళ్ల క్రితం పట్టణంలోని గ్రంథాలయం ఎదుట షెడ్డులో అన్నపూర్ణాలయాన్ని ఏర్పాటు చేసి రూ. 10కి భోజనం పంపిణీ ప్రారంభించారు. ఆ తర్వాత గ్రంథాలయానికి నూతన భవన నిర్మాణం చేపట్టడం, షెడ్డును తొలగించడంతో అన్నపూర్ణాలయం నిర్వహణ మానేశారు. విషయం తెలుసుకున్న విశ్రాంత ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం కొనసాగించాలని నిర్ణయించి తమ భుజస్కంధాలపై వేసుకుని కొనసాగిస్తున్నారు.


భోజనం అందజేస్తున్న నిర్వాహకులు


భోజనాన్ని కవర్‌లో కడుతున్న నిర్వాహకులు

రెండేళ్ల క్రితం.. కూలీలు, నిరుపేదల జీవితాల కష్టాలను ప్రత్యక్షంగా చూసిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నందిగామ సురేష్‌కుమార్, ఆశంబాబు, క్రాంతికుమార్, బుచ్చయ్య, తిరుపతయ్య, శ్రీశైలంగౌడ్, వ్యాపారి బ్రహ్మయ్య అన్నపూర్ణాలయ నిర్వాహణకు ముందుకు వచ్చారు. రామలింగేశ్వర సహకారసంఘం, కల్పవృక్ష ఫౌండేషన్ల సహకారం అందించడంతోపాటు గదిని ఉచితంగా ఇవ్వడంతో విజయనగర్ కాలనీలో 2022 సెప్టెంబరు 26న ప్రారంభించారు. అలా కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతూ రెండేళ్లు పూర్తి చేసుకుని మూడేళ్లలో అడుగు పెట్టింది.

నిత్యం వంద మందికిపైగా... తొలుత తమ సొంత ఖర్చులతో వారు కార్యక్రమాన్ని ప్రారంభించగా తర్వాతి కాలంలో పలు ప్రాంతాలనుంచి దాతలు తమ పిల్లల జన్మదినాలు, ఇతరసందర్భాలను పురస్కరించుకుని చేయూత ఇస్తున్నారు. అన్నం, పప్పు, పచ్చడి కలిపి ప్యాకెట్ల రూపంలో ఇస్తుండడంతో ప్రతి రోజు 100 నుంచి 140 మందికి పైగా కూలీలు, డ్రైవర్లు, హమాలీలు, గ్రామీణులు దీనిని వినియోగించుకుంటున్నారు. రోజు దాదాపు రూ. 4వేలకు పైగా ఖర్చవుతున్నా దాతల సహకారంతో నామమాత్రపు రుసుంకే భోజనం అందివ్వగలుగుతున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం తమ జీవితంలో వ్యాపకంగా మారడం, ఫలితంగా వస్తున్న మానసిక ఆనందం మాటల్లో వర్ణించలమంటూ అన్నపూర్ణాలయాన్ని ఎప్పటికీ కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు వివరించారు.

నిర్విరామంగా కొనసాగిస్తాం

–అన్నపూర్ణాలయం నిర్వాహకులు

గ్రామీణులు, కూలీలు, చిరువ్యాపారుల ఆకలి బాధలపై అవగాహన ఉన్న కారణంగానే అన్నపూర్ణాలయాన్ని నిర్వహిస్తున్నాం. నామమాత్రపు రుసుంతో భోజనాన్ని ఇస్తున్నాం. మా సంకల్పానికి పలువురు దాతలు సహకారం అందిస్తూ వెన్నంటి నిలుస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా కొనసాగించాలన్నదే తమ లక్ష్యం. ఈ సేవలో కలిగే సంతృప్తి అనిర్వచనీయం.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్: 8008573330
శంకర్‌పల్లి: 8008573266
షాద్‌నగర్: 8008573907
శంషాబాద్: 9963096353

కొందుర్గు, కేశంపేట, షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే:

? పర్వతాపూర్ మీదుగా చెల్కలోనిగూడ వరకు 4 కిలోమీటర్ల మట్టి రోడ్డుపై గుంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. –వెంకటేష్, పర్వతాపూర్

✓ ప్రతిపాదనలు సిద్ధం చేసి పైఅధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. –శ్రీనివాస్, డీఈఈ, షాద్‌నగర్

? సంగెంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచాయి. దీంతో సరిపడా వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. – విద్యార్థుల తల్లిదండ్రులు, సంగెం

✓ చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపేశారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైన వెంటనే తిరిగి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. –చంద్రశేఖర్, ఎంఈఓ, కేశంపేట

? షాద్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు కొన్ని వెలగక పోవడంతో అంధకారం నెలకొంటుంది. –శ్రీనివాస్, షాద్‌నగర్

✓ స్తంభాలపై వెలగని విద్యుత్ బల్బులను త్వరలో మారుస్తాం. –వెంకన్న, పురపాలిక కమిషనర్, షాద్‌నగర్


శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ది సిటిజన్స్ కౌన్సిల్, మైనారిటీ జేఏసీ ప్రతినిధులు

మణికొండ, న్యూస్‌టుడే: నెక్నాంపూర్ గ్రామ పరిధి సర్వే నంబరు-44లో ముస్లిం శ్మశానవాటికకు ఐదెకరాల స్థలం కేటాయించాలని గండిపేట తహసీల్దార్‌ను ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు, మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శనివారం ది సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు అందె లక్ష్మణ్‌రావు, షేక్ ఆరీఫ్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, మైనార్టీ జేఏసీ నాయకులు జాఫర్ అహ్మద్, సయ్యద్ అమెర్‌లు శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించారని తహసీల్దార్‌కు వివరించారు. శ్మశాన వాటిక కోసం సర్వే చేసి స్థలం కేటాయించాలని కలెక్టర్ ఇటీవల ఆదేశాలిచ్చారని, ఆ సర్వే జాప్యం జరుగుతోందని వారు తెలియజేశారు. త్వరగా సర్వే చేయించి స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అక్బర్‌అలీ, బొడ్డు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తరలించే యోచన

శాసనసభాపతి ప్రసాద్‌కుమార్ వెల్లడి


పెంటయ్యగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ప్రసాద్‌కుమార్, కాలె యాదయ్య

చేవెళ్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా రాజేంద్రనగర్‌కు మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. బీజాపూర్ రహదారి విస్తరణ పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మన్నెగూడ నుంచి వికారాబాద్, తాండూరు మీదుగా జహీరాబాద్ వరకు రోడ్డు విస్తరణ పనులకు రూ.4,200 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. చేవెళ్ల నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు రూ.75కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. నగరానికి చేరువలో ఉన్న చేవెళ్ల వ్యవసాయ మార్కెట్‌యార్డు అభివృద్ధిలో భాగంగా కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, ఇతర వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపిస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు నూతన పాలకమండలి సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరారు. మార్కెట్ ఛైర్మన్‌గా గడ్డమీది పెంటయ్యగౌడ్, వైస్ ఛైర్మన్‌గా బేగరి రాములు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మాలతి, బాల్‌రాజ్, జనార్దన్‌రెడ్డి, వసంతం, దర్శన్, పట్నం రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను ఐక్యంగా అడ్డుకోవాలి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ఏ21 'గ్లోబల్ వాక్ ఫర్ ఫ్రీడమ్' నిశ్శబ్ద నడక పేరుతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నడకను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాకర్‌రావు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ సెయింట్ మేరీస్ కాలేజ్, వైఎంసీఏ సికింద్రాబాద్‌తో కలిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో 300 మందికిపైగా పౌరులు పాల్గొనగా.. దేశవ్యాప్తంగా 100 పైగా స్థానాల్లో 30 వేలకు పైగా ఈ నడకలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా వంటి క్రూరమైన నేరాన్ని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ఏకం కావాలన్నారు. పలు కళాశాలల విద్యార్థులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏసీపీ ఆంజనేయులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్, వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ లియోనార్డ్ మైరన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, వృత్తి జీవితాల మధ్య సమతుల్యం అవసరం


స్పీకర్ మీట్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు

నార్సింగి, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో వ్యక్తిగత, వృతి జీవితాన్ని సమతుల్యం చేసుకున్నప్పుడే మానసికంగా ప్రశాంతంగా ఉండగలుగుతారని వక్తలు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య మాసం సందర్భంగా రోటరీక్లబ్ ఆఫ్ మేవరిక్స్, రోటరీ క్లబ్ ఆఫ్ కోకాపేట ఏకం సంస్థలు సంయుక్తంగా శనివారం గచ్చిబౌలిలోని ఎవినియాన్ ఇండియా కార్యాలయంలో స్పీకర్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా.చరణ్‌తేజ, డా.హరిణి మానసిక ఆరోగ్య సమస్యల గురించి ప్రసంగించారు. వివిధ వర్గాల ప్రజలకు దైనందిన జీవితాల్లో ఎదురవుతున్న సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ఈ సందర్భంగా వివరించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని కీలక విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యల గురించి ఇలాంటి కార్యక్రమాలు ఎంతైనా అవసరమని మేవరిక్స్ ప్రెసిడెంట్ వనశ్రీ, ఏకం ప్రెసిడెంట్ రవి అభిప్రాయపడ్డారు. డా.ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు చేస్తే చర్యలు


బోర్డును పునరుద్ధరిస్తున్న రెవెన్యూ సిబ్బంది


శంషాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను క్రయవిక్రయాలు చేస్తే ఉపేక్షించేది లేదని శంషాబాద్ తహసీల్దార్ రవీందర్‌దత్తు హెచ్చరించారు. శంషాబాద్ మున్సిపల్ పరిధి రెవెన్యూ సర్వే నం 626లోని ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడంతో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే ప్రభుత్వ భూమిలో బోర్డును పునరుద్ధరించారు. ప్రభుత్వ భూములను కబ్జాకు యత్నించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

'దుండగులను శిక్షించకుంటే ఉద్యమం ఉద్ధృతం'


షాద్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: హిందువులు, హిందూదేవాలయాలపై దాడులు చేస్తున్న దుండగులను చట్టపరంగా శిక్షించకుంటే ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని బజరంగ్‌దళ్ షాద్‌నగర్ కన్వీనర్ గూడెం రమేష్ హెచ్చరించారు. సికింద్రాబాద్‌లోని దేవాలయంలో విగ్రహ ధ్వంసం ఘటనను నిరసిస్తూ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి ముఖ్యకూడలిలో రాస్తారోకో, ధర్నా చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి, దుండగులకు వ్యతిరేకంగా నినదించారు. గూడెం రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఓ వర్గానికి మద్దతిస్తూ పాలనను నడిపిస్తోందని, పోలీసులు సైతం దీనికి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దళ్ నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో హనుమంత్‌రెడ్డి, వంశీ, గిరి, వినయ్, శివకుమార్‌చారి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చౌడమ్మగుట్ట, ఎలికట్ట ఆలయాల అభివృద్ధికి కృషి


ఆకుల వెంకటేశం ఇచ్చిన చెక్కును పాలకవర్గానికి అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ పురపాలిక పరిధిలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయం, ఎలికట్ట భవానీమాత ఆలయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. చౌడమ్మగుట్ట ఆలయంలో శనివారం ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం గోమాతకు సేవ చేశారు. ఈ సందర్భంగా తన కుమారుడు ఆకుల రాఘవేందర్ జ్ఞాపకార్థం ఆయన తండ్రి ఆకుల వెంకటేశం ఆలయ అభివృద్ధి కోసం ఇచ్చిన రూ. 10 లక్షల చెక్కును ఆలయ కమిటీకి చెందిన శ్రీశైలంకు అందించారు. ఈ ఆలయంతో పాటు, ఎలికట్ట భవానీమాత ఆలయాల అభివృద్ధికి రూ. 5 లక్షల చొప్పున స్వయంగా అందజేయనున్నట్లు ప్రకటించారు.

★ విద్యార్థులు క్రీడల్లో ఉన్నతంగా రాణించాలని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ నెల 20న తుక్కుగూడలో జరుగుతున్న జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు రవాణా సదుపాయం అందజేయడంతో పాటు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులు పోటీల్లో విజయం సాధించి షాద్‌నగర్‌కు పేరుతేవాలని ఆకాంక్షించారు.

★ విధి నిర్వహణలో తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడుతున్న ఏపీఎంపై చర్యలు తీసుకోవాలంటూ మహిళా సంఘాల నాయకులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకుంటానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో వెంకట్రాంరెడ్డి, విశ్వం, బస్వం, చెన్నయ్య, రఘు, భార్గవ్‌కుమార్‌రెడ్డి, కృష్ణవేణి, విశాల, వర్ష పాల్గొన్నారు.

సర్కారు బడుల ప్రగతికి దాతలు సహకరించాలి


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బ్యాగులు, అందించిన శశిప్రకాష్

షాబాద్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని మన్మర్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటమ్మ అన్నారు. శనివారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రవాస భారతీయుడు శశిప్రకాష్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భానుప్రకాష్, అశోక్ మౌర్య, వెంకటేష్, రవి, సురేష్, మల్లేష్, యూసుఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థి


చిత్రలేఖన పోటీలో ప్రతిభ చూపిన సాల్మన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాల్మన్ రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంపికయ్యాడు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయంజాల్ రంగన్నగూడలో శుక్రవారం జిల్లాస్థాయి కళాఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే తొమ్మిది, పదితో పాటు ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో సాల్మన్ వేసిన చిత్రం ద్వితీయ బహుమతి కింద ఎంపికైంది. త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు సాల్మన్‌ను ఎంపిక చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

తీర్థయాత్రకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం

కొత్తూరు, న్యూస్‌టుడే: తీర్థయాత్రకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన కొత్తూరు మండలంలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై జి.శ్రీనివాస్ వివరాలు ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన పట్నం మణిరత్నం(35) ఈ నెల 15న అరుణాచలం తీర్థయాత్రకు బయల్దేరాడు. 16న ఉదయం కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి సాయంత్రం అరుణాచలం చేరుతానని చెప్పాడు. తర్వాత అతడి నుంచి ఫోన్‌కాల్ రాకపోగా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. గాలింపు చర్యలు చేపట్టిన కుటుంబీకులు ప్రయోజనం లేకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదుపు తప్పితే.. అక్కమ్మ చెరువులోకే



నందిగామ మండలం నర్సప్పగూడ అక్కమ్మ చెరువుకు వచ్చే ప్రధాన వాగువద్ద వంతెనపై రెయిలింగ్ నిర్మించకపోవడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు అలుగు పారడంతో వాగు వద్ద నీరు పారుతోంది. వంతెనపై నుంచి ప్రయాణించే వాహనదారులు ఏ మాత్రం అదుపుతప్పినా అందులో పడే ప్రమాదముంది. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి వంతెనపై రెండు వైపులా రెయిలింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

–న్యూస్‌టుడే, నందిగామ

వ్యాసరచన పోటీలతో నైపుణ్యాలకు పదును





వ్యాసరచన పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలకు పదును పెరుగుతుందని త్రివేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపల్ క్రాంతి అన్నారు. శనివారం ఈనాడు ఆధ్వర్యంలో మణికొండలోని త్రివేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాలలోని 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చాటారు. తొమ్మిదో తరగతికి చెందిన కె.హర్షిత్‌యాదవ్, ఎం.నికిత, బి.వీరేంద్రలు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ క్రాంతి, ఇన్‌ఛార్జి కృష్ణారెడ్డిలు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు అందజేశారు.

మణికొండ, న్యూస్‌టుడే

'గురుకుల భవనాలకు తాళాలు వేయడంతోనే ప్రభుత్వం స్పందించింది'

ఖైరతాబాద్: గురుకుల హాస్టల్ భవనాలకు యజమానులు తాళాలు వేయడంతోనే ప్రభుత్వం స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం పేర్కొంది. కొన్ని నెలల అద్దె చెల్లించడంతో పాటు మిగతా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తొలగించామని సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారు డా.కొండా దేవయ్య పటేల్ శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహంతో తాళాలు తీయకపోతే కేసులు పెట్టాలన్నారని, కొన్ని చోట్ల కేసులు నమోదు చేయడంపై శనివారం ఉదయం మంత్రిని కలిసి ఎత్తేయాలని కోరగా సానుకూలత వ్యక్తం చేశారన్నారు. కొంత మేర అద్దెలు చెల్లించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, మిగతా సమస్యలపై వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. అందులో కొందరిపై కేసులు పెట్టి, నిలిపివేసిన అద్దెలు భేషరతుగా చెల్లించాలని, భవనాల అద్దెకు మూడేళ్ల కనీస వ్యవధిలో ఉండాలని, అద్దె ప్రతి రెండేళ్లకోసారి 20శాతం పెంచాలని, అన్ని భవనాలకు ఒకే రకమైన నిబంధనలు ఉండాలని, క్రీడా స్థలానికి అడుగుకు కనీసం రూ. 10చొప్పున చెల్లించాలని, జీఎస్టీతో అద్దె వ్యవస్థ ఉండాలని వినతి పత్రంలో కోరామన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బండి కుమార స్వామి, కోశాధికారి శంభారెడ్డి, వల్లాల శ్రీహరి, పల్లా జోగిరెడ్డి, శరత్ కుమార్, గోపాల్ రెడ్డి, వీరప్రకాష్ పాల్గొన్నారు.

వాగునీటి గుంతలో పడి ఒకరి మృతి

కేశంపేట, న్యూస్‌టుడే: వాగులోని నీటి గుంతలో పడి ఒకరు దుర్మరణం చెందిన ఘటన తొమ్మిదిరేకులలో చోటుచేసుకొంది. సీఐ నరహరి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండకళ్ళ జంగయ్య(46) రోజువారీ కూలీ. బయటికి వెళ్లొస్తానంటూ భార్యకు చెప్పి శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. శనివారం గ్రామ శివారులోని వాగు నీటిగుంతలో శవంగా కనిపించాడు. స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గుంట మునిగి మృతి చెందిఉంటాడని భావిస్తున్నారు.

ఆస్తులున్నా ... ఆదరణ కరవు



మంచాల, న్యూస్‌టుడే: ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామికి ఆరు ఎకరాల దేవాలయ భూములున్నా నిత్యం ధూపదీప నైవేద్యాలకు మాత్రం నోచుకోవడం లేదని స్థానికులు వాపోయారు. ఏటా నవంబరులో కార్తీక పూర్ణమి నుంచి 15 రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. దీనికి వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. నిత్యం భక్తులు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజు ధూప దీప నైవేద్యాలు సమర్పించాలని కోరుతున్నారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

పుస్తకాల పంపిణీ



విద్యార్థులు, ఉపాధ్యాయులతో అసోసియేషన్ ప్రతినిధులు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం చైల్డ్ చాప్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'రైజ్ యువర్ వాయిస్' బొమ్మల కథల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పుస్తకాల ద్వారా విద్యార్థులకు వ్యక్తిగత శరీర భాగాలు, మంచి, చెడు స్పర్శల్లో తేడాను గుర్తించడం, ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే అలాంటి విషయాలను పెద్దలతో ఎలా చెప్పాలి అనే విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోదండరెడ్డిని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

యాచారం: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం.కోదండరెడ్డిని బీఆర్‌కే భవన్‌లో యాచారం మండలం నాయకులు శనివారం కలిసి పూలగుచ్ఛం అందజేశారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు దెంది రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఉప్పల భాస్కర్, తిరుపతి రెడ్డి కోదండరెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి



డీసీసీబీ ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రశేఖర్, ఆనంద్

కందుకూరు, న్యూస్‌టుడే: కందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ద్వారా రైతులకు రుణాల అందించేందుకు నిధులు మంజూరు చేయాలని శనివారం ఆ సంఘం ఛైర్మన్ చంద్రశేఖర్, జిల్లా డైరెక్టర్ ఆనంద్‌లు డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల పంట రుణాలకు రూ.2 కోట్లు, దీర్ఘకాలిక రుణాలకు రూ.3 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.

నిలిచిన రహదారి పనులు..

అవస్థలో ప్రయాణికులు

ప్రారంభించి నాలుగేళ్లైనా అసంపూర్తిగానే

కందుకూరు, యాచారం, న్యూస్‌టుడే

కందుకూరు మండల పరిధిలోని ఔషధ నగరి రోడ్డు పెద్దమ్మ ఆలయం నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం వరకు నిర్మించనున్న రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డుకు నిధులు మంజూరు, పనుల ప్రారంభంతో మహర్దశ వచ్చిందని కలలు కన్న వారికి నరకయాతన తప్పడం లేదు. పనులు ప్రారంభించి నాలుగేళ్లు దాటినా ఇప్పటికి పూర్తి కాలేదు. ఆ దారిలో ప్రయాణించే పలు గ్రామాల వాహనదారులు ప్రమాదాల బారిన పడటంతో పాటుగా మృతి చెందిన సంఘటనలున్నాయి.



మైలమ్మ వాగు కల్వర్టు వద్ద అసంపూర్తి పనులు

నిధులు 2019లోనే మంజూరు..

ఔషధ నగరి ఏర్పాటులో భాగంగా పెద్దమ్మ ఆలయం నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా యాచారం వరకు 13.2 కి.మీ రోడ్డు విస్తరణకు అప్పటి ప్రభుత్వం 2019లో శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ.84.5 కోట్లు నిధులు మంజూరు చేశారు. 2020లో నిర్మాణ పనులు ప్రారంభించింది. 100 అడుగుల విస్తరణతో చేపట్టాల్సిన రోడ్డుకు భూసేకరణ పనులు అడుగు ముందుకు పడలేదు. మీర్‌ఖాన్‌పేట పరిధిలోని 2 కిలో మీటర్ల మేర బీటీ, సీసీ రోడ్డు, నంది వనపర్తి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు అంతే..

తవ్వి మట్టి పోశారు..

ఔషధ నగరి రహదారి నుంచి మీర్‌ఖాన్‌పేట కొంత దూరం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మీర్‌ఖాన్‌పేట- మైలమ్మ వాగు కల్వర్టు నుంచి గ్రామం వరకు కల్వర్టు నిర్మాణాలు చేపట్టిన రోడ్డు విసర్తరణలో భాగంగా మట్టి పోసి వదిలేశారు. మీర్‌ఖాన్‌పేట నుంచి సింగారం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా తవ్వకాలు చేపట్టి మట్టి పనులతో మమ అనిపించారు. నిలిచిన పనులతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలుగా ఏర్పడింది. వాహనదారులు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం వాహనాల రాకపోకలు..

హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి కందుకూరు నుంచి హైదరాబాద్- నాగార్జున సాగర్ రోడ్డులను అనుసంధానం చేసే యాచారం రెండు మండల కేంద్రాల ప్రధాన రహదారి. నాగర్జున సాగర్ వైపు నుంచి ఇటు మహేశ్వరం, షాద్‌నగర్ పారిశ్రామిక వాడలకు వచ్చే లారీలు సైతం ఈ దారినుంచే ప్రయాణిస్తుంటాయి. నిత్యం రోడ్డు రద్దీగా ఉండటంతో పాటు సుమారుగా మండలంలోని 15 గ్రామాల ప్రజలు ఈ రోడ్డు మీదుగానే ప్రయాణం సాగిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

సరూర్‌నగర్, తుర్కయంజాల్ పురపాలిక, ఆదిభట్ల, ఆర్కేపురం, యాచారం, పెద్దఅంబర్‌పేట్, బాలాపూర్, న్యూస్‌టుడే:

? సరూర్‌నగర్ డివిజన్‌లోని భగత్‌సింగ్‌నగర్‌లో రోడ్లు గుంతలమయం అయ్యాయి. – ఫిరోజ్, భగత్‌సింగ్ నగర్ కాలనీ

✓ మరమ్మతులు చేపడుతున్నాం. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది. – సుజాత, ఉప కమిషనర్, సరూర్‌నగర్ సర్కిల్

? ఇంజాపూర్ మాసాబ్‌చెరువు కల్వర్టు వద్ద చెత్త డంప్ చేస్తున్నారు. – రాజు, వాహనదారుడు

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రవీన్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ.

? ఆదిభట్ల పురపాలిక పరిధిలోని గణేశ్‌నగర్ కాలనీలో శునకాల బెడద ఎక్కువగా ఉంది. –సురేష్, గణేశ్ నగర్ కాలనీ

✓ సిబ్బందిని పంపించి శునకాలను పట్టుకెళ్తాం. – బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల పురపాలిక

? ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఇన్‌కం ట్యాక్స్ కాలనీలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. – గురుబాబు, ఆర్కేపురం

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం. – సుజాత, సరూర్‌నగర్ డీసీ

? గడ్డమల్లయ్యగూడెంలో మురుగంతా ఓ చోట చేరడంతో దుర్వాసన వస్తోంది. – మల్లేశ, గడ్డమల్లయ్యగూడెం

✓ పరిశీలించిన చర్యలు తీసుకుంటాం. – నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాచారం

? పెద్దఅంబర్‌పేట్-సంఘీ వెళ్లే రోడ్డు చాకర వాగు, చెన్నవాగు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణ పనులు చేపట్టి ఏడాది గడుస్తున్న పూర్తి చేయడం లేదు. – ఎం.శ్రీనివాస్ రావు, కోహెడ

✓ పనులు తుదిదశకు చేరుకున్నాయి. వీలైనంత త్వరగా పూర్తిచేసి రాకపోకలు సాగించేలా చూస్తాం. – రవీందర్ గౌడ్, డీఈఈ, ఇబ్రహీంపట్నం సబ్ డివిజన్

? అల్మాస్‌గూడ శివాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఉన్న రోడ్డును పైప్‌లైన్ నిర్మాణం కోసం రెండేళ్ల క్రితం తవ్వి వదిలేశారు. – మోహన్, అల్మాస్‌గూడ

✓ త్వరలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతాం. – యాదయ్య, డీఈ, బడంగ్‌పేట కార్పొరేషన్

పింఛను పెంచకపోతే తాడోపేడో తేల్చుకుంటాం: వీహెచ్‌పీఎస్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

యాచారం: దివ్యాంగుల పింఛను రూ.6వేలకు పెంచకపోతే తాడోపేడో తేల్చుకుంటామని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య పేర్కొన్నారు. ఏపీ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పింఛన్లు రూ.6వేలకు పెంచి అమలు చేస్తోంటే తెలంగాణ సర్కారు మాత్రం హామీని అటకెక్కించిందని మండిపడ్డారు. యాచారంలోని దివ్యాంగుల భవనంలో శనివారం నిర్వహించిన వీహెచ్‌పీఎస్ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 8లక్షల మందికి సదరం ధ్రువీకరణ పత్రాలు పొందారని వారిలో 5లక్షల మందికి మాత్రమే పింఛన్లు ఇస్తున్నారన్నారు. వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి జంగయ్య ఆయా మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఆర్మీ అధికారి రాజేష్, పాఠశాల డైరెక్టర్లు కృష్ణాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

ప్రతిభ చాటిన విద్యార్థులు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: ఇటీవల దిల్లీలో వివిధ అంశాల్లో జరిగిన ఇంటర్ స్కూల్ పోటీల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌లోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శనివారం బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐఎస్ఎఫ్ ఆర్మీ అధికారి రాజేష్, పాఠశాల డైరెక్టర్లు నోముల కృష్ణాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి విద్యార్థులకు పతకాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని అరుణ, కోఆర్డినేటర్ సునీత తదితరులు పాల్గొన్నారు.



తుర్కయంజాల్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు దాటుతూ..

అడ్డదారిలో ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం

కొంతమంది ద్విచక్రవాహనదారులు డివైడర్ ధ్వంసమైన చోట అడ్డదారిలో రోడ్డు దాటుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాగార్జునసాగర్ రహదారిలో మన్నెగూడ నుంచి ఇంజాపూర్ వరకు అక్కడక్కడా డివైడర్ ధ్వంసమైంది. ద్విచక్రవాహనదారులు 'యు' మలుపు వద్దకు వెళ్లకుండా ఈ ప్రాంతాల గుండా రోడ్డు దాటి అవతలివైపునకు వెళుతున్నారు. ఇలాంటి రహదారులను మూసేయాలని పలువురు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, తుర్కయంజాల్

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: పంచాయతీ రాజ్ చట్టం 2018 నిబంధనలకు వ్యతిరేకంగా పోల్కంపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 132,154,155,156,163లో జీబీఆర్ గ్రూఫ్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ స్థిరాస్తి వ్యాపారులు అక్రమంగా వెంచర్ల చేశారని మండల పరిషత్ అధికారి లక్‌పతి అన్నారు. శనివారం అక్రమ లేఅవుట్ల వద్ద గ్రామపంచాయతీ సిబ్బందితో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇందులో ఎవరూ ప్లాట్లు కొని మోసపోవద్దని సూచించారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి



పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బాలాపూర్: పనుల్లో నాణ్యత లోపించకుండా పూర్తి చేయాలని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధి 15వ డివిజన్‌లోని పద్మావతి, సీతా ఎవెన్యూ కాలనీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు వి.ప్రభాకర్‌రెడ్డి, బి.మనోహర్ పాల్గొన్నారు.

గిరిజన హక్కుల సాధనకు పోరాడాలి

ఆర్కేపురం: చలో ఖమ్మం రాష్ట్ర స్థాయి గిరిజన సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నేత ధర్మానాయక్ పిలుపునిచ్చారు. ఆర్కేపురంలోని బంజారా బస్తీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని గిరిజనుల హక్కుల సాధనకు పోరాడలన్నారు. పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌ను విమర్శించే హక్కు కసిరెడ్డికి లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు, న్యూస్‌టుడే: తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శించే నైతిక హక్కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. రాజకీయ జన్మనిచ్చిన కేసీఆర్‌పై కనీస మర్యాద లేకుండా విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఆమనగల్లులోని కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు మోసం చేయడం తోనే జిల్లాలో ఎమ్మెల్యేలందరు ఓడిపోయారని ఎమ్మెల్యే అనడం సరైన విధానం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మాజీ కేంద్రమంత్రి దివంగత జైపాల్‌రెడ్డి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో భూకబ్జాలు పెద్దఎత్తున జరుగుతున్నాయని తప్పు చేసినవారికి శిక్ష పడడం ఖాయమన్నారు. హైడ్రా పేరుతో సాధారణ ప్రజల ఇళ్లను కూల్చడమేందని దుయ్యబట్టారు. భారాస పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు అర్జున్‌రావు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తుర్కయంజాల్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శనివారం మాలల ఆత్మగౌరవ సభకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈనెల 27న నాగర్‌కర్నూల్ జిల్లాలో సభ జరగనున్నట్లు సమితి రాష్ట్ర ఛైర్మన్ గద్ద శ్రీనివాస్, మాజీ సర్పంచి చెవుల దశరథ తదితరులు తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామంలో శనివారం భాజపా జిల్లా కార్యదర్శి పి.పాండుప్రసాద్, మాజీ సర్పంచి కుమార్ నేతృత్వంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై భాజపా సభ్యత్వం పొందుతున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో నరేందర్, మల్లేశ్, మహేశ్, శ్రీను, వెంకటయ్య పాల్గొన్నారు.

బీరప్ప కల్యాణం రేపు

బాలాపూర్, న్యూస్‌టుడే: బడంగ్‌పేటలో శ్రీబీరప్ప స్వామి, కామరాతి దేవి కల్యాణ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 21న సోమవారం ఉదయం 11.45 గంటలకు కల్యాణం ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దట్టమైన పొగ మంచు.. కనిపించని రోడ్లు



శనివారం తెల్లవారు జామున ఉదయం 7.30 గంటల వరకు ఇబ్రహీంపట్నంలో దట్టమైన పొగ మంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దట్టమైన పొగ మంచుతో రోడ్లు కనిపించకుండా ఉండడంతో వాహనదారులు లైట్లు వేసుకొని జాగ్రత్తగా వెళ్లారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

'ప్రార్థనా మందిరాలపై దాడులను అరికట్టాలి'



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ప్రార్థనా మందిరాలపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహకారదర్శి చింతల వెంకటన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దాడులకు నిరసనగా శనివారం వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నేతలు తుక్కుగూడ బాహ్యవలయ రహదారి జంక్షన్ నుంచి డీసీపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాడులకు దిగుతున్న దుండగులను కఠినంగా శిక్షించాలంటూ.. డీసీపీ కార్యాలయంలో, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. రాఘవేందర్, శ్రీనివాస్, రమణ, రాజు, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

నేడు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ప్రతినిధుల సమావేశం

పెద్దఅంబర్‌పేట్, న్యూస్‌టుడే: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి ముఖ్య ప్రతినిధుల సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూరులోని గాంధీయన్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఛైర్మన్ గున్నా రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరుగుతోందని వెల్లడించారు. ఉత్తమ రైతులకు పుడమిపుత్ర అవార్డులు, కిసాన్ సేవా రత్న అవార్డులు, చరఖా ప్రదర్శన ఉంటుందని ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

పత్తి సాగుపై అవగాహన సదస్సు



పత్తి చేలలో శాస్త్రవేత్తలు

చిత్తాపూర్(మంచాల): కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చిత్తాపూర్‌లో పత్తి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పత్తి సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు లాభాలు పొందవచ్చునని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త ఎం. అమృత, శాస్త్రవేత్తలు సుధీర్, దిలీప్, కృష్ణ, హరికృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రాజేందర్‌రెడ్డి

తలకొండపల్లి: చంద్రధన గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు మౌలిక వసతులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నాయకుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. పాఠశాలలో మూత్రశాలలు నిర్మాణం, తరగతి గదులకు మరమ్మతులు చేయాలని ఎమ్మెల్యేకు ఆయన వివరించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.65 లక్షలతో అభివృద్ధి పనులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: అంచెలవారీగా ఆదిభట్ల మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తామని ఆ మున్సిపాలిటీ ఛైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం పురపాలిక పరిధిలోని 1, 13, 14 వార్డుల్లో రూ.65 లక్షల నిధులతో సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆదిభట్ల పురపాలికను రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్ లావణ్య పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ బాధ్యతల స్వీకరణ

అబ్దుల్లాపూర్‌మెట్: కుత్బుల్లాపూర్ గ్రామంలోని చారిత్రక వేంకటేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటీ ఛైర్మన్‌గా కొండ్ర ఎల్లమయ్యతో పాటు పలువురు డైరెక్టర్లు శనివారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించిన వారిలో ఛైర్మన్ ఎల్లమయ్య, డైరెక్టర్లు దేవేందర్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, లావణ్య, కృష్ణ, శ్రీనివాస్‌గుప్తా, అరుణ్‌గౌడ్, శ్రీనివాస్, కృష్ణయాదవ్, భారతి, రాజు, ప్రణయ్ ముదిరాజ్ ఉన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారి ప్రణీత్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌గౌడ్, ఆలయ మాజీ ఛైర్మన్ రమేష్‌గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు రఘునాథాచార్యులు, అర్చకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం.. ఒకరిపై కేసు

బాలాపూర్: అమ్మవారి ఆలయంలోకి ఓ వ్యక్తి చొరబడి దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేసిన సంఘటన మీర్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన జె.కుమార్ వృత్తిరీత్యా బోర్‌వెల్ కూలీ. శుక్రవారం అర్ధరాత్రి బడంగ్‌పేటలోని పోచమ్మగుడి ఆలయంలోకి చొరబడి హుండీని తెరిచేందుకు ప్రయత్నించాడు. స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించడంతో. . వారు సంఘటన స్థలానికి చేరుకొని కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. గ్రామ పెద్దల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పోకిరీ దాడిలో గాయపడిన వృద్ధుడి మృతి

పహాడీషరీఫ్: వారం కిందట ఓ పోకిరీ దాడి చేయడంతో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, మృతుడి బంధువుల కథనం ప్రకారం.. శంషాబాద్ మండలం సుల్తాన్‌పల్లి గ్రామం కేబీ దొడ్డి ప్రాంతానికి చెందిన యూసుఫ్(75) అవివాహితుడు. అతడు అనారోగ్యంతో ఉండడంతో సోదరి కుమారులు అతన్ని జల్‌పల్లి పహాడీషరీఫ్ చార్మినార్ మసీదు వద్ద ఓ ఇంట్లో ఉంచి బాగోగులు చూసేందుకు పని మనిషిని కుదిర్చారు. సుల్తాన్‌పల్లిలో యూసుఫ్‌కు అక్కడుండే నసీర్‌తో ఐదెకరాల స్థలంపై కోర్టులో కేసు కొనసాగుతుంది. ఈ వివాదంలో భాగంగా పహాడీషరీఫ్‌లోనే ఉండే పోకిరీ రియాజ్(26)కు యూసుఫ్‌ను హతమార్చితే రూ.2లక్షలు అందిస్తామన్నాడు. వారం కిందట వృద్ధుడు ఉండే గదికి వెళ్లిన రియాజ్ అతనిపై దాడిచేశాడని పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు రియాజ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు

మహేశ్వరం, న్యూస్‌టుడే: పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లో విశిష్ట మోడల్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా కళా ఉత్సవ్ కార్యక్రమంలో మహేశ్వరం మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు జిల్లా స్థాయిలో బహుమతులు గెలుపొందారు. పదో తరగతి చదువుతున్న రమేష్ విజువల్ ఆర్ట్స్ విభాగంలో ప్రథమ బహుమతి, బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ప్రణవి స్టోరీ టెల్లింగ్ విభాగంలో తృతీయ బహుమతి గెలుపొందారు. విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ గోపి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తరలించే యోచన: శాసనసభ స్పీకర్

చేవెళ్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా రాజేంద్రనగర్‌కు మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఉపాధి హామీ పనులపై గ్రామ సభ

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు చేయాలని ఇబ్రహీంపట్నం ఎంపీడీవో వెంకటమ్మ ఉపాధి హామీ సాంకేతిక సిబ్బందికి సూచించారు. శనివారం ముకునూరు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో 2025-26లో చేయనున్న పనులపై గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్, సిబ్బంది ఇందిరా, లింగం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ, ఫిట్‌మెంట్‌ను వెంటనే ప్రకటించండి

తలకొండపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు పీఆర్సీ, ఫిట్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేశ్ డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండలంలోని వివిధ పాఠశాలలో శనివారం తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సమరంజిత, రామదాస్, మణిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెస్ ఛాంప్ అనద్కత్



ఈనాడు, హైదరాబాద్: వారాస్ అంతర్జాతీయ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా అనద్కత్ కర్తవ్య నిలిచాడు. వారాస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జీపీ బిర్లా కేంద్రంలో శనివారం ముగిసిన ఈ పోటీల్లో 9 రౌండ్ల నుంచి 8 పాయింట్లు సాధించిన అనద్కత్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. కౌస్తుభ్ (8), మార్తాండన్ (7.5) వరుసగా రెండు మూడు స్థానాలను సొంతం చేసుకున్నారు. అండర్-15 బాలబాలికల్లో ఓషిక్, శరణ్య; అండర్-13లో అంజని కుమార్, శరణ్య దేవి; అండర్-11లో అశోక్, ప్రతీతి; అండర్-9లో దివిత్, విశ్వజ; అండర్-7లో ఆనంద్, అన్విత టైటిళ్లు గెలిచారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

నేడు కేబీఆర్ వద్ద పునరుజ్జీవ వేడుకలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ప్రజాసంబరాల కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కేబీఆర్ ఉద్యానవనం వద్ద ఆదివారం పునరుజ్జీవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా ఉద్యానవనం చుట్టూ మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు ఈ వేడుకలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. కేబీఆర్ గేట్ నం.1 వద్ద ప్రత్యక్ష సంగీతం, ఫొటో బూత్, గేట్ నం.2 అడ్వెంచర్ స్పోర్ట్స్, గేట్ నం. 3 వద్ద హాబీస్ కార్నర్ ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ గేట్ నం.1 వద్ద ఆర్ట్స్ కార్నర్, గేట్ నం.9 వద్ద క్రీడలు, వినోద వేడుకలు, గేట్ నం.10 వద్ద షాపింగ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల గురించి తెలిసేలా బెలూన్‌లను ఏర్పాటు చేశారు. కేబీఆర్ చుట్టు నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని ఉప కమిషనర్ ప్రశాంతి తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య)

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ

? బంజారాహిల్స్ రోడ్డు నం. 14లోని స్వాతి బ్యూటీ పార్లర్ వద్ద, షేక్‌పేట సీతానగర్‌లోని ఇంటి నం: 8-1-187 ప్రదేశం, బంజారాహిల్స్ రోడ్డు నం. 4లోని సంజయ్‌గాంధీ నగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. చర్యలు తీసుకోండి. – శంకర్‌రావు (బంజారాహిల్స్) లావణ్య (సీతానగర్), మధు (సంజయ్ గాంధీ నగర్).

✓ సిబ్బందిని పంపి అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.
– సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్–18

? మధురానగర్‌లోని ఈ-బ్లాకులో చెట్లకొమ్మలు వీధిదీపాలకు అడ్డుగా ఉన్నాయి. దీంతో దీపాలు వెలుగుతున్నా చీకటిగా ఉంటోంది. –అంకినీడు, ప్లాట్ నెంబరు ఈ–88, మధురానగర్.

✓ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగిస్తాం. –గుగులోతు గోపీ, ఏడీఈ, విద్యుత్ శాఖ సీబీడీ.

ఆదివారం సంత.. ఆదరణ కొండంత



శంఖం పనితీరును పరీక్షిస్తున్న యువతి

సనత్‌నగర్, న్యూస్‌టుడే: అంతర్జాలంలో కొనుగోళ్లు పెరిగిపోతున్న రోజులివి. ఏం కావాలన్నా యాప్‌ల ద్వారా ఆర్డర్ చేయగానే.. ముంగిటకే వచ్చి వాలుతున్నాయి. నిన్నమొన్నటి వరకు షాపింగ్ మాల్స్, చైనా బజార్ వంటి సంస్థలను ఆశ్రయించిన కొనుగోలుదారులు ప్రస్తుతం ఆన్‌లైన్, డిజిటల్ మార్కెట్ల వైపు మళ్లారు. ఈ పరిస్థితుల్లో నాటి తరం అంగళ్లను (సంతలు) పట్టించుకునే వారే కనిపించడం లేదు. సాంకేతిక ఇంత అభివృద్ధి చెందినప్పటికీ ఎర్రగడ్డ సంతకు ఆదరణ కొనసాగుతోంది. ఆదివారం వచ్చిందంటే కొనుగోలుదారులను ఆకర్షించేలా వ్యాపారుల అరుపులు, బేరసారాలు, ఆశ్చర్యం కలిగించే అరుదైన వస్తువులు.. చూసేవారికి ఏదైనా కొనాలనిపించేలా ఉంటాయి.



పురాతన నాణేల విక్రయం

వందేళ్ల ఎర్రగడ్డ మార్కెట్‌కు ఎన్నెన్నో ప్రత్యేకతలు

అంగట్లోనే అన్నీ ఉన్నాయ్..

ఎర్రగడ్డ సంతలో దాదాపు రెండు వేల మంది నాటి, నేటి తరాల వ్యాపారులు వ్యాపారం సాగిస్తున్నారు. ఇక్కడ లభించని వస్తువంటూ లేదు. పనికిరావని పారవేసే పాత వస్తువుల నుంచి కంప్యూటర్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, నిన్న మొన్నటి పవర్ బ్యాంకులు, పాదరక్షలు, గృహోపకరణాలు, ఇనుప వస్తువులు, నిర్మాణ సామగ్రి, యంత్రపరికరాలు, స్మార్ట్ ఫోన్లు, చార్జర్లు, రెడీమేడ్ దుస్తులు, పాత దుస్తులు, వంట సామగ్రి, పాత సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, కారు చవకగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన బూట్లు, పాదరక్షలు, ఆహార ధాన్యాలు, తినుబండారాలు, పాత కరెన్సీ నోట్లు, నిజాం, బ్రిటిషు కాలం నాటి నాణాలు, నవాబుల కాలం నాటి వస్తువులు, అలంకరణ సామగ్రి, గృహోపకరణ వస్తువులు, విద్యుత్తు పరికరాలు, సౌందర్య సాధనాలు, అత్తర్లు, పాతతరం గ్రామఫోన్లు, సీడీలు కనిపిస్తాయి. వీటితో పాటు నాటు కోళ్లు, బాతులు, గిన్నె కోళ్లు, పావురాలు, పక్షులు, మేకలు, గొర్రెలు కూడా ఎర్రగడ్డ సంతలో అమ్ముడవుతుంటాయి. ఇతర ప్రాంతాల నుంచి కూడా కొనుగోలుదారులు వస్తుంటారు. ప్రతీ ఆదివారం తెల్లవారు జామున 5 గంటల నుంచే ప్రారంభమై రాత్రి 10 గంటల వరకు కొనసాగుతుంది.

నిజాంల కాలం నుంచి కొనసాగుతూ..

వందేళ్లకు పైగా 1910 నిజాంల హయాం నుంచి కొనసాగుతున్న ఎర్రగడ్డ సంతలో ఎన్నో విశేషాలు ఉన్నాయి. గుండు సూదుల నుంచి గునపాల వరకు, పనికిరాని వస్తువుల నుంచి కంప్యూటర్ విడిభాగాల వరకు, నాటు కోళ్ల నుంచి నిజాం కాలం నాటి అరుదైన అరుదైన నాణేల వరకు ఏది కావాలంటే అది ఎర్రగడ్డలోని ఆదివారం సంతలో లభ్యమవుతుంది. చాలా సంవత్సరాల కిందట ఆదివారం సంత నిర్వహణకు ఎర్రగడ్డలో విశాలమైన స్థలం ఉండేది. ఆ తరువాత పట్టణీకరణ నేపథ్యంలో అంగడి నిర్వహణకు అవసరమైన స్థలం లేక రోడ్డుపైనే కొనసాగుతోంది. పేద, మధ్య తరగతి కొనుగోలుదారుల అవసరాలకు అనుగుణంగా నిర్వహిస్తున్న ఎర్రగడ్డ సంత వందల సంఖ్యలో వ్యాపారులకు జీవనోపాధిని కల్పిస్తోంది. గతంలో ఈ సంత ఎర్రగడ్డ వద్ద జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లపై కొనసాగేది. ఇటీవల ఎర్రగడ్డ కూడలి నుంచి సనత్‌నగర్ మీదుగా ఫతేనగర్ రైల్వే స్టేషన్ వరకు వరకు విస్తరించింది.

సంత వయసు:	దాదాపు వందేళ్లు
పొడవు:	దాదాపుగా 3 కిలోమీటర్లు
విస్తరణ:	ఎర్రగడ్డ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి పెట్రోల్ బంకు వరకు, ఎర్రగడ్డ చౌరస్తా నుంచి ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు
లభించే వస్తువులు:	సుమారు లక్ష రకాలు
కొనుగోలుదారుల సంఖ్య:	50 వేలకు పైగా..
వర్తకుల సంఖ్య:	సుమారు 2 వేలు



నాటు కోళ్లు

టీజీవోస్ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణయాదవ్



నూతన కార్యవర్గం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ గజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎంబీ కృష్ణయాదవ్, ఎన్నికయ్యారు. శనివారం టీజీవోస్ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ సమక్షంలో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా సహదేవ్, సహాయ అధికారిగా టి.లక్ష్మణ్ గైడ్ వ్యవహరించారు. సంఘం సహ అధ్యక్షుడిగా ఆశన్న, కార్యదర్శిగా మహ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షులుగా డా. ఎన్.నరేందర్, రాజేందర్, ఎంజులారెడ్డి, సహ కార్యదర్శిగా పూనం, ప్రచార కార్యదర్శిగా మంచాల రవీందర్, కార్యాలయ కార్యదర్శిగా గోపాలకృష్ణ, సాంస్కృతిక కార్యదర్శిగా డా.రమేష్, క్రీడా కార్యదర్శిగా డా. సందీప్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రవణ్‌కుమార్‌రెడ్డి, జె.నర్సింగరావు, బి.శ్రవణ్‌కుమార్ గౌడ్, పావని ఎన్నికయ్యారు.

ఆన్‌లైన్ మోసం

యూసుఫ్‌గూడ: మనీ ల్యాండరింగ్ పేరుతో సైబర్ మోసగాళ్లు మహిళను బురిడీ కొట్టించి రూ. 40వేలు తస్కరించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన రాజు, పూజ దంపతులు. ఈనెల 18న పూజకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి వీడియోకాల్‌లో మాట్లాడాలని సూచించి కట్ చేశారు. కొద్దిసేపటి తర్వాత ఇద్దరు ఆగంతుకులు పోలీస్ యూనిఫామ్‌లో వీడియోకాల్ చేసి ఆలంబాగ్ క్రైమ్ బ్రాంచీ ఎస్సైగా, డీఎస్పీగా పరిచయం చేసుకున్నారు. మీరు ఆధార్ నంబరు దుర్వినియోగానికి పాల్పడ్డారని, మనీ ల్యాండరింగ్ కేసు నమోదైనట్లు బెదిరించారు. కేసు నుంచి ఉపశమనం పొందాలంటే రూ. 40వేలు పంపించాలని చెప్పారు. ఆందోళనకు గురైన ఆమె ఆ మొత్తాన్ని ఆన్‌లైన్లో బదిలీ చేసింది. అనంతరం మోసపోయామని గ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

యూసుఫ్‌గూడ: మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్, వీడియోగల్లీలో ఉంటున్న వినోద్ (38), అవిలాష్ దంపతులు. అవిలాష్ జవహర్‌నగర్‌లో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తోంది. వినోద్ ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈనెల 18న రాత్రి బ్యూటీ పార్లర్‌లో పనులు ముగించుకొని ఇంటికి వచ్చేసరికి భర్త ఫ్యానుకు ఉరేసుకొని ఉన్నాడు. పోలీసులు, స్థానికుల సహాయంతో కిందికి దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గతంలో సైతం ఓసారి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక ధైర్యంతో వ్యాధులను ఎదుర్కోవచ్చు



మాట్లాడుతున్న సోనాలి బింద్రే, చిత్రంలో పింకీరెడ్డి, స్నేహ సాగర్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మానసిక ధైర్యంతోనే ఎంతటి వ్యాధినైనా ఎదుర్కొనవచ్చని సినీ నటి సోనాలి బింద్రే అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని జీవీకె హెల్త్ హబ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఫిక్కి మాజీ ఛైర్‌పర్సన్ పింకీరెడ్డి, డాక్టర్ స్నేహ సాగర్‌తో కలిసి ఆమె చర్చావేదికలో పాల్గొన్నారు. క్యాన్సర్ విషయంలో తన స్వీయ అనుభవాలు తెలిపారు. మానసిక ధైర్యంతో ఉండటంతో జయించానన్నారు. పింకీరెడ్డి మాట్లాడుతూ.. మహిళ కుటుంబ వ్యవస్థకు, ఆర్థిక ప్రగతికి, సమాజానికి ఎంతో మూలమని, అలాంటి మహిళలకు సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ స్నేహ సాగర్ మాట్లాడుతూ.. రొమ్ము క్యాన్సర్ విషయంలో అపోహలు వద్దని, అనుమానం ఉంటే స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. సినీ నటి నమ్రతా శిరోద్కర్, ఆసుపత్రికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వక ఉల్లంఘనలకు శిక్ష తప్పదు

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ అవకతవకలపై సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించినా స్పందించని సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్ హరితపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశించినా అమలు చేయలేదని, కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో నోటీసులు జారీ చేసినా స్పందించకుండా వ్యక్తిగత హాజరుకు ఆదేశించిన తరువాత నివేదిక అందజేయడం ప్రాథమికంగా కోర్టు ధిక్కరణేనని పేర్కొంది. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినట్లు తేలితే శిక్ష తప్పదని తేల్చి చెబుతూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

స్వచ్ఛతా హీ సేవా

హిమాయత్‌నగర్: 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా నారాయణగూడ బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విఠల్‌వాడిలోని మెల్కోటే పార్కు, అక్కడి పార్కింగ్ ప్రదేశంలో ఊడ్చి శుభ్రం చేశారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

షేక్‌పేటలో మల్టీ పర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి చర్యలు: కేంద్ర మంత్రి



షేక్‌పేట అలిజాపూర్‌లో బోర్‌వెల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట గుట్టపోచమ్మ దేవాలయం వద్ద మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. షేక్‌పేట అలిజాపూర్, విరాట్‌నగర్ కాలనీల్లో పవర్ బోర్లు, వివేకానందనగర్ కాలనీలో సామాజిక భవనాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అనంతరం వివేకానందనగర్‌లో మాట్లాడారు. అలిజాపూర్‌లో మురుగునీటి పైపులైన్ పునరుద్ధరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. వివేకానందనగర్ కాలనీ సామాజిక భవనానికి ప్రహరీ, ఫ్లోరింగ్ పనులు చేపట్టేలా చూస్తానన్నారు. మూడోసారి భాజపా విజయం సాధించిన నేపథ్యంలో ప్రధాని మోదీ మరింత వేగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారని, ఆ దిశగా తాము పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భాజపా నాయకులు లంకల దీపక్ రెడ్డి, రామకృష్ణ, షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రజనీకాంత్ రెడ్డి, ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భవనాలకు తాళాలు వేయడంతో ప్రభుత్వం స్పందించింది



మాట్లాడుతున్న దేవేందర్‌రెడ్డి, చిత్రంలో జోగిరెడ్డి, శంభారెడ్డి తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: గురుకుల హాస్టల్ భవనాలకు యజమానులు తాళాలు వేయడంతోనే ప్రభుత్వం స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం పేర్కొంది. కొన్ని నెలల అద్దె చెల్లించడంతో పాటు మిగతా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తొలగించామని సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారు డా.కొండా దేవయ్య పటేల్ శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. కొన్ని చోట్ల తమపై కేసులు నమోదు చేయడాన్ని శనివారం మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఎత్తేయాలని కోరగా సానుకూలత వ్యక్తం చేశారన్నారు. మిగతా సమస్యలపై వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. అందులో భవనాల అద్దెకు మూడేళ్ల కనీస వ్యవధి ఉండాలని, అద్దె ప్రతి రెండేళ్లకోసారి 20 శాతం పెంచాలని, అన్ని భవనాలకు ఒకే రకమైన నిబంధనలు ఉండాలని, క్రీడా స్థలానికి అడుగుకు కనీసం రూ.10 చొప్పున చెల్లించాలని, జీఎస్టీతో అద్దె వ్యవస్థ ఉండాలని కోరామన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి బండి కుమార స్వామి, కోశాధికారి శంభారెడ్డి, నాయకులు వల్లాల శ్రీహరి పాల్గొన్నారు.

భిన్నత్వమే సృష్టి రహస్యం : గవర్నర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జిష్ణుదేవ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భారతీయులు ఆదర్శమైన వసుధైక కుటుంబాన్ని సాధించడంలో ఐక్యత ఎంతో ముఖ్యమని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో న్యూరోడైవర్స్ (బుద్ధిమాంద్యం) కళాకారుల కళాకృతుల ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'భిన్న స్వరాలు అవధుల్లేని కళ' పేరుతో జరుగుతున్న ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బుద్ధిమాంద్యం కళాకారులు 100 చిత్రాలను ప్రదర్శించారు. గవర్నర్ మాట్లాడుతూ.. భిన్నత్వం సృష్టి రహస్యమనీ, ఏకరూపత ఏ రంగంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 27 వరకు జరుగుతుందని, పెయింటింగ్‌లు, డ్రాయింగ్‌లు, ఛాయా చిత్రాలు డిజిటల్ ఆర్ట్‌లు ప్రదర్శనకు ఉంచినట్లు కార్యనిర్వాహకులు అతియా అమ్జద్ పేర్కొన్నారు.

'పోలీసు కనుసన్నల్లో కబ్జాలు'



స్థలంలో నిర్మాణం చేసినట్లు చిత్రాలు చూపుతున్న జడ్సన్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణలో ప్రజాస్వామ్యం ముసుగులో భూదందాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ బహిష్కృత నాయకుడు బక్క జడ్సన్ ఆరోపించారు. తాజాగా మల్కాజిగిరిలోని తిరుమల్‌నగర్‌లో 300 ఎకరాలు తమదేనంటూ కొందరు పోలీసుల సాయంతో ఆక్రమించారని, ఎస్ఓటీ పోలీసులు దగ్గరుండి రేకుల షెడ్డు వేసుకునేందుకు సహకరించారన్నారు. శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరుడు ఖురేషి కనుసన్నల్లో ఇదంతా జరుగుతోందన్నారు. సమావేశంలో ఆయన అనుచరుడు గిరిబాబు ఉన్నారు.

జేఎన్ఎఫ్ఏయూకు స్థలం కేటాయింపును నిరసిస్తూ.. సమ్మె



ఆందోళనలో ఆచార్యులు, ఉద్యోగులు, జాక్ సభ్యులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి(జేఎన్ఎఫ్ఏయూ) కేటాయించడాన్ని నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు రిజిస్ట్రార్‌కు సమ్మె నోటీసు అందించారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పరిపాలన భవనం, అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేశారు. ఇప్పటికే పలువురు మంత్రులు, అధికారులను కలిసి సమస్యను వివరించామని జేఏసీ ఛైర్‌పర్సన్ ఆచార్య పల్లవి కాబ్డే, సెక్రటరీ జనరల్ మహేష్‌గౌడ్ ఉద్యోగులకు వివరించారు.

ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: దానం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగేందర్

ఫిల్మ్‌నగర్: ప్రజలకు ఏ కష్టం వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన స్వామి కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలిసి ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ ద్వారా శస్త్రచికిత్సకు రూ. 2.5లక్షల ఎల్ఓసీని శనివారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మరో ముగ్గురు లబ్ధిదారులకు సైతం ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 2.10లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పలువురు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం



బెలూన్లు ఎగురవేస్తున్న వైద్యులు, కార్పొరేటర్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ఉండాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మీగౌడ్ అన్నారు. రొమ్ము క్యాన్సర్ మాసం సందర్భంగా శనివారం హైదర్‌గూడలోని అపోలో ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు గులాబీ రంగు బెలూన్లు ఎగురవేశారు. వైద్యులు సుజాత, సౌమ్య, గౌతమ్‌రావు, శిల్పారెడ్డి, పీఆర్వో మోహన్ పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలు చూపుతున్న అతిథులు


రవీంద్రభారతి, న్యూస్‌టుడే: మలుపు బుక్స్ నిర్వహణలో రచయిత్రి ఓల్గా అనువదించిన నవల 'పోటెత్తిన కెరటాన్ని', వీక్షణం ఎన్.వేణుగోపాల్ అనువదించిన 'నియంత అంతం' పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రాత్రి రవీంద్రభారతిలో నిర్వహించారు. సాహిత్య విమర్శకుడు డా. ఎ. కె. ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాలమిస్ట్ ఆకార్ పటేల్, రచయిత్రి గీతా హరిహరన్, రచయిత్రి కె. ఎన్. మల్లీశ్వరి మాట్లాడారు.

నృత్యం.. కమనీయం



కుందల కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో నాట్యగురువు రవి కూచిపూడి పర్యవేక్షణలో యువనర్తకీ రితిక తొలి ప్రదర్శన ఆద్యంతం అలరించింది.
– న్యూస్‌టుడే, రవీంద్రభారతి

జూబ్లీహిల్స్‌లో సందడి చేసిన కరణ్ జోహార్



బాలీవుడ్ దర్శక నిర్మాత కరణ్ జోహార్ శనివారం జూబ్లీహిల్స్‌లో సందడి చేశారు. రానున్న ధన్ తేరాస్, దీపావళి పండగలను పురస్కరించుకుని స్థానిక ఓ స్టోర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అభరణాలను ఆయన ఆవిష్కరించారు.
–న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్

మద్యం మత్తులో డ్రైవింగ్, కారు బోల్తా

పంజాగుట్ట: మద్యం మత్తులో కారు నడపడంతో బోల్తాపడిన ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రీన్‌ల్యాండ్స్ సమీపంలోని మంజీరా అతిథి గృహం వద్ద శనివారం ఉదయం కారు బోల్తాపడినట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్నారు. కారులో ఉన్న అక్కి వరుణ్, ఎం.నరేందర్‌లకు స్వల్ప గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. బేగంపేట బ్రాహ్మణవాడికి చెందిన అక్కి వరుణ్ కారు నడిపినట్లు గుర్తించారు. ఇద్దరికి శ్వాస పరీక్షలు నిర్వహించగా మద్యం తాగినట్లు నమోదయ్యింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళింగలో 'సిండ్రెల్లా' డిజైనర్ వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సతీమణి పద్మావతి అన్నారు. బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాలులో శనివారం ఏర్పాటైన సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ప్రదర్శన నిర్వాహకులు జ్యోతి చలసాని మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో 50 వేల రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేశ్ సోదరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఏటీఎం కేంద్రాల వద్ద మోసాలకు పాల్పడుతున్న కేటుగాడి అరెస్ట్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఏటీఎం వద్ద నగదు డిపాజిట్ చేయడానికి వచ్చే వారి నుంచి డబ్బు తీసుకుని ఆన్‌లైన్‌లో బదిలీ చేసినట్లు నమ్మించి ఉడాయిస్తున్న కేటుగాడిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడులో సైతం నిందితుడిపై వందకు పైగా కేసులు నమోదైనట్లు సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, రాజోలు మండలం, చింతలపల్లికి చెందిన ఇంటిపల్లి రామారావు అలియాస్ రాము (30) గ్రాఫిక్ డిజైనర్. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లకు అలవాటుపడి అప్పులపాలయ్యాడు. దీంతో సులువుగా డబ్బు సంపాదించడానికి ఏటీఎం కేంద్రాల్లో నగదు డిపాజిట్ చేయడానికి వచ్చేవారిని లక్ష్యంగా చేసుకున్నాడు. పథకం ప్రకారం.. ఏటీఎం వద్ద ఉండి తన ఏటీఎం కార్డు పని చేయడం లేదని, డబ్బులిస్తే ఆన్‌లైన్‌లో బదిలీ చేస్తానని నమ్మించి నగదు తీసుకొనేవాడు. డబ్బులు పంపినట్లు ఫోన్‌లో ముందుగానే తయారు చేసుకున్న మేసేజ్ చూపించి, కొద్దిసేపటిలో వస్తాయని ఉడాయించేవాడు. ఇలా యూసుఫ్‌గూడలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రం వద్ద ఇటీవల ముగ్గురిని మోసం చేశాడు. పోలీసులు నిందితుడి నుంచి రూ. 5,16,000 నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ జంగయ్య, ఎస్సై అరవింద్‌గౌడ్‌లు నిందితుడిని అరెస్ట్ చేశారు.

కూకట్‌పల్లి

కూకట్‌పల్లిలోనే మొదటి మహిళా పార్కు: ఎమ్మెల్యే



3కే నడక జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: గత ప్రభుత్వం హయాంలో మొట్టమొదటి మహిళా పార్కును కూకట్‌పల్లిలోనే అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం నేడీ స్త్రీ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి రంగధాముని చెరువు కట్టపై నిర్వహించిన 3కే నడకను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పని ఒత్తిడిని దూరం చేసే ఆహ్లాదం, వ్యాయామం అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. మహిళలతో కలిసి కొంతదూరం నడిచారు. కట్టపై అభివృద్ధి చేసిన పార్కును వారికి చూపించారు. నడకలో పాల్గొన్న వారికి పతకాలు అందజేశారు.

పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష కేంద్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పరిశీలించారు. అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చూసుకోవాలని ఆమె ఆదేశించారు.

ఆర్టీసీకి రికార్డు స్థాయిలో దసరా ఆదాయం



ఉద్యోగులకు కానుకలు అందజేస్తున్న డీఎం హరి, సహాయ మేనేజర్ శ్రీలత

మూసాపేట, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా కూకట్‌పల్లి బస్ డిపో ఆదాయం లక్ష్యాన్ని మించి రికార్డు సాధించింది. ఈ నెల 9నుంచి 16వ తేదీ వరకు డిపో నుంచి తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపిన సంగతి తెలిసిందే. వారంపాటు సాగిన ఈ రాకపోకలకు ప్రభుత్వం రూ.14.20 లక్షల లక్ష్యాన్ని నిర్ణయించింది. అయితే, లక్ష్యాన్ని మించి రూ.16.10 లక్షల ఆదాయం సమకూరింది. ఈ మేరకు డిపోలో పనిచేస్తున్న 700 మంది డ్రైవర్లు, కండక్టర్లకు శనివారం చిరు కానుకలు పంపిణీ చేశారు. డిపో మేనేజర్ హరి, సహాయ మేనేజర్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి ఠాణాలో పాఠశాల విద్యార్థుల సందడి



విద్యార్థులతో సీఐ ముత్తు, ఉపాధ్యాయులు

మూసాపేట: కూకట్‌పల్లి పరిధి గీతాంజలి స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లో సందడి చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు తీసుకునే చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులు, చిన్నారులను శనివారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విద్యార్థులు ఠాణాలోని అన్ని విభాగాలను సందర్శించారు. సీఐ, ఎస్సైలు బాధ్యతలు నిర్వహణ, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, డ్రైవింగ్ ఉండే విధానం, కేసుల విచారణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ కొత్తపల్లి ముత్తు, ఎస్సైలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిద్ధం చేశారు.. వినియోగం మరిచారు

బహుళ ప్రయోజన క్రీడా మైదానం కహానీ



నెక్సస్‌మాల్ ఎదుట సిద్ధంగా బహుళ ప్రయోజన క్రీడా ప్రాంగణం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజల సౌకర్యార్థం తీర్చిదిద్దిన బహుళ ప్రయోజన క్రీడా ప్రాంగణం వినియోగంలో జాప్యం జరుగుతూ వస్తోంది. మొన్నటివరకు సర్కిల్ స్థాయిలో ఆలస్యమవగా.. . తాజాగా నిర్వహణ విషయంలో తీసుకున్న నిర్ణయానికి ఆమోదం లభించడంలో జాప్యం కొనసాగుతుంది. కేపీహెచ్‌బీకాలనీ నెక్సస్‌మాల్ ఎదుట జేఎన్‌టీయూ వంతెన కింద నూతనంగా తీర్చిదిద్దిన బహుళ ప్రయోజన క్రీడా ప్రాంగణం తాజా పరిస్థితి తెలుసుకుందాం..

రూ.70లక్షలతో నిర్మాణం

నెక్సస్‌మాల్ ఎదుట జేఎన్‌టీయూ వంతెన కింద కొన్ని నెలల క్రితం బహుళ ప్రయోజన క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. ఇప్పటికే పూర్తి కాగా చాలా రోజులుగా అలంకారప్రాయంగా కనిపిస్తోంది. దీని నిర్వహణ బాధ్యత ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని నిర్ణయించినప్పటికీ.. చర్యలు తీసుకోవడంలో ఆలస్యమవుతూ వచ్చింది. సర్కిల్ అధికారులే నిర్వహించడం ద్వారా ఆదాయం సమకూరే అవకాశాలున్న నేపథ్యంలో ప్రైవేటుకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతుండడం గమనార్హం. ఇటీవల ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు టెండర్లు పిలవగా.. ఆమోదం కోసం ప్రధాన కార్యాలయానికి పంపారు. గ్రేటర్ కమిషనర్ మారిన నేపథ్యంలో కొంత ఆలస్యమవుతుందని అధికారులు వివరించారు. నెలకు రూ.లక్షగా దీని నిర్వహణ ధరను నిర్ణయించిన అధికారులు ఆ ధర కంటే ఎక్కువకు టెండర్ వేసిన వారికి అప్పగించనున్నారు.

రెండోసారైనా.. ప్రయోజనం చేకూరేనా?

రెండేళ్ల క్రితం ఈ స్థలంలో ఖరీదైన సామాన్లు నెలకొల్పి పెయిడ్ పార్కింగ్‌కు ఏర్పాట్లు చేసి ప్రైవేటు సంస్థకు అప్పగించారు. అతను మొదట అద్దె చెల్లించినా.. తర్వాత చేతులెత్తేశాడు. ఈ విషయాన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు అతని ఒప్పందాన్ని రద్దు చేసి.. చెల్లించాల్సిన సొమ్మును గ్రేటర్ ఖజానాలో జమచేయాలని ఆదేశించారు. దీంతో అతను అక్కడున్న రూ.లక్షల విలువైన సామగ్రితో మాయమయ్యాడు.



బాస్కెట్ బాల్ మైదానం

దీనిపై కథనాన్ని ప్రచురించడంతో అధికారులు తాఖీదులు ఇచ్చి ముక్కుపిండి బకాయిలు కట్టించి. . సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలాన్ని రెండోసారి రూ.70లక్షలు వెచ్చించి బహుళ క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేశారు. దీంతో మొదటిసారి పార్కింగ్ కోసం వెచ్చించిన సొమ్ము వృథా అయ్యింది. ఈ సారైనా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం కనిపిస్తుంది.

ఆమోదం రాగానే వినియోగంలోకి తెస్తాం

– శ్రీనివాస్, ఈఈ, మూసాపేట సర్కిల్

ఇప్పటికే టెండర్ల ఆమోదం కోసం ప్రధాన కార్యాలయానికి పంపాం. గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే నిర్దేశించిన ధర కంటే ఎక్కువగా టెండర్ వేసిన వారికి నిర్వహణ కోసం ప్రాంగణాన్ని అప్పగిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

మ్యాన్‌హోల్ మూత పునరుద్ధరణ



బాలానగర్, న్యూస్‌టుడే: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి వల్లభ్‌నగర్‌లో నెల రోజుల క్రితం భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూత కుంగి ప్రమాదకరంగా మారింది. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని జలమండలి హస్మత్‌పేట సెక్షన్ మేనేజర్ తేజ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేయించి మూత పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

తొలగిన అధ్వానం



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న సామగ్రిని జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించారు. బస్ షెల్టర్ల పక్కన దుకాణ సామగ్రి, వాటి మధ్య చెత్తాచెదారం పేరుకుపోయింది. అక్కడే మూత్ర విసర్జన చేస్తుండటంతో తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయాలని 'ఈనాడు' మూసాపేట సర్కిల్ ఉపకమిషనర్ రమేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి సామగ్రి, వ్యర్థాలను తొలగించారు.





పోటీ పడి.. వ్యాసం రాసి

కేపీహెచ్‌బీ ఆరోఫేజ్‌లోని సాయి ఇంగ్లిష్ హైస్కూల్‌లో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు పోటీ పడి అంతర్జాలం, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావంపై సమగ్రంగా వ్యాసం రాశారు. పదో తరగతికి చెందిన బి.రోణిత్(ప్రథమ), తొమ్మిదో తరగతి విద్యార్థిని కె.రిషీక(ద్వితీయ), పదో తరగతి విద్యార్థిని ఎ.తేజస్విని(తృతీయ) స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ జి.రమారెడ్డి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, కేపీహెచ్‌బీకాలనీ

ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా 21న

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్వాల్ ఐటీఐలో ఈనెల 21న ఉదయం 10గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య తెలిపారు. 18ఏళ్లు నిండిన యువత శిక్షణకు హాజరుకావాలని కోరారు. బీఈఎల్, టీఎస్‌ఆర్టీసీ, మేధా సర్వో డ్రైవర్స్, లింక్‌వెల్, తెసెంక్రూప్ ఇండస్ట్రీస్ ఇండియా, ఏరోస్పెస్, మెకానికల్ ప్రొడక్షన్ ఆటోమొబైల్ సర్వీస్ తదితర 20నుంచి 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ధ్రువ పత్రాలతోపాటు జిరాక్స్ సెట్, బయోడేటాతో నేరుగా అల్వాల్ ఐటీఐకి రావాలని సూచించారు. ఇతర వివరాలకు 98491 88346 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ పరిధి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన మొహమ్మద్ ఖలీం భార్యకు శనివారం రూ.60వేల సీఎం సహాయనిధి చెక్కును కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి వినాయకనగర్‌లో అందజేశారు.

డంపింగ్‌యార్డును సందర్శించిన జడ్సీ



రవాణా విభాగం సిబ్బందితో మాట్లాడుతున్న అపూర్వ్‌చౌహాన్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కైత్లాపూర్‌లోని డంపింగ్‌యార్డును శనివారం కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్‌చౌహాన్ సందర్శించారు. డంపింగ్‌యార్డులో కొన్ని నెలలుగా పడి ఉన్న పాత వాహనాలను పరిశీలించారు. వాటికి మరమ్మతులు చేయడం ద్వారా వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలన్నారు. చెత్త తరలింపులో నిర్లక్ష్యం చేయవద్దని, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ జోన్ డీసీ ఉదయ్‌కుమార్, ఏఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలపై దాడులను అరికట్టాలి



వై జంక్షన్‌లో నేతల ప్రదర్శన

మూసాపేట, న్యూస్‌టుడే: హిందూ ధర్మం తోపాటు దేవాలయాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్తు, బజరంగ్‌దళ్ సంయుక్తాధ్వర్యంలో మూసాపేట వై జంక్షన్‌లో శనివారం నిరసన ప్రదర్శనను నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ..సమాజంలోని విచ్ఛిన్నకర శక్తులపై పోరాడేందుకు అందరూ సంఘటితం కావాల్సిన అవసరం ఉందన్నారు.

ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ టీకాలు



విద్యార్థినికి టీకా వేస్తున్న నర్సు, పర్యవేక్షిస్తున్న వైద్యులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: నేషన్స్ బెనిఫిట్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సహకారంతో కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావు ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం 9నుంచి 15ఏళ్ల విద్యార్థినులకు సర్వైకల్ క్యాన్సర్ టీకాలు వేశారు. ఆర్‌పీకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 80మంది విద్యార్థినులకు ఈ టీకాలు వేశారు. పేద పిల్లల కోసం కొన్ని మాసాల క్రితం ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు శివానంద పునరావాస కేంద్రం గౌరవ కార్యదర్శులు మీరారావు, అపర్ణరావు పేర్కొన్నారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ ఎన్.యోబు, డాక్టర్ ఛాయాదేవి, భవాని, లక్ష్మీకమలాకర్ తదితరులు పర్యవేక్షించారు.

కిలోమీటరు మేర ట్రాఫిక్





వాహనాలను నియంత్రిస్తున్న ట్రాఫిక్ పోలీసు, భారీగా జామ్ అయిన ట్రాఫిక్

మూసాపేట వద్ద ఉన్న గ్యాస్ రీఫిల్లింగ్ స్టేషన్ నుంచి కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వరకు దాదాపు కిలోమీటరు మేర రెండు లైన్లుగా వాహనాలు క్యూ కట్టాయి. ఉదయాన్నే భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో విద్యార్థులు, ఉద్యోగులు తదితర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించారు.

బెల్టు షాపులపై దాడి.. 15లీటర్ల మద్యం స్వాధీనం

బాలానగర్: బెల్టు షాపులపై దాడులు చేసి ఇద్దరు నిందితులను బాలానగర్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరసింహ రాజు కథనం ప్రకారం..రాజుకాలనీలో వేర్వేరుగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న పి.లక్ష్మి(55), రమేశ్(35) ఇళ్లపై శనివారం పోలీసులు దాడి చేశారు. 15లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్టుచేశారు.

అక్షరాల పునరుద్ధరణ

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు ఉన్న ఆంగ్ల అక్షరాలను ఎట్టకేలకు సరిదిద్దారు. ఇక్కడ ఊడిపోయి అర్థవంతంగా లేని అక్షరాలపై ఈ నెల 16న 'పట్టించుకోండి సార్లు' శీర్షికన ప్రచురించిన చిత్ర వార్తకు అధికారులు స్పందించి పునరుద్ధరించారు.

ముడి సరకు విక్రయం



జోనల్ కార్యాలయంలో ఇనుమును స్వాధీనం చేసుకున్న సిబ్బంది

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోన్, మూసాపేట, కూకట్‌పల్లి సర్కిళ్ల కార్యాలయాల ఆవరణలోని ముడి సరుకు విక్రయానికి టెండర్ పిలిచారు. ఇప్పటికే టెండర్ దక్కించుకున్న వ్యక్తి ఇనుము, కాగితాలు, చెక్కలు తదితరాలను సేకరించే పనిలో ఉన్నాడు. చాలాకాలంగా ముడిసరుకు కార్యాలయాల ఆవరణలో వృథాగా పడి ఉంది. దీన్ని కిలోల లెక్కల విక్రయిస్తున్నామని, వచ్చిన సొమ్ము గ్రేటర్ ఖజానాలో జమ చేస్తామని కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్ చెప్పారు.

జీవ వైవిధ్యంతోనే మానవాళి మనుగడ



సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జీవ వైవిధ్య పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని విశ్రాంత ఐఎఫ్‌ఎస్ అధికారి మోహన్‌చంద్ర పర్గెయిన్ అన్నారు. శనివారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్(సీజీఆర్), ఉన్నత విద్యా శాఖ, జేఎన్‌టీయూ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో వర్సిటీ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో 'జీవ వైవిధ్యం- వాతావరణ మార్పులు' అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జంతువులు, అడవుల సంరక్షణతోనే వాతావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. పర్యావరణవేత్తలు ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి, డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, సీజీఆర్ అధ్యక్షుడు లీల లక్ష్మారెడ్డి, జేఎన్‌టీయూ సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ టి.విజయలక్ష్మి మాట్లాడుతూ కాలుష్యం నుంచి వాతావరణాన్ని, నీటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ జగన్, కన్వీనర్లు డాక్టర్ ప్రియకుమారి, శైలజ, అన్ని షెరాన్, డాక్టర్ ఎం.వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కళింగలో 'సిండ్రెల్లా' డిజైనర్ వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సతీమణి పద్మావతి అన్నారు. బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాలులో శనివారం ఏర్పాటైన సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ప్రదర్శన నిర్వాహకులు జ్యోతి చలసాని మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో 50 వేల రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేశ్ సోదరి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

108 సూర్యనమస్కారాల పోటీలు



యోగా విన్యాసాల పోటీల్లో అభ్యాసకులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: విశ్వ మానవత సంస్థ ఆధ్వర్యంలో శనివారం మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకొని జేఎన్‌టీయూలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి జన్మదినం, సంస్థ 33వ వార్షికోత్సవం సందర్భంగా 108 సూర్యనమస్కారాల పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులకు వ్యక్తిత్వంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. రక్తదానం శిబిరంలో 20మంది రక్తదానం చేశారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న, రక్తదానం చేసిన వారికి సంస్థ అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి పతకాలు, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు శ్రీకారం

మూసాపేట: కూకట్‌పల్లి స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్ సముదాయంలో నూతనంగా నిర్మించిన సిద్ధి వినాయక ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఆరంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ, యాగశాల ఏర్పాటు, కలష స్థాపన వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కాలనీకి చెందిన మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు.



వేడుకకు హాజరైన మహిళలు

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి •పటాన్‌చెరు

గౌతమి ఎక్స్‌ప్రెస్ మూడు గంటల ఆలస్యం..

రెజిమెంటల్‌బజార్: లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ మీదుగా బయలుదేరుతున్న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం మూడు గంటలు ఆలస్యమైంది. ప్రతి సారి ఈ రైలు ఆలస్యం అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగానే ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు. ముంబయ్ నుంచి బయలుదేరి సికింద్రాబాద్‌కు వచ్చే దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగి లింగంపల్లి నుంచి రోజూ కాకినాడ పోర్ట్‌కు గౌతమి ఎక్స్‌ప్రెస్‌గా బయలుదేరి వెళ్తుంది. ఈ రైలు అక్కడ నుంచి వచ్చేందుకు లేదా ఇతర కారణాలతో ఆలస్యమవుతోంది. రోజూ లింగంపల్లి నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి సికింద్రాబాద్‌కు 9.05 నిమిషాలకు చేరుకుంటుంది. సికింద్రాబాద్ నుంచి 9.15 గంటలకు తిరిగి బయలుదేరుతుంది. శనివారం రాత్రి 3.15 గంటల ఆలస్యంగా 12.30 గంటలకు బయలుదేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు.


అందెల రవళి.. నృత్యకేళి



శిల్పారామంలో శనివారం సాయంత్రం కళాకారులు చూడముచ్చటైన కూచిపూడి నృత్యప్రదర్శనతో కళాప్రియులను అలరించారు. నాట్యగురువు ముంగర శ్రీదేవి శిష్య బృందం చక్కటి హావభావాలతో లయాత్మకంగా నృత్యం చేసిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా వారు ప్రదర్శించిన గిరిజ కల్యాణం, అమృతవర్షిణి, గురుఅష్టకం తదితర అంశాలు కనువిందుగా సాగాయి.

–న్యూస్‌టుడే, మాదాపూర్

అమ్మ లోగిలి.. సుందర కూడలి



ఐటీ క్షేత్రాలు, నగరానికి మధ్య వారధిగా నిలిచే ఖాజాగూడ చౌరస్తాను జీహెచ్ఎంసీ అధికారులు ఆకర్షణీయంగా తీర్చిద్దుతున్నారు. వరద, మురుగునీటి పైపులైన్‌ల ఛాంబర్‌తో అసహ్యంగా ఉండే కూడలి పక్కన ఉన్న ప్రదేశంపై పైకప్పులు ఏర్పాటు చేయడమేకాక.. ఆ ప్రాంతానికి సుందరంగా అభివృద్ధి చేశారు. ఆ ఛాంబర్‌ను ట్రాఫిక్ ఐలాండ్‌గా మార్చి వివిధ ఆకృతులతో సుందరీకరిస్తున్నారు. తల్లి రక్షణలో బిడ్డ సేద తీరుతున్నట్లు ఉన్న బొమ్మలను ఏర్పాటు చేయడంతోపాటు బొమ్మల వెనుక ఆకట్టుకునే సిమెంట్, కాంక్రీట్ ఫలకాలతో ఆ ట్రాఫిక్ ఐలాండ్‌ను సుందరీకరించారు. గోడ వెనుక ఉన్న స్థలాన్నీ పచ్చదనంతో కళకళలాడేలా ల్యాండ్ స్కేప్‌నూ అభివృద్ధి పరిచారు. దీంతో కూడలి సరికొత్తగా కనిపిస్తోంది. –న్యూస్‌టుడే, రాయదుర్గం

స్ఫూర్తి రగలాలి.. కీర్తి పెంచాలి



గచ్చిబౌలి స్టేడియం కొత్త కళను సంతరించుకుంటుంది. చూపరులను ఆకట్టుకునేలా స్టేడియాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు స్ఫూర్తి కలిగిస్తూ, ముఖద్వారం వద్ద ఆటలు ఆడుతున్న క్రీడాకారుల బొమ్మలు ఏర్పాటు చేశారు. క్రికెట్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, రన్నింగ్ ఇలా వివిధ ఆటలను ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేసిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. –న్యూస్‌టుడే, గచ్చిబౌలి

నిరుపేదలకు గృహ వసతి కల్పనకు చర్యలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కులదీప్ నారాయణన్

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: అర్హులైన నిరుపేద కుటుంబాలకు గృహవసతి కల్పించే విధంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గృహ, పట్టణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాయింట్ డైరెక్టర్ కులదీప్ నారాయణన్ అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూరులోని రెండు పడక గదుల గృహ సముదాయాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ గౌతమ్‌తో కలిసి సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిర్మించిన రెండు పడక గదుల నిర్మాణ పనులకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. లబ్ధిదారులను ఎంపిక చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదని చెప్పారు.ఒకే ప్రాంగణంలో అన్ని రకాల సదుపాయాలతో నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి ఉన్నారు.


'కలెక్టరేట్‌ను రాజేంద్రనగర్‌కు తరలించే యోచన'

చేవెళ్ల: కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా రాజేంద్రనగర్‌కు మార్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. బీజాపూర్ రహదారి విస్తరణ పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు.

సంఘ్ పరివార్ శ్రేణుల ధర్నా

రాయదుర్గం, న్యూస్‌టుడే: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో ఇటీవల జరిగిన ఘటనను వ్యతిరేకిస్తూ విశ్వ హిందూపరిషత్ ఆధ్వర్యంలో రాయదుర్గంలో సంఘ్ పరివార్ శ్రేణులు శనివారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఘటనపై సిట్ ద్వారా సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యానర్‌లు పట్టుకుని బస్తీలో నిరసన ర్యాలీ చేపట్టారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం..



ఆకట్టుకుంటున్న మల్కం చెరువు పరిసరాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: నాలుగేళ్ల క్రితం వరకు కలుషిత జలాలతో అసహ్యంగా నిలిచిన తటాకం అది.. ఐటీ క్షేత్రాల చెంత ఉండడంతో అధికారులు సుందరీకరణ చేపట్టడంతో రూపురేఖలే మారిపోయాయి.. నాడు తటాకం చెంత నిల్చోలేక పోయేవారు.. నేడు సరికొత్త అందాలతో అలరారుతుండడంతో సందర్శకులతో తటాకం పరిసరాలు కోలాహలంగా మారాయి. రాయదుర్గం మల్కం చెరువు హరితవనంగా వెలుగొందుతోంది.

పచ్చదనంతో కళకళ..

కలుషిత జలాలతో దుర్గంధభరితంగా మారిన తటాకాన్ని జీహెచ్ఎంసీ అధికారులు ఓ ప్రైవేటు సంస్థ సహకారంతో సీఎస్ఆర్ కార్యక్రమం కింద తటాకాన్ని అభివృద్ధిపరిచారు. తటాకం చుట్టూ రెండు కిలోమీటర్ల పొడవునా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించారు. ◆ తటాకం పరిసరాల్లోకి అడుగు పెట్టగానే అనేక రకాల పచ్చని మొక్కలు, వివిధ పూల మొక్కలూ స్వాగతం పలుకుతాయి. హరిత ఆర్చీలతో తీర్చిదిద్దినట్లు వాకింగ్ ట్రాక్ ఆకట్టుకుంటోంది. ◆ పచ్చదనం మధ్య ఆకట్టుకునేలా ఓపెన్ ఆడిటోరియం ఏర్పాటు చేశారు. ◆ ఆటపరికరాలతో చిన్నారుల వినోద కేంద్రాన్నీ అందుబాటులోకి తెచ్చారు.

యోగా, వాకింగ్..

- సందర్శకులు వచ్చి కూర్చొని యోగా, ధ్యానం చేసుకునేందుకు, ఇటు కుటుంబాలతో కలిసి సేద తీరేందుకు తగిన కుర్చీలు, పచ్చిక బయలు ఏర్పాటు చేశారు.
- రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వందల మంది సందర్శకులు తరలివస్తుండడంతో తటాకం కోలాహలంగా మారుతోంది.
- ఉదయం మాత్రం రాయదుర్గంతోపాటు షేక్‌పేట, ఖాజాగూడ, గచ్చిబౌలి, మణికొండ ప్రాంతాల నుంచి వాకర్స్ పెద్ద సంఖ్యలో చేరుకుని నడక సాగిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు ఓపెన్ జిమ్ కూడా ఏర్పాటు చేశారు. తటాకం ప్రవేశ ద్వారం ముందు ప్రాంగణాన్ని పచ్చదనంతో రమణీయంగా రూపొందించారు. రోజురోజుకూ సందర్శకుల సంఖ్య పెరిగిపోతోంది.



బాలల వినోద కేంద్రంలో చిన్నారుల సందడి



తటాకం పరిసరాల్లో పచ్చదనం



మియాపూర్‌లో శుక్రవారం మెట్రో స్టేషన్ సమీపంలో కనిపించింది చిరుత కాదని అటవీశాఖ అధికారులు స్పష్టంచేశారు. అది సంచరించిన ప్రాంతంలో పాదముద్రలు పరిశీలించి అవి అడవి పిల్లివి అని శంషాబాద్ జోన్ ఎఫ్‌డీవో విజయానంద్‌రావు ధ్రువీకరించారు. – న్యూస్‌టుడే, మియాపూర్

జాతీయ రహదారిపై కారు దగ్ధం



మియాపూర్: మియాపూర్‌లో శనివారం రాత్రి జాతీయ రహదారిపై మెట్రో స్టేషన్ వద్ద కారు దగ్ధమైంది. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కుల్చారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వారి కారులో మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వైపు వెళుతుండగా మెట్రో స్టేషన్ సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో మంటలు అంటుకున్నట్లు గుర్తించారు. వెంటనే కారు దిగిపోయారు. మంటలు వ్యాపించి కారు దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పి వేశారు. ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మియాపూర్ నుంచి కూకట్‌పల్లి వైపు సుమారు కిలోమీటరుకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ప్రణాళికాబద్ధంగా చదివితేనే సత్ఫలితాలు



మాట్లాడుతున్న ప్రొ.జహంగీర్

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రణాళికబద్ధంగా చదువులు సాగిస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారని ఉస్మానియా విశ్వవిద్యాలయ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాధిపతి ప్రొ.వై.జహంగీర్ అన్నారు. గోపన్‌పల్లి సెయింట్ జేవియర్ పీజీ కళాశాలలో శనివారం ఎంబీఏ ఫ్రెషర్స్ విద్యార్థుల అవగాహన కార్యక్రమం (ఒరియంటేషన్ ప్రోగ్రామ్) నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ కె.సుధీర్, ప్రిన్సిపల్ ప్రొ.టి.రవి, కీర్తి గుప్తా, డా.డి.శ్రీలత, కె.శ్వేత, కె.భారతి పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్ లీల



వ్యాసం రాస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి కిష్టారెడ్డిపేట గ్రామం సాయి టెక్నో స్కూల్ ప్రాంగణంలో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలు ఉత్సాహంగా సాగాయి. 'ఇంటర్నెట్ వినియోగం, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8,9,10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన ముగ్గురు విద్యార్థులు జయశ్రీ మైత్రి, శీతల్, మానసకు ప్రిన్సిపల్ లీల బహుమతులు అందజేశారు.

కళాభిమానులకు కనువిందు





మాదాపూర్: నగరానికి చెందిన చిత్రకారులు లెస్టర్ అంథోనిపాల్, గ్లోవర్ పాల్ గీసిన అందమైన చిత్రాలు శనివారం మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో కొలువుదీరాయి. హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు ఎం.వి.రమణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ ప్రదర్శనను ప్రారంభించారు. చిత్రకారులు తమ ఆలోచనలకు అద్దంపడుతూ కాన్వాస్‌పై ఆవిష్కరించిన రంగురంగుల బొమ్మలు, మలిచిన శిల్పాలు కళాభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శన ఈనెల 28 వరకు కొనసాగనుంది.

సీసీరోడ్డు నిర్మాణం

స్పందనకు వందనం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కాలనీ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో మూడేళ్లుగా రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ సమస్యపై 'న్యూస్‌టుడే' వరుస కథనాలు రాస్తూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళింది. స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు సీసీరోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ట్రస్మా ప్రధాన కార్యదర్శికి సన్మానం



చందానగర్: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చందానగర్‌కు చెందిన అనిల్‌కుమార్‌ను అభినందించారు. హుడాకాలనీ విద్యావాణి హైస్కూల్‌లో మండల ప్రైవేట్ పాఠశాల సంక్షేమ సంఘం సభ్యులు అనిల్‌ను సత్కరించారు. కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శంకర్, కోశాధికారి రెహమాన్, ముఖ్యసలహాదారుడు భీష్మారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నృత్యార్పణం



గచ్చిబౌలి, న్యూస్‌టుడే: ప్రవాస నర్తకి విశిష్ట డోంగరి 'నృత్యార్పణం' పేరిట ప్రదర్శించిన భరతనాట్యం నేత్రపర్వంగా సాగింది. ఆంగికాభినయం, కరణాలతో ఎంతో ఉత్సాహంగా ఆమె ప్రదర్శించిన నృత్యాంశాలు నాట్యప్రియులను ఆకట్టుకున్నాయి. ముంబాయికి చెందిన నృత్యోదయ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ ఆడిటోరియంలో అమెరికా నుంచి విచ్చేసిన హైదరాబాద్‌కు చెందిన విశిష్ట డోంగరి భరతనాట్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. నాట్యగురువు డా.జయశ్రీరాజగోపాలన్ శిష్యురాలైన విశిష్ట చక్కటి నృత్యాభినయంతో ఆకట్టుకున్నారు. ఆధ్యాత్మికవేత్త త్రిదండి చినజీయర్ స్వామి విచ్చేసి నృత్యకారిణిని అభినందించారు. నాట్యగురువు డా.పద్మాసుబ్రహ్మణ్యం, కళారత్న అశోక్ గుర్జాలే హాజరై విశిష్టను సత్కరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్య

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు, కడుపు నొప్పి కారణాలతో ప్రైవేటు ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామం ఆర్‌కే నగర్‌లో ఉంటున్న ప్రకాష్(25) ప్రైవేటు ఉద్యోగి. కొంతకాలంగా కడుపునొప్పి రావడంతో ఇబ్బంది పడేవాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పవిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తెల్లాపూర్‌లో రెండు క్లినిక్‌ల సీజ్

రామచంద్రాపురం రూరల్: తెల్లాపూర్‌లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న వంశీ క్లినిక్‌ను రామచంద్రాపురం వైద్యాధికారి నేత్రావతి శనివారం సీజ్ చేశారు. బండ్లగూడ గ్రామంలో కుమారైకు బదులుగా తండ్రి ఆరతి ఆయుర్వేద క్లినిక్‌ను నిర్వహిస్తుండగా తనిఖీ చేసిన వైద్యాధికారి సీజ్ చేశారు. మల్లికార్జున్ నగర్‌లో 4 క్లినిక్‌లను తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా క్లినిక్ నిర్వహిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.

కళింగ డిజైనర్ వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రాలకు ఎంతో ప్రత్యేకత ఉందని ప్రముఖ సినీ నిర్మాత బెల్లంకొండ సురేష్ సతీమణి పద్మావతి అన్నారు. బంజారాహిల్స్‌లోని కళింగ కల్చరల్ హాలులో శనివారం ఏర్పాటైన సిండ్రెల్లా డిజైనర్ వస్త్ర ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ప్రదర్శన నిర్వాహకులు జ్యోతి చలసాని మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో 50 వేల రకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేశ్ సోదరి నాగలక్ష్మి పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ ఎంపిక నవంబర్ 24న

చందానగర్, న్యూస్‌టుడే: నవంబరు 24న చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరగనుంది. శనివారం చందానగర్ హుడాకాలనీలో మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నూనె సురేందర్, కోశాధికారి స్వాతి, కమిటీ సభ్యులు సమావేశమయ్యారు. జనవరిలో జరిగే మాస్టర్స్ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించేందుకు ఎంపిక అనంతరం వారికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు కమిటీ సభ్యులు ప్రకటనలో పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు: నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమీన్‌పూర్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో వెంకటేష్ అనే వ్యక్తి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేసి 10 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.

కుత్బుల్లాపూర్

మానవ అక్రమ రవాణాపై అవగాహనకు నిశబ్ద నడక

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేందుకు అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ఏ21 'గ్లోబల్ వాక్ ఫర్ ఫ్రీడమ్' నిశబ్ద నడక పేరుతో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ నడకను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు బృందాకర్ రావు ప్రారంభించారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడ సెయింట్ మేరీస్ కాలేజ్, వైఎంసీఏ సికింద్రాబాద్‌తో కలిసి కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లో 300 మందికిపైగా పౌరులు పాల్గొనగా.. దేశవ్యాప్తంగా 100 పైగా స్థానాల్లో 30 వేలకు పైగా ఈ నడకలో పాల్గొన్నారని తెలిపారు. పలు కళాశాలల విద్యార్థులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఏసీపీ ఆంజనేయులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీతా గోపాల్‌దాస్, వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ లియోనార్డ్ మైరన్ పాల్గొన్నారు.

అల్వాల్ ఐటీఐలో ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా 21న

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్వాల్ ఐటీఐలో ఈనెల 21న ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాను నిర్వహిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత శిక్షణకు హాజరుకావాలని కోరారు. బీఈఎల్, టీఎస్ ఆర్టీసీ, మేధా సర్వో డ్రైవర్స్, లింక్‌వెల్, తెసెంక్రూప్ ఇండస్ట్రీస్ ఇండియా, ఏరోస్పేస్, మెకానికల్ ప్రొడక్షన్ ఆటోమొబైల్ సర్వీస్ తదితర 20 నుంచి 40 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని వివరించారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ ధ్రువ పత్రాలతోపాటు జిరాక్స్ సెట్, బయోడేటాతో నేరుగా అల్వాల్ ఐటీఐకి రావాలని సూచించారు. ఇతర వివరాలకు 9849188346 నంబర్‌ను సంప్రదించాలని వెల్లడించారు.

సేవాభావం అలవర్చుకోవటం అభినందనీయం



విద్యార్థి కుటుంబ సభ్యులకు రూ. 6 లక్షల నగదు అందజేస్తున్న ఎంఈఓ జెమిని, పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపల్ నాగభూషణం

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాభావం అలవర్చుకోవటం అభినందనీయమని కుత్బుల్లాపూర్ మండల విద్యాశాఖాధికారి జెమిని అన్నారు. గణేశ్‌నగర్‌కు చెందిన సుమన్, స్వప్న దంపతుల కుమారుడు యశ్వీర్(7) సూర్యానగర్‌లోని యూనిక్ హైస్కూల్‌లో రెండో తరగతి చదువుతున్నాడు. కొంతకాలంగా అతడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. పేద కుటుంబం కావడంతో చికిత్స చేయించుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి రూ.6 లక్షలు జమ చేశారు. డబ్బును విద్యార్థి కుటుంబ సభ్యులకు శనివారం పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం విద్యార్థిని ఆదుకోవడం హర్షణీయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ శివయ్య, ప్రిన్సిపల్ నాగభూషణం, ఎంఎల్ఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల కుప్పలు.. ప్రజలకు ఇబ్బందులు



శ్రీదుర్గాఎస్టేట్స్ కాలనీలో ..



వసుధ అపార్టుమెంట్ పక్కన..

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన మట్టి కుప్పలు, భవన నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి. స్థానికులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

ఎక్కడెక్కడంటే...

ఇళ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి యజమానులు మట్టి, వ్యర్థాలను తరలించాలి. కానీ వారు వాటిని తరలించడంలేదు. శ్రీదుర్గా ఎస్టేట్స్ కాలనీ దుర్గామాత ఆలయం నుంచి కాలనీకి వెళ్లే దారిలో మూడు చోట్ల వ్యర్థాలు పేరుకుపోయాయి. వసుధ అపార్టుమెంట్ నుంచి వసంత్‌విహార్ కాలనీకి వెళ్లే దారి పక్కనే వ్యర్థాల కుప్పలున్నాయి. వసంత్‌విహార్ కాలనీలో అపార్టుమెంట్లను అనుకుని వ్యర్థాలు పారబోస్తుండడం వల్ల వాటిలో పిచ్చి మొక్కలు పెరిగి క్రిమికీటకాలకు నిలయంగా మారాయి. అయోధ్యగనగర్ నుంచి వినాయకనగర్‌కు వెళ్లే రోడ్డు పక్కన మట్టి కుప్పలున్నాయి. రాత్రి వేళల్లో అవి బయట తిరుగుతుండడం వల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

స్పెషల్ డ్రైవ్‌పైనే ఆశలు

– మధుసూదన్, శ్రీదుర్గాఎస్టేట్స్ కాలనీ, సంక్షేమ సంఘం నాయకుడు

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో అధికారులు ఈ నెల 23 నుంచి 29 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మట్టి కుప్పలు, భవన నిర్మాణ వ్యర్థాలను తరలిస్తారని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, దుండిగల్, నిజాంపేట, న్యూస్‌టుడే:

? నర్సాపూర్ ప్రధాన రహదారి సూరారంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు విభాగిని పక్కన చెత్త వేస్తున్నారు. దుర్గంధం వెలువడుతోంది. స్థానికులు, ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.
–ఇంద్రకరణ్‌రెడ్డి, సూరారం

✓ సిబ్బందిని పంపించి అక్కడి నుంచి చెత్తను తరలింపజేస్తాం. మళ్లీ చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. –మమత, వైద్యాధికారిణి

? గండిమైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిలో బౌరంపేట అటవీ ప్రాంతం వద్ద వీధి దీపాలు లేవు. రాత్రి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – సునీల్, స్థానికుడు

✓ అటవీశాఖ అధికారుల అనుమతుల్లో జాప్యం కారణంగా ఆ ప్రాంతంలో రహదారి విస్తరణ చేపట్టలేదు. వీధి దీపాలను ఏర్పాటు చేయడం సాధ్యం కాలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తాం.
– సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

? ప్రగతినగర్ పరిధిలోని అనేక చోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పాదచారులు బయటకు రావడానికి భయపడుతున్నారు.
–తుమ్మల సాయిపూజిత, నిజాంపేట

✓ కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం వీధిదీపాల నిర్వహణ వ్యవస్థను ప్రైవేటు సంస్థకు గతంలో అప్పగించాం. ప్రస్తుతం వారు నిర్వహణ బాధ్యతల విషయంలో చేతులెత్తేశారు. వారి నుంచి నగర పాలక సంస్థ బాధ్యతలు చేపట్టడానికి వారి అనుమతులు రద్దు చేయాల్సి ఉంటుంది. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి లేఖ రాశాం. అనుమతి రాగానే వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను చేపడుతాం. –సత్యనారాయణ, ఈఈ, నిజాంపేట



తవ్వారు.. వదిలేశారు

జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో నాయకి స్కూల్‌కు వెళ్లే దారిలో ఇటీవల మురుగు సమస్య తలెత్తింది. సమస్యను పరిష్కరించేందుకు రహదారిపై తవ్వకాలు చేపట్టి మట్టిని రోడ్డుపైనే పోశారు. రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. –న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్

ఇంకుడు గుంతల పునరుద్ధరణ



పూడిక తొలగించిన తర్వాత ఇలా..

ఈనాడు కథనానికి స్పందన

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో మట్టిలో కూడుకుపోయి కనుమరుగైన ఇంకుడు గుంతలను అధికారులు పునరుద్ధరించారు. 'నిర్వహణ కరవు.. ఇంకుడుగుంతలు కనుమరుగు' శీర్షికన ఈ నెల 16న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సర్కిల్ ఉప కమిషనర్ నర్సింహ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు సర్కిల్ ఏఈ మల్లారెడ్డి సిబ్బందితో ఇంకుడు గుంతల్లో పేరుకుపోయిన పూడికను తొలగింపజేశారు.

నత్తనడక పనులు.. ప్రయాణికుల అవస్థలు



గాజులరామారం కూడలిలో విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెల రోజుల క్రితం ఇరుకు రోడ్డులో నాలుగు వైపులా తవ్వారు. విద్యుత్తు స్తంభాలను తొలగించలేదు. దుకాణాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. వ్యాపారులు, వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. –న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

భిన్నత్వమే సృష్టి రహస్యం : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : భారతీయులు ఆదర్శమైన వసుధైక కుటుంబాన్ని సాధించడంలో ఐక్యత ముఖ్యమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సాలార్‌జంగ్ మ్యూజియంలో న్యూరోడైవర్స్ (బుద్ధిమాంద్యం) కళాకారుల కళాకృతుల ప్రదర్శనను శనివారం గవర్నర్ ప్రారంభించారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియం సహకారంతో "భిన్న స్వరాలు అవధుల్లేని కళ" పేరుతో జరుగుతున్న ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బుద్ధిమాంద్యం ఉన్న కళాకారులకు చెందిన సుమారు 100 చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. గవర్నర్ మాట్లాడుతూ.. భిన్నత్వం సృష్టి రహస్యమనీ, ఏకరూపత ఏ రంగంలోనూ ఆమోదయోగ్యం కాదన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు కంప్యూటర్, పేపర్ ప్లేట్ల తయారీలో శిక్షణ

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ట్రాన్స్‌జెండర్లకు కంప్యూటర్, పేపర్ ప్లేట్ల తయారీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. సుభాష్‌నగర్ డివిజన్ సూరారం కాలనీలోని ఓం జెండా వద్దనున్న ఎన్టీఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 21న శిక్షణ కేంద్రాన్ని మేడ్చల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ప్రారంభించనున్నారు. ఆసక్తి ఉన్న ట్రాన్స్‌జెండర్స్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని సూచించారు. మరిన్ని వివరాలకు 77298 69207 నంబర్ సంప్రదించాలని సూచించారు.

విలీన సభ విజయవంతానికి పిలుపు

పేట్‌బషీరాబాద్: ఐఎఫ్‌టీయూ టీయూసీఐలో విలీనమవుతున్న సందర్భంగా ఈ నెల 20న సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించతలపెట్టిన విలీన సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రగతిశీల ఆటో అండ్ మోటారు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రవీణ్ ఒక ప్రకటనలో కోరారు. ఐఎఫ్‌టీయూ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కార్మికుడి హఠాన్మరణం

జీడిమెట్ల,న్యూస్‌టుడే: విధుల్లో ఉండగా గుండెపోటుతో కార్మికుడు మృతి చెందాడు. జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన మణుగిరి(36) ఉపాధి కోసం వలస వచ్చి గాజులరామారం వివేకానందనగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం విధులకు వెళ్లాడు. శనివారం ఉదయం ఉన్నట్టుండి కుప్పకూలాడు. తోటి కార్మికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



ఖిరోశీలి

జీడిమెట్ల,న్యూస్‌టుడే: వృద్ధురాలు అదృశ్యమైంది. కుటుంబీకులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. చింతల్ మారుతీనగర్‌కి చెందిన ఖిరోశీలి(70) కుటుంబీకులతో కలిసి ఇంట్లో ఉంటోంది. గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికారు. కానీ ఆచూకీ లభించలేదు.

'మానసిక ధైర్యమే అసలైన మందు'

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: మానసిక ధైర్యంతోనే ఎంతటి వ్యాధినైనా ధైర్యంగా ఎదుర్కొనవచ్చని సినీ నటి సోనాలి బింద్రే అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని జీవీకె హెల్త్ హబ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఫిక్కీ సంస్థ మాజీ ఛైర్‌పర్సన్ పింకీరెడ్డి, డాక్టర్ స్నేహ సాగర్‌తో కలిసి సోనాలి బింద్రే చర్చావేదికలో పాల్గొని క్యాన్సర్ వ్యాధి విషయంలో తన స్వీయ అనుభవాలను ఆమె పంచుకున్నారు. వ్యాధితోపాటు వచ్చే శారీరక, మానసిక సవాళ్లపై ప్రతి రోగి దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. క్యాన్సర్ మానసికంగా మనల్ని ఎంతో ప్రభావితం చేస్తుంది, అయితే నేను మానసిక ధైర్యంతో ఉండటంతోనే దీనిని జయించానని అన్నారు. తన కుటుంబం, స్నేహితులు తనకు ఎంతో అండగా నిలిచారన్నారు. ధ్యానం చేయడంతోపాటు క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన వారి చిన్నచిన్న విజయాలను గమనిస్తుండేదానినని అన్నారు. ముందుగా పరీక్షించుకోవడం అనేది మనకు ఉపయోగపడే పెద్ద ఆయుధమని ఆమె అన్నారు. పింకీరెడ్డి మాట్లాడుతూ.. మహిళ కుటుంబ వ్యవస్థకు, ఆర్థిక ప్రగతికి, సమాజానికి ఎంతో మూలమని, అలాంటి మహిళలకు సరైన సమయంలో వైద్య పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. డాక్టర్ స్నేహ సాగర్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ విషయంలో అపోహలు వద్దని, అనుమానం ఉంటే స్క్రీనింగ్ చేయించుకోవాలన్నారు. సినీనటి నమ్రతా శిరోద్కర్, వైద్యులు పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత

గుంతకల్లు: బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించినట్లు గుంతకల్లు ఆర్పీఎఫ్ సీఐ వసంత రావు తెలిపారు. హైదరాబాదుకు చెందిన నర్సింగ్ కుమారుడు మనీశ్ (14) ఇంటి నుంచి పారిపోయి రైలులో వెళ్లినట్లు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఫోటో ఆధారంగా గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో గుర్తించారు. హైదరాబాదు పోలీసుల ద్వారా బాలుడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపు



బహుమతి అందజేస్తున్న భాజపా జిలా కన్వీనర్ మల్లారెడ్డి, భాగ్యరెడ్డి తదితరులు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: క్రీడలతో ఆత్మవిశ్వాసనం పెంపొందుతుందని భాజపా మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. జీడిమెట్ల గ్రామంలోని ఎంవీరావు క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమాన్ క్రికెట్ మైదానంలో శనివారం నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రముఖ వాలీబాల్ క్రీడాకారిణి భాగ్యరెడ్డి, ఎంవీరావు, కుమార్, శ్యామ్, విజయ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి చేయాలి

దుండిగల్: భాజపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. శనివారం బహదూర్‌పల్లిలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. స్థానిక ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఆయన సమక్షంలో భాజపాలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పని చేసేవారికి గుర్తింపు లభిస్తుందన్నారు. సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. రాష్ట్ర భాజపా కార్యదర్శి కొల్లి మాధవి, దుండిగల్ పురపాలిక భాజపా అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, నాయకులు శ్యామ్‌రావు, విజయ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా కమిషన్ సభ్యురాలికి సన్మానం



జ్యోత్స్న శివారెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

కొంపల్లి (పేట్‌బషీరాబాద్): కొంపల్లికి చెందిన వార్డు సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివారెడ్డి విద్యా కమిషన్ సభ్యురాలిగా నియమితులైన నేపథ్యంలో పార్టీ నేతలు శనివారం కొంపల్లిలోని ఆమె నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోత్స్న శివారెడ్డి మాట్లాడుతూ విద్యా కమిషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మేడ్చల్ జిల్లా టీపీసీసీ లేబర్ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన కందాడి సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ నేతలు సత్కరించారు. కార్యక్రమంలో కొంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవ, ఎ-బ్లాక్ అధ్యక్షురాలు రేణుక, నేతలు గోపాల్‌రెడ్డి, అశోక్, గోపాల్ పాల్గొన్నారు.

కులాల లెక్కలు తీయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఏసురత్నం

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం కుల గణనకు జీవో విడుదల చేసిన నేపథ్యంలో వెంటనే కులాల లెక్కలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. శనివారం జగద్గిరిగుట్టలోని డీపీహెచ్‌ఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల గణన పూర్తయితే ఎస్సీలకు ఉద్యోగాల్లో, రాజకీయాల్లో రిజర్వేషన్లు, బడ్జెట్‌లో కేటాయింపులు సాధ్యమవుతాయన్నారు. సమావేశంలో డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు కత్తుల దుర్గయ్య, కార్యదర్శి కె.వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాములు, హరినాథరావు వెంకట్, ఇమాం, సోమనాథ్ పాల్గొన్నారు.

'భవనాలకు తాళాలు వేయడంతో స్పందించిన ప్రభుత్వం'

ఖైరతాబాద్: గురుకుల హాస్టల్ భవనాలకు యజమానులు తాళాలు వేయడంతోనే ప్రభుత్వం స్పందించిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం పేర్కొంది. కొన్ని నెలల అద్దె చెల్లించడంతో పాటు మిగతా సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తొలగించామని సంఘం అధ్యక్షుడు ఎ.దేవేందర్‌రెడ్డి, గౌరవ సలహాదారు డా.కొండా దేవయ్య పటేల్ శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలిపారు. బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహంతో తాళాలు తీయకపోతే కేసులు పెట్టాలన్నారని, కొన్ని చోట్ల కేసులు నమోదు చేయడంపై శనివారం ఉదయం మంత్రిని కలిసి ఎత్తేయాలని కోరగా సానుకూలత వ్యక్తం చేశారన్నారు. కొంత మేర అద్దెలు చెల్లించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, మిగతా సమస్యలపై వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు.

తెలిసినవారే.. కాలయములు

శివార్లలో అఘాయిత్యాలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: సూరారం దయానంద్‌నగర్‌కు చెందిన తిరుపతి(31).. జీవనజ్యోతినగర్‌కు చెందిన ఓ కుటుంబంతో చనువుగా ఉండేవాడు. ఆ ఇంట్లోని వివాహితపై కన్నేశాడు. ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తిని, ఆమె ఇద్దరు కుమార్తెలను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. దసరా రోజున ఆమె ఏడేళ్ల కూతురును ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని మేడ్చల్ బాసరేగడి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు కోసి మృతదేహాన్ని సంచిలో కుక్కి విసిరేశాడు. సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులకు చిక్కాడు.



● అయోధ్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో అద్దెకు ఉంటున్న పదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించి జైలు పాలయ్యాడు.

● సూరారం కాలనీలో ఓ వ్యక్తి వరసకు సోదరి అయ్యే బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

● దుండిగల్‌లో ఓ వ్యక్తి తనతో సహజీవనం చేస్తున్న మహిళ కుమార్తె(12)పై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక గర్భం దాల్చగా.. గర్భస్రావం చేయించాడు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

● కైసర్‌నగర్‌కు చెందిన వృద్ధుడు తొమ్మిదేళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించి కటకటాల పాలయ్యాడు. ఇలా ఇరుగు పొరుగున ఉండే వారే కొందరు చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

జీడిమెట్ల, ఎస్వీ కోఆపరేటివ్, గాంధీనగర్, రంగారెడ్డినగర్, కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాంతాల్లోని పరిశ్రమల్లో వివిధ రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారు పనిచేస్తున్నారు. వలస వచ్చిన వారిలో భార్యాభర్తలు పనిచేస్తుంటారు. వారి పిల్లలను ఇళ్ల వద్దే ఉంచుతారు. ఇరుగు పొరుగున ఉండే పరిచయస్థులు చిన్నారులపై లైంగిక దాడులకు పాల్పడుతున్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

–శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ, మేడ్చల్



పిల్లల విషయంలో తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. సంబంధాలు కలుపుకొని ఇంటికి వచ్చే వారిపై కన్నేసి ఉంచాలి. వారు ఇంటికి వచ్చినప్పుడు పిల్లలతో ప్రవర్తిస్తున్న తీరును నిశితంగా గమనించాలి. తేడా కనిపిస్తే వారిని ఇంటికి రానివ్వొద్దు. పిల్లలను ఇతరులతో బయటకు పంపొద్దు.